RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి ®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:23 హైదరాబాద్, శుక్రవారం, 4 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00

## పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందంజ: సీఎం రేవంత్‌రెడ్డి



మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి ఫ్యూచర్ సిటీని అందిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ( అన్నారు. అభివృద్ధిలో తెలంగాణ, తమిళనాడు, కేరళ పోటీపడుతున్నాయని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఇండస్ట్రియల్ పార్కు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

"పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది. హైదరాబాద్‌కు దేశంలో మరే నగరంతోనూ పోటీ లేదు.. ప్రపంచ నగరాలతోనే పోటీ. రానున్న వందేళ్లను దృష్టిలో పెట్టుకుని విజన్-2047 ప్రణాళికను రూపొందించుకున్నాం. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశాలకు చెందిన కన్సల్టెంట్స్ పనిచేస్తున్నాయి. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించి వారి వ్యాపారం లాభాల్లో సాగేలా సహకరిస్తున్నాం"అని సీఎం తెలిపారు.

అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో తయారీ రంగం అభివృద్ధి ఎక్కువగా ఉందని.. 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని చెప్పారు. గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్‌ఎంఈ పాలసీ-2025ను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 4,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో పారదర్శకంగా, వేగంగా అనుమతులు ఇస్తున్నామన్నారు.

## 'ఇంధనం నిషేధం'పై ఢిల్లీ వెనకడుగు.. పాత వాహనదారులకు ఊరట

కాలం చెల్లిన వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిషేధించాలని తీసుకున్న నిర్ణయంపై ఢిల్లీ సర్కార్ వెనకడుగు వేసింది. పాత వాహనాలను గుర్తించి వాటికి ఇంధనం నిలిపివేసే వ్యవస్థ ప్రస్తుత పరిస్థితుల్లో ఆచరణలో సాధ్యం కాదని పేర్కొంది. ఇందుకు అనేక సాంకేతిక సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రారంభించిన కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేయాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజిమెంట్‌కు లేఖ రాసింది. దీంతో దేశ రాజధానిలోని పాత వాహనదారులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది.

"కాలం చెల్లిన వాహనాలకు ఇంధనం నిలిపివేసే ఆదేశాల అమలును తక్షణమే నిలిపివేయాలని కమిషన్‌ను కోరుతున్నాం. ఎన్‌సీఆర్ వ్యాప్తంగా ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేవరకు దీన్ని నిలిపివేయాలి. వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుంది'' అని సీఏక్యూఎంకు రాసిన లేఖలో ఢిల్లీ పర్యావరణశాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 'ఇంధనం నిలిపివేత' ఆచరణలో సాధ్యం కాదన్నారు.

దేశ రాజధానిలో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. కాలం చెల్లిన వాహనాలకు బంకుల్లో ఇంధనం పోయకుడదని నిర్ణయించింది. 10 ఏళ్లు పైబడిన డీజిల్, 15 ఏళ్లు పైబడిన పెట్రోల్ వాహనాలకు బంకుల్లో ఇంధనం నిలిపివేయాలన్న ఈ నిర్ణయం జులై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో పునరాలోచనలో పడిన ఢిల్లీ సర్కార్.. కొత్త విధానాన్ని తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.


## అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన కేసీఆర్




%హైదరాబాద్, జులై 03: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఆయన సీజనల్ జ్వరంతో బాధపడుతున్నారు. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి నగరంలో నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది.

అదీకాక.. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఒపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్‌కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే.

## దలైలామా వారసుడి నిర్ణయం ఆయన చేతుల్లోనే ఉంది: భారత్



: టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపికకు కచ్చితంగా తమ ఆమోదముద్ర కావాలంటూ చైనా చేసిన డిమాండ్‌ను భారత్ ( తోసిపుచ్చింది. 15వ దలైలామాను ఎన్నుకునే అధికారం పూర్తిగా ప్రస్తుత దలైలామా చేతుల్లోనే ఉంటుందని, ఆ అధికారం ఇంకెవరికీ లేదని స్పష్టంచేసింది. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ) ఈమేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'దలైలామా వారసుడిని నిర్ణయించే అధికారం, అందులో జోక్యం చేసుకొనే హక్కు ఎవరికీ లేదు. ఆ నిర్ణయం పూర్తిగా ఆయన చేతుల్లోనో లేదా ఆ సంస్థ మాత్రమే చేస్తుంది. దలైలామా స్థానం టిబెటన్లకు మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులందరికీ ఎంతో ముఖ్యమైనది' అని రిజిజు పేర్కొన్నారు. దలైలామా 90వ పుట్టిన రోజు కార్యక్రమాలు బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సుగ్లాగ్‌ఖాంగ్ ఆలయంలో ప్రారంభమయ్యాయి. దీనికి భారత్ తరఫున రిజిజు, జనతాదళ్ (యునైటెడ్) నాయకుడు లల్లన్ సింగ్‌లు హాజరుకానున్నారు.

తన వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని బుధవారం దలైలామా సోషల్ మీడియాలో పోస్టు ద్వారా తెలిపారు. భవిష్యత్తు గురువును గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే చైనా దీనిపై స్పందించింది. తర్వాత దలైలామా ఎంపికకు తమ ఆమోదముద్ర ఉండాల్సిందేనని డిమాండ్ చేసింది. వారసుడి గుర్తింపు కార్యక్రమాన్ని చైనా విధానాలను అనుసరించి నిర్వహించాలని పేర్కొంది.

1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి భారత్‌లోని ధర్మశాలలో దలైలామా ఆశ్రయం పొందుతున్నారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే దలైలామాను వారసుడిగా ఎంపిక చేయాలని బీజింగ్ ఎప్పటినుంచో ప్రయత్నిస్తుంది. చైనా ఎత్తుగడలను గమనించిన దలైలామా వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ తమదేనని తేల్చిచెప్పారు.

## తెలంగాణ నీటి వాటాను ఏపీకి దారాదత్తం చేశారు.. కేసీఆర్, హరీష్‌లపై మహేష్ గౌడ్ ఫైర్

హైదరాబాద్: మాజీ మంత్రి హరీష్‌రావుకి (టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణకు నీటి వాటాను కాలరాసిందే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు అని మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణ నీటి వాటాను ఏపీకి దారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. ఒక్క నీటి బొట్టు కూడా వదలబోమని సీఎం రేవంత్‌రెడ్డి అనుకున్నారని.. కాబట్టే బనకచర్ల పనులు ఆగిపోయాయని చెప్పుకొచ్చారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో మహేష్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకి మహేష్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ బిల్లు చేసేటప్పుడు కవిత జైల్లో ఊచలు లెక్కపెడుతోందని విమర్శించారు. కవిత లేఖ రాసింది బీఆర్ఎస్ నాయకురాలిగానా.. జాగృతి నాయకురాలిగానా అని ప్రశ్నల వర్షం కురిపించారు. పదేళ్లు బీసీలకు కేసీఆర్ చేసింది ఏంటని నిలదీశారు. బీసీల రిజర్వేషన్లు తగ్గించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కవిత ఇప్పటిదాకా బీసీల కోసం ఒక్కమాట అయినా మాట్లాడారా అని నిలదీశారు. రాజకీయ శూన్యంలో ఉన్న కవిత.. తన ఉనికి కోసమే మాట్లాడుతోందని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌తో ఆస్తి పంపకాల వాటా కోసమే కవిత తమ ప్రభుత్వం గురించి మాట్లాడుతోందని విమర్శించారు. కవిత బీసీల కోసం ఉద్యమం ఎక్కడ చేసిందని మహేష్ గౌడ్ ప్రశ్నించారు.

బీజేపీకి మహేష్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి కోసం బీసీ నాయకుడు దొరకలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అనేకమందికి అవకాశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. మైనార్టీలకు త్వరలోనే అవకాశం ఇస్తామని మహేష్ గౌడ్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉన్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే




అనిరుధ్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సీరియస్ అయ్యారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ఆధారాలు లేకుండా మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉంటామని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

రేపటి సభకు సామాజిక న్యాయ సమరభేరిగా నామకరణం చేశాం: మహేష్ గౌడ్

రేపటి సభకు సామాజిక న్యాయ సమరభేరిగా నామకరణం చేశామని మహేష్ గౌడ్ తెలిపారు. ఈరోజు (గురువారం) సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే హైదరాబాద్‌కి వస్తున్నారని చెప్పారు. రేపు (శుక్రవారం) పీఏసీ సమావేశంలో ఖర్గే పాల్గొంటారని అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో గ్రామ అధ్యక్షుల సమావేశాల్లో ఖర్గే పాల్గొంటారని చెప్పుకొచ్చారు. రేపటి సమావేశంలో పలువురు గ్రామ, జిల్లా కమిటీల అధ్యక్షులకు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది కాంగ్రెస్ నేతలు శుక్రవారం ఎల్బీ స్టేడియానికి వస్తారని మహేష్ గౌడ్ వెల్లడించారు.

## గణేష్ నిమజ్జనానికి కృత్రిమ కొలనులు





హైదరాబాద్ సిటీ: గణేష్ విగ్రహాల నిమజ్జనం కోసం ముందస్తు ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ దృష్టి సారించింది. కృత్రిమ కొలనుల ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ బుధవారం టెండర్ నోటిఫికేషన్ ప్రకటించింది. 10 మీటర్ల వెడల్పు, 20 మీటర్ల పొడవు, 1.32 మీటర్ల లోతుతో ఉండే పీవీసీ పోర్టబుల్ పాండ్‌లు అవసరమని టెండర్‌లో పేర్కొంది. 2.36 లక్షల లీటర్ల నీరు పట్టే సామర్థ్యంతో కృత్రిమ కొలనులు ఏర్పాటు చేయనున్నారు.

మొదటి విడతగా సికింద్రాబాద్ జోన్(%బావఏబఅనవతీఘఏుస ౧శీఅవ%) పరిధిలో 50 కొలనుల ఏర్పాటు కోసం బిడ్‌లు ఆహ్వానించారు. ఇతర జోన్లలోనూ అవసరాన్ని బట్టి కొలనులు ఏర్పాటు చేయనున్నట్టు ఇంజనీరింగ్ విభాగం అధికారొకరు తెలిపారు. ఆగస్టు 27న వినాయక చవితి ఉంది. నవరాత్రుల పూజల అనంతరం సెప్టెంబర్ 6వ తేదీన సామూహిక నిమజ్జనం జరిగే అవకాశముంది.

వినాయక చవితి మరునాటి నుంచే నిమజ్జనాలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆగస్టు మూడో వారంలో కొలనులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ కొలనుల్లో ఐదు నుంచి ఆరు అడుగుల విగ్రహాలు నిమజ్జనం చేయవచ్చని ఓ అధికారి తెలిపారు.

## బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థిపై నిర్ణయం తీసుకోలేదు

హైదరాబాద్: జూబ్లీహిల్స్( నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉపఎన్నికలో బీజేపీ తరఫున అభ్యర్థిని ఇంకా నిర్ణయించలేదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి) పేర్కొన్నారు. బుధవారం శ్రీరామ్‌నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను ఉప ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థి విషయమై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇంకా ఏమీ అనుకోలేదన్నారు.

కేటీఆర్ అందించిన స్క్రిప్ట్‌నే మీరూ చదువుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి(అంటున్నారన్న విలేకరుల ప్రశ్నకు.. సీఎం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ కళాశాల ఆడిటోరియంలో బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ' అంశంపై నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN

## నక్సల్స్ రహిత భారతం సాధ్యమేనా

రానున్న 2026 మార్చి ఆఖరినాటికి దేశంలో మావోయిస్టుల ఉనికి అనేది లేకుండా చేయటమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా తెగేసి మరీ చెప్పటం పరిశీలిస్తే ఆ నిర్ణయం తిరుగులేనట్లు తేలిపోయిందని చెప్పక తప్పదు. ఈ మేరకు వర్షాకాలంలోనూ నక్సల్ అణచివేత కూంబింగ్ చర్యలు కొనసాగుతాయ ని ఇటీవల ఛత్తీస్‌గడ్‌లో పర్యటించిన మంత్రి అమిత్ షా పేర్కొన్నారు కూడా.కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ ఉనికిని పూర్తి గా నిర్మూలించి వచ్చే 2026 మార్చి నాటి కి భారత్‌దేశాన్ని నక్సల్ రహిత భారత్‌గా తీర్చిదిద్దేందుకు ఆపరేషన్ కగార్‌ని ఆఖరి పోరాటంగా రంగంలోకి దించింది. అన్ని విధాల ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్లు, హెలికాప్టర్లు భారీగా సరఫరా చేసి భారీ సంఖ్యలో వివిధ రక్షణ బలగాలకు చెందిన ఆరితేరిన బృందాలను కేటాయించారు.మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన తెలంగాణ, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని అరణ్యప్రాంతాల్లోని గుట్టలపైన దాడులు, సర్చ్ ఆపరేషన్‌లు ముమ్మరం చేయటంతో మావోయిస్టులు గుక్క తిప్పుకోలేక పోతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు లొంగి పోతామని వస్తున్న వార్తలు కూడా విదితమే.ఈ ఏరివేతలో భాగంగా ఈనెల 26న ఉదయం ఛత్తీస్‌గఢ్‌లో నారాయణ్‌పూర్ జిల్లాలో భ ద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు ల మాడ్ డివిజన్‌కు చెందిన పెద్ద క్యాడర్ ఉనికి గురించి పోలీసులకు సమాచారం అందడంతో అభుజ్మాద్ ప్రాంతంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు బస్తర్ రేంజి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ పి.సుందర్‌రాజ్ వెల్లడించటం పరిశీలిస్తే నక్సల్ అణచివేతపై కేంద్ర ప్రభుత్వ కఠిన వైఖరి అర్థమవుతున్నది.మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో వారిని ఏరి వేసేందుకు జనవరి 2024 నుంచి కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రారంభించిన ఆపరేషన్ కగార్ (ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్)తో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోను, ఏఓబీలతోపాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో భద్రతా దళాలు 400 మందికి పైగా మావోయిస్టులను కాల్చి చంపాయి. ఈ ఆపరేషన్‌లో కేంద్ర సీఆర్‌పీఎఫ్, సైన్యం, కోబ్రా బెటాలియన్‌తోసహా పలు భద్రతా దళాలు పాల్గొన్నారు. ఇందులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి వారి రహస్య ప్రదేశాలు, ఆయుధాలు, ఇతర ఆయుధాల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గత మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నారాయణపూర్ జిల్లాలో సీపీఐ(మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ్ రావు అలియాస్ బసవరాజు మరణించిన వారిలో వున్నారు. నక్సలైట్ అనే పదం పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామం పే రు నుంచి ఉద్భవించింది. 1967లో ఆ గ్రామంలో రైతుల తిరుగుబాటు జరిగిం ది. ఈ ఉద్యమాన్నే 'నక్సలిజం' అన్నారు.అదే సంవత్సరం 1967లో, చారుమజుందార్, కానుసన్యాల్, జంగల్ సంతల్ నేతృ త్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వర్గం సిలిగురి గ్రూప్ అనే పేరుతో, చైనా కమ్యూనిస్ట్ విప్లవం మాదిరిగానే భారతదేశంలోనూ దీర్ఘకాలిక ప్ర జాయుద్ధాన్ని కొనసాగించాలని ఆ మేరకు మజుందార్ చారిత్రక 8 పత్రాలను రాసుకున్నారు. ఇదే నక్సలైట్ ఉద్యమానికి పునా దిగా మారింది.నవంబర్ 1967లో, సుశితల్ రే చౌదరి నేతృత్వంలోని ఒక బృం దం ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రివల్యూషనరీస్‌ను నిర్వహించింది. మావో జెడాంగ్ ఈ ఉద్యమా నికి సైద్ధాంతిక ప్రేరణను అందించాడు. భారతీయ రైతులు, దిగువ తరగతి గిరిజనులతో కలిసి బలవంతంగా ఉన్నత వర్గా ల ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆయన వా దించారు. మజుందార్ రచనలద్వారా వ్యా పించిన ఈ భావజాలం పట్ల చాలామంది పట్టణ ప్రముఖులూ ఆకర్షితులయ్యారు. ఈ రచనలు మావో, కార్ల్ మార్క్స్, వ్లాదిమిర్ లెనిన్ వంటి కమ్యూనిస్ట్ నాయకులు, సిద్ధాంతకర్తల అభిప్రాయాల నుంచి రాయబడ్డాయి. ఉద్యమం ప్రారంభ సంవత్సరాల్లో, ఒక ఉద్యమకారుడి నియామకం ముఖ్య లక్షణాలు నిస్వార్థత, స్వీయ త్యాగం చేసే సామర్థ్యం అని చారు మజుందార్ నమ్మాడు. అటువంటి నిర్దిష్ట వ్యక్తిత్వాన్ని ఉత్పత్తి చేయడానికి, సంస్థ విద్యార్థులు, యువతను అధికంగా నియమించుకుంది.ఈ కొత్త తిరుగుబాటుదారులలో విధేయ త, విప్లవాత్మక వ్యక్తిత్వాన్ని పెంపొందించడంతోపాటు నక్సలైట్లు ఇతర కారణాల వల్ల కూడా యువతను ఎంచుకున్నారు. వీ రు ఎక్కువగా విద్యార్థులు, విద్యావంతులైన యువతను చేర్చడం అవసరం. ఎం దుకంటే వారు మావో జెడాంగ్ కమ్యూనిస్ట్ బోధనలను వ్యాప్తి చేయడంలో పా ల్గొంటారు. వారి స్థావరాన్ని విస్తరించడానికి, ఉద్యమం ఈ విద్యార్థులపై ఆధా రప డింది.కమ్యూనిస్ట్ తత్వాన్ని చదువురాని గ్రామీణ, శ్రామిక-వర్గాలకు కూడా వ్యాప్తి చేయడానికి దీనిని ఉద్దేశించారు. రైతులు, శ్రామిక వర్గాలతో తమను తాము ఏకీకృతం చేసుకోగల యువతను నియమిం చుకోవడం అవసరమని, ఈ దిగువ తరగతి వర్గాల మాదిరిగానే జీవించడం, పనిచేయడం ద్వారా ఈ నియామకాలు గ్రామాలకు, పట్టణ కేంద్రాలకు కమ్యూనిస్ట్ బోధనలను తీసుకెళ్లగలవని మజుందార్ విశ్వసించాడు. క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ అనేది 1986లో పార్టీ లోపల, పార్టీ రక్షించడానికి లక్ష్యంగా పెట్టుకున్న గిరిజన గ్రామాలలో మహిళలపై తీవ్ర అసమానతను అంగీకరించిన ఫలితంగా ఏర్పడిన అనుబంధ స్త్రీవాద సంస్థ. వారు రైతుల హక్కులతోపాటు బలవంతపు వివాహం, ద్విభార్యత్వం, హింస అనే గిరిజన సంప్రదాయానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు.అయితే, 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి, అప్పటి హోం మం త్రి జానారెడ్డి ద్వారా మావోయిస్టులను శాంతిచర్చలకు ఆహ్వానించగా, అంగీకరించిన కొన్ని గ్రూపులు హైదరాబాద్‌లోనే మంజీరా అతిథి గృహంలో బసచేసి ప్రభుత్వంతో సుమారు మూడుఊ నాలుగు రో జులు చర్చలు జరిపారు.

# నిఘా నీడలో ఎమ్మెల్యేలు

విజయవాడ, జూలై 3

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కొందరు ఎమ్మెల్యేలపై ఆగ్రహంతో ఉన్నారు. నాన్ సీరియస్ కేటగిరీలోని ఎమ్మెల్యే జాబితా రెడీ అవుతుంది. ప్రజానమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యేగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించకుండా సొంత పనులపైనే దృష్టి పెడుతున్న ఎమ్మెల్యేల జాబితాను సిద్ధం చేస్తున్నట్లుసమాచారం. వారు నియోజకవర్గానికి దూరంగా వ్యాపారాలు ప్రధానంగా వ్యాపకం చేసుకుంటూ కాలం వెళ్ల దీస్తున్న ఎమ్మెల్యేలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఇప్పటికే పార్టీ రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో గైర్హాజరయిన ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు నాయుడు యాభై మంది సమావేశానికి రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని వారిని వ్యక్తిగతంగా పిలిచి క్లాస్ పీకాలని నిర్ణయించారు. . కొందరు సమావేశానికి వచ్చి సంతకాలు చేసి వెళ్లడం కూడా చంద్రబాబు సీరియస్ అయ్యారు. పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా తాను సమావేశంలో ఎక్కువ సేపు సమావేశంలో గడిపితే కనీసం కూర్చునే ఓపిక లేని ఎమ్మెల్యేలను ఉపేక్షించడం అనవసరమని భావిస్తున్నారు. ఆధ్యాత్మక పర్యటనలకు, విదేశీ పర్యటనలకు వెళ్లడం మంచిదేనని, అయితే సమయం సందర్భం ఉండాలి కదా అని చంద్రబాబు నేతలను నిలదీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేటి నుంచి తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం ప్రారంభం కానుండటం, నెల రోజుల పాటు ఈ కార్యక్రమం జరగుతుండటంతో ఇది పూర్తయిన తర్వాత వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. . నాటా, అటా సభలకు ముందుగానే అమెరికా ప్రయాణం పెట్టుకున్న వారి విషయంలోనూ చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. అయితే దీంతో పాటు ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో ఎలా పాల్గొన్నారన్న దానిపై కూడా నివేదికలు తెప్పించుకునే అవకాశముంది. ఎమ్మెల్యేలు స్వయంగా ఇంటికి వెళుతున్నారా? లేక తమ అనుచరులును పంపుతున్నారా? అన్న దానిపై కూడా నివేదికలు ఎప్పటికప్పుడు కేంద్ర పార్టీ నుంచి నివేదికలు తెప్పించుకునే అవకాశాలున్నాయి. చంద్రబాబు పార్టీ పరమైన కార్యక్రమాలను నిర్లక్ష్యం చేస్తే సహించకూడదని నిర్ణయించుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండని వారిని వదులుకునేందుకు కూడా సిద్ధమని చెబుతున్నారు. ఇప్పటికి ఏడాదే అయింది కాబట్టి.. హెచ్చరికలు జారీ చేస్తున్నారని.. సీరియస్ గా తీసుకోని వారి విషయంలో.. తర్వాత ఎంత ఒత్తిడి చేసినా ప్రయోజనం ఉండదని అంటున్నారు.

======================

# బాలినేని ప్లాన్ ఏంటీ

ఒంగోలు, జూలై 3,

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. అయితే తనకు పట్టున్న ఒంగోలు కార్పొరేషన్ కు చెందిన కార్పొరేటర్లను అయితే తనతో పాటు జనసేనలోకి తీసుకు వచ్చారు. అయితే మరికొందరు కీలక నేతలను పార్టీలోకి తీసుకు రావాలన్న ఆయన ఆలోచన మాత్రం కార్యరూపం దాల్చడం లేదని తెలిసింది. కానీ బాలినేని ఆలోచన వేరే విధంగా ఉందని అంటున్నారు. అందుకోసమే ఆయన మౌనంగా ఉన్నారని సమాచారం. బాలినేని శ్రీనివాసులు రెడ్డి జనసేనలోనే ఉండి వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. బాలినేని శ్రీనివాసులు రెడ్డి తిరిగి వైసీపీలో చేరేందుకు మాత్రం సుముఖంగా లేరు జనసేనలోనే ఉండి తిరిగి ఒంగోలు నియోజకవర్గం నుంచి 2029 ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నారట. బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్ లో ఉన్నప్పటి నుంచే ప్రకాశం జిల్లాను తన చెప్పు చేతల్లో పెట్టుకుని ఉన్నారు. నాడు పీసీసీ చీఫ్ గా, తర్వాత ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సమీప బంధువు కావడంతో ఆయన చెప్పిందే మాట.. చేసిందే శాసనం అన్నట్లు ఉండేది. నాటి నుంచి 2019 ఎన్నికల వరకూ బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పిన వారికే టిక్కెట్లు దక్కేవి. అందుకే బాలినేని అందరు నేతలతో టచ్ లో ఉంటారు. వారు కూడా బాలినేని ప్రాపకం కోసం పాకులాడేవారు. అలాంటిది 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత బాలినేని వైసీపీకి రాజీనామా చేయడం, తర్వాత జనసేనలో చేరిపోవడం ఆశ్చర్యానికి గురి చేశాయి.. 2026 నాటికి నియోజకవర్గాల పునర్విభజన పూర్తవుతుంది. ప్రస్తుతం ఉన్న రిజర్వ్ డ్ నియోజకవర్గాలు జనరల్ కు మారే అవకాశముంది. ప్రస్తుతం ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్థన్ కు బాలినేని శ్రీనివాసులు రెడ్డికి మధ్య పొసగడం లేదు. బాలినేనిని దామచర్ల శత్రువుగానే చూస్తారు. ప్రత్యర్థిగానే పరిగణిస్తానని దామచర్లజనార్థన్ ఓపెన్ స్టేట్ మెంట్ ఇచ్చారు. జనసేనలో ఉన్న కీలక నేతలు కూడా దామచర్ల జనార్థన్ వెంట ఉన్నారు. దామచర్ల జనార్థన్ సొంత ఊరు కొండపి నియోజకవర్గంలో ఉంది. కొండపి ప్రస్తుతం రిజర్వ్ డ్ నియోజకవర్గంగా ఉంది. అక్కడ మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ నియోజకవర్గంలో దామచర్ల కుటుంబానికి మంచిపట్టుంది.నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కొండపి జనరల్ కేటగిరీగా మారితే దామచర్ల జనార్థన్ ను తెలుగుదేశం పార్టీ అక్కడకు పంపే అవకాశముంది. దామచర్ల జనార్థన్ కూడా తనకు ఒంగోలు కంటే కొండపి నియోజకవర్గం సేఫ్ అని ఖచ్చితంగా భావిస్తారని బాలినేని లెక్కలు



వేసుకుంటున్నారు. అప్పుడు తాను ఒంగోలు నియోజకవర్గం నుంచి జనసేన నుంచి పోటీ చేస్తే ఖచ్చితంగా గెలుస్తానని బాలినేని శ్రీనివాసులు రెడ్డి భావిస్తున్నారు. అందుకే ప్రస్తుతానికి సైలెంట్ గాఉండాలని జనసేన అధినేత పవన్ కల్యాన్ నుంచి సంకేతాలు రావడంతో ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ఒంగోలుకు అప్పుడప్పుడు వచ్చి తన అనుచరులను కలసి చర్చించి వెళుతున్నారు.

# కూటమిలో కుదుపు తప్పదా

విశాఖపట్టణం, జూలై 3

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ నేతలు అసంతృప్తిగా ఉన్నారని అర్థమవుతుంది. తమను అస్సలు పరిగణనలోకి తీసుకోవడం లేదని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పట్టించుకోవడం లేదని గట్టిగా విశ్వసిస్తున్నట్లుంది. కూటమి ధర్మాన్ని సక్రమంగా పాటించలేదన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వ్యక్తమవుతుంది. బీజేపీ నేతలు అసహనం బహిరంగ వేదికలపైన కూడా వినిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భర్తీ అయిన నామినేటెడ్ పదవుల విషయంలోనూ బీజేపీకి అన్యాయం జరుగుతుందని, అదేమంటే తమను తక్కువ ఓటింగ్ శాతం ఉన్న పార్టీగా టీడీపీ పరిగణించడం ప్రధాన కారణంగా కమలం పార్టీ నేతలు చూస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ మద్దతు లేకపోతే గెలుపు సాధ్యమయ్యేదా? అన్నది పునరాలోచించుకోవాలని కోరుతున్నారు. నామినేటెడ్ పదవుల కోసం తమ పార్టీ కోసం, కూటమి గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలు, నేతలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా బలం లేదన్న సాకుతో తమకు ఒకటి అరా పోస్టులు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇక ముఖ్యమైన నిర్ణయాల్లో కూడా తమ పాత్ర లేకపోవడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. కూటమిలో కేవలం టీడీపీ, జనసేన లు మాత్రమే డామినేట్ చేస్తున్నాయని, తమను అస్సలు మిత్రపక్షంగా కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదని భావిస్తున్నారు. నేతలు బహిరంగ వేదికలపై బరస్ట్ అవుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంచలన కామెంట్స్ చేశారు. బీజేపీ ఓటు బ్యాంకు ఐదు శాతం ఉందని అనడమేంటని, ఇది దారుణమని అన్నారు. బీజేపీ కనుక కూటమిలో ఉండకపోతే పరిస్థితులు ఎలా ఉండేవో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ చెప్పాల్సిన అవసరం ఉందని విష్ణుకుమార్ రాజు కూటమిలో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొనేలా చేశాయి. వచ్చే ఏడాది కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయని అందులో బీజేపీకి ఐదు శాతం కేటాయిస్తామని చెబితే కుదరదని తేల్చిచెప్పారు. దశాబ్దాలుగా కష్టపడుతున్న నాయకులకు సీటు విషయంలో ఎగనామం పెట్టడం కుదరదని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు. ఇది కూటమి పార్టీలో చర్చనీయాంశమైంది.

## గిరిజన మహిళను నిర్బంధించిన పోలీసులు గిరిజన సంఘాల అందోళన

హైదరాబాద్

సివిల్ వివాదం లో సీపీఐ నేత అయిన ఓ గిరిజన మహిళను పోలీసులు నిర్బంధించడంతో సైదాబాద్ పోలీస్ స్టేషన్ ముందు గిరిజన సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు.

సీపీఐ నేత సక్రి భాయ్ గురువారం ఉదయం 8 గంటలకు బాధితుల తరుపున సైదాబాద్ పీఎస్ కు మాట్లాడేందుకు వచ్చారు. ఆమెను చూసిన సెక్టార్ ఎస్ఐ సాయి కృష్ణ దుర్భాషాలడుతూ ఫోన్ లాక్కొని పీఎస్ లో కూర్చో బెట్టారు. మధ్యాహ్నం వరకు పీఎస్ లో బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. దింతో విషయం తెలుసుకున్న సేవాలాల్ బంజారా సంఘము నేతలు పీఎస్ ముందు బైఠాయించారు. అక్రమంగా నిర్బంధించిన ఎస్ ఐ సాయి కృష్ణనుసస్పెండ్ చేసే వరకు ధర్నా విరమించబోమని కూర్చున్నారు. ఎస్ఐ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేతలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు.

# సిద్ధార్ధ కౌశల్ రాజీనామా వెనుక...

గుంటూరు, జూలై 3, ( ఆంధ్రప్రదేశ్ ఐపీఎస్ సిద్ధార్థ్ కౌశల్ స్వచ్ఛంద పదవి విరమణకు దరఖాస్తు చేశారు. యువ ఐపీఎస్ అధికారి అని కౌశల్ వీఆర్ఎస్ కు దరఖాస్తు చేయడంతో వైసీపీ నేతలు ప్రభుత్వ వేధింపుల కారణంగానే రాజీనామా చేస్తున్నట్లుగా ప్రచారం ప్రారంభించారు. దీంతో సిద్దర్థ కౌశల్ ఓ లేఖ విడుదల చేశారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలనే తన నిర్ణయం వ్యక్తిగత కారణాలు, దీర్ఘకాలిక లక్ష్యాలు, అలాగే కుటుంబ ప్రాధాన్యతల కారణంగా వీఆర్ఎన్ నిర్ణయం తీసుకున్నాననిప్రకటించారు. వేధింపులు లేదా ఇతర బలవంతం కారణంగా తన రాజీనామా జరిగిందనే ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు, అలాంటి వాదనలను "నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవి" అని ఆయన స్పష్టం చేశారు. సిద్ధార్థ కౌశల్ తన సర్వీసు విషయంలో సంతృప్తిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తన పదవీకాలాన్ని తన జీవితంలో "అత్యంత సంతృప్తికరమైన , సుసంపన్నమైన ప్రయాణం" అని పేర్కొన్నారు. సిద్ధార్థ కౌశల్ 2000 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన సర్వీసులో కేవలం పదిహేనేళ్లు మాత్రమే అయ్యాయి. కృష్ణ, ప్రకాశం వంటి పలు జిల్లాల్లో ఎస్పీగా పని చేస్తున్నారు. ప్రస్తుతం డీజీపీ ఆఫీసులో అడ్మిన్ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఆయనకు పోస్టింగులు దక్కాయి. ఆయనపై ఎలాంటి విచారణలు జరగడలేదు. ఆరోపణలు కూడా లేవు. టీడీపీ నేతలు కూడా ఆయనపై ఎలాంటి ఆరోపణలు చేయలేదు. అయితే వైఎస్ఆర్‌సీపీ హయాంలో పలువురు ఐపీఎస్ అధికారులు నిబంధనలను అతిక్రమించి.. టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టారని,అలాంటి వారిని వదిలేది లేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఏడాది నుంచి చాలా మంది ఐపీఎస్‌లకు పోస్టింగులు దక్కలేదు. ఇంటలిజెన్స్ చీఫ్ గా పని చేసిన సీతారామాంజనేయులు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. సినీ నటి జత్వానీ కేసులో పలువురు ఐపీఎస్‌లు జైలుకు వెళ్లాల్సి ఉండగా.. ప్రభుత్వం చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో వారు ప్రస్తుతానికి బయటే ఉన్నారు. అయితే వారికి పోస్టింగులు లభించలేదు. ఇలాంటి వారి జాబితాలో సిద్ధార్థ కౌశల్ ఎప్పుడూ లేరు. ఐపీఎస్ గా ఆంధ్రప్రదేశ్ లో పని చేయడం కన్నా.. ఢిల్లీలో కుటుంబంతో ఉండాలని.. ఆయన కుటుంబం ఒత్తిడి చేసినట్లుగా చెబుతున్నారు. కార్పొరేట్ సంస్థలో మంచి పోస్టింగ్ లభించడంతో ఆయన వీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. ఏపీ ప్రభుత్వానికి, సీనియర్లకు, సహచరులకు, జూనియర్లకు, మరియు తనకు సేవ చేసే అవకాశం ఇచ్చిన ప్రతి పౌరుడికి కృతజ్ఞతలు తెలిపారు. తమ మద్దతుతోనే తాను ఈ స్థితికి చేరినట్టు పేర్కొన్నారు.ముందుకు సాగుతున్న తాను, సమాజానికి కొత్త రీతుల్లో సేవ చేయాలని, కృతజ్ఞత, స్పష్టత, దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని తన సంకల్పాన్ని తెలియజేశారు. సిద్ధార్థ కౌశల్ దాదాపు నెల రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. గతంలో కృష్ణా, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో ఎస్పీగా ఆయన కీలక బాధ్యుతలు నిర్వర్తించారు. వీఆర్ఎస్‌ను ప్రభుత్వం ఆమోదించిన తరుువాత ఢిల్లీలో కార్పొురేట్ కంపెనీలో చేరాలని భావిస్తున్నట్టు టాక్.

## 14న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తెల్ల రేషన్ కార్డుల పంపిణీ పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

నల్లగొండ జూలై 3

: ఈ నెల 14న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తెల్ల రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రా రంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండల కేం ద్రంలో ఈ కార్యక్రమం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అర్హులైన లబ్ధిదారుల ధరఖాస్తులన్నింటినీ ఈ నెల 13 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అర్హులందరికీ తెల్లరేషన్ కార్డుల మంజూరు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తోందని అన్నారు. ఎటువంటి వివక్ష లేకుండా అర్హులైన పేదలకు తెల్లరేషన్ కార్డుల మంజూరు ఉంటుందని భరోసా ఇచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి 89.73 లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కేవలం 49 వేల తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేశారని అదీ కూడా ఉప ఎన్నికలు వచ్చినప్పుడు లబ్ధి పొందేందుకు మాత్రమే చేశారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం లక్షలాది మంది అర్హులైన నిరుపేదలకు కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయలేక పోయిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి వేసిన చారిత్రకపు అడుగు తెల్ల రేషన్ కార్డుల మంజూరు అని అభివర్ణించారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర జనాభాలో 3.10 కోట్ల మందికి అంటే 84 శాతానికి సన్న బియ్యం చేరుతున్నాయని అన్నారు.సాలీనా సన్నబియ్యంపై తమ ప్రభుత్వం రూ.13 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ఎంపీ లక్ష్మణ్

తిరుమల

తెలంగాణ ఎంపి లక్ష్మణ్ గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రభుత్వం,టీటీడీ బోర్డు తిరుమలను అవినీతిమయం చేశారు. గతంలో జరిగిన అవకతవకలు, అవినీతి పట్ల రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆయుర్వేద మందులను తయారీ చేసే యంత్రాలు రూ. 3.90 కోట్ల రూపాయలను పెట్టి నాసిరకం యంత్రాలను కొన్నారు. పరకామణి,అన్నదానంలో నాసిరకం భోజనం, ఆయుర్వేదం ఫార్మసీలో యంత్రాల కొనుగోలు, లడ్డూల్లో కల్తీ వంటివి భక్తుల్లో ఆందోళన కలిగిస్తుంది. గతంలో టీటీడీలో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తాను. అవినీతి, అక్రమాలు చేసిన వారిపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని అన్నారు.

## రక్తం అందకపోవడంలో బాలింత మృతి

హైదరాబాద్

మలక్పేట్ ఏరియాలో విషాద ఘటన కలకలం రేపుతోంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నెమలిక అనే గర్భిణి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తరువాత ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అత్యవసరంగా రక్తం అవసరమైంది. అయితే ఆసుపత్రిలో అందుబాటులో బ్లడ్ బ్యాంక్ లేకపోవడం, వెంటనే రక్తం అందించలేకపోవడం, వైద్య సహాయం ఆలస్యం కావడం వలన నెమలిక మృతి చెందారు. బ్లడ్ కోసం కోఠి మెటర్నిటి ఆసుపత్రికి బాలింతను తరలించిన సకాలంలో వైద్యం అందక మృతి చెందడం జరిగింది. ఈ హఠాన్మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. తాము నమ్మిన ప్రభుత్వ వ్యవస్థ చేతుల్లోనే ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నూజివీడు సీడ్స్ ముందు రైతుల అందోళన

కుత్బుల్లాపూర్

దూలపల్లి లోని నూజివీడు సీడ్స్ కంపెనీ వద్ద మెదక్,చిన్న శంకరం పెట్ మండల రైతులు ఆందోళనకు దిగారు. తమ కు రావాల్సిన ధాన్యం డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. 40 రోజులకు ఇవ్వాల్సిన ధాన్యం డబ్బులు 2 నెలలు గడుస్తున్నా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడగడానికి వస్తే యాజమాన్యం నిర్లక్ష్య సమాధానం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. అప్పులు చేసి,పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారంటూ కంపెనీ ముందు రైతులు బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని, కంపెనీ ముందు టెంట్ వేసి ఆందోళన చేసారు.

======================

## బొగ్గారపు శరత్ చంద్ర ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాలు పంపిణి

హైదరాబాద్ జూలై 3

;కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొగ్గారపు శరత్ చంద్ర ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ ఇందిరా నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత పుస్తకాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగాఎంఎల్సి బొగ్గారపు దయానంద్ గుప్తా, టిజిఆర్టిసి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణి చేశారు. పాఠశాల భవన నిర్మాణం పనులను మధ్యలోనే నిలిపివేశారని ఉపాధ్యాయులు, స్థానిక కాంగ్రెస్ నేతలు దయానంద్ గుప్తా, రాంరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లగా... ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చేస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రతి సంవత్సరం 50 వేల పుస్తకాలు పంపిణి చేస్తున్న శరత్ చంద్రను వారు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శశిదర్ రెడ్డి, వెంకటేష్ చారి, రవి కేశవ్ నాయుడు, చిన్నా గౌడ్, చరణ్, అరుణ్, విజయ రంగ, బంటి తదితరులు పాల్గొన్నారు

## పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయి: పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట : పదోన్నతులు జీవన శైలిని మార్చే విధంగా ప్రోత్సాహాన్ని కలిగిస్తాయి కానిస్టేబుల్ నుండి హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ పొందిన వారి వివరాలు:టి. రాజేశం, పోలీస్ స్టేషన్ తొగుట,యస్. ఉదయ్ కుమార్, పోలీస్ స్టేషన్ రాయపోల్. కె. సుధాకర్ రెడ్డి, పోలీస్ స్టేషన్ టూ టౌన్. వి. యేసు స్వామి, ఎస్బి సిద్దిపేట్. కె. రవిరాజు, పోలీస్ స్టేషన్ సిద్దిపేట రూరల్. యాదయ్య, సిసిఎస్ సిద్దిపేట. కె. అంజిరెడ్డి, పోలీస్ స్టేషన్ దుబ్బాక.ప్రమోషన్ పొందిన సిబ్బంది మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీస్ కమిషనర్ అభినందించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు, పదోన్నతులు పొందిన పోలీస్ సిబ్బంది మన జిల్లాలో మనము ప్రజల గురించి పనిచేస్తున్నామని రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు, సీనియార్టీ ప్రకారం అందరికీ ప్రమోషన్స్ రావడం జరుగుతుందన్నారు. హెడ్ కానిస్టేబుల్ గా ప్రమోషన్ రావడంతో ఆనందం వ్యక్తం చేసి ఉన్నత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్లకు చెక్...

నెల్లూరు, జూలై 3, (

వైసీపీ యూత్ వింగ్ మీటింగ్ లో జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను పాదయాత్ర చేపట్టబోతున్నానని, అప్పుడు అందర్నీ ప్రత్యేకంగా కలుస్తానన్నారు. యూత్ వింగ్ నేతల అంతిమ లక్ష్యం ఎమ్మెల్యే కావడం అని ఉద్బోధించారు. జనంలోకి వెళ్లి, జనంతో మమేకమై స్థానికంగా బలపడాలన్నారు, సోషల్ మీడియాని వాడుకోవాలన్నారు. ఒకరకంగా ఇటీవల కాలంలో జగన్ పెట్టిన అన్ని మీటింగుల్లోకి ఇదే కాస్త ఆసక్తికరంగా ఉంది. మిగతా నేతలతో మొక్కుబడిగా మాట్లాడి ముగించిన జగన్, యువ నేతలతో మాత్రం పార్టీ భవిష్యత్ ప్రణాళికలు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ సీనియర్లకు చెక్ పెడతారనే భావన కలిగించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజకీయాల్లో ఎదుగుదలకు మంచి అవకాశం ఉంటుందని యువనేతలకు చెప్పారు జగన్. “ఎదగడం మీ చేతుల్లో ఉంది. మిమ్మల్ని పెంచడం నా చేతుల్లో ఉంది” అని వారిలో ధీమా కల్పించారు. గతంలో తాను పార్టీ పెట్టినప్పుడు అందరూ కొత్తవాళ్లే ఉన్నారని, తనని నమ్మి తనతో నడిచినవారంతా ఉప ఎన్నికల్లో గెలిచారన్నారు జగన్. సీనియర్లకు చెక్.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సీనియర్ నేతల ప్రవర్తన ఒకలా ఉంది, అధికారం కోల్పోయిన తర్వాత చాలామంది సైలెంట్ అయ్యారు. పెద్దిరెడ్డి, పేర్ని నాని, అంబటి వంటి ఒకరిద్దరు నేతలు మాత్రం హడావిడి చేస్తున్నారు. మిగతా చాలామంది నేతలు నియోజకవర్గాల్లో ఉండి కూడా, ప్రజల వద్దకు వెళ్లడం లేదు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా లేరు. వారి వ్యవహార శైలి జగన్ కు నచ్చడం లేదని తెలుస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు సీనియర్లకు పెద్దపీట వేసినా, ప్రస్తుతం వారు పార్టీకోసం ఉపయోగపడటం లేదు అని డిసైడ్ అయ్యారు జగన్. అందుకే పార్టీకి కొత్త రక్తం ఎక్కించేందుకు సిద్ధమయ్యారు. తొలి అడుగు యూత్ అధ్యక్షుడిగా వేయాలని, చివరి అడుగు ఎమ్మెల్యే కావడం అని చెప్పారు జగన్. వైయస్ఆర్ సీపీలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా మొదటి అడుగు వేయండి.. ఎమ్మెల్యేగా పార్టీలో మీ చివరి అడుగు పడుతుంది టార్గెట్ 2029. టీడీపీలో కూడా సీనియర్లకు అవకాశాలు తగ్గాయనే చెప్పాలి. మంత్రి మండలి కూర్పులో సీనియర్లతో పాటు, యువనేతలకు కూడా పెద్దపీట వేశారు సీఎం చంద్రబాబు. ఒకరకంగా యువ నాయకులను తనతో కలుపుకొని వెళ్తున్నారు లోకేష్. వైసీపీలో ఆ పరిస్థితి ఇప్పటి వరకు లేదు. సీనియర్లతోనే జగన్ మాట్లాడుతున్నారు, వారితోనే మీటింగ్ లు పెడుతున్నారు, వారికే అన్ని బాధ్యతలు అప్పగించారు. కానీ ఇటీవల ఆయన వైఖరి మారినట్టుంది. సీనియర్లకు చెక్ పెట్టేందుకు డిసైడ్ అయిన జగన్, యువ నాయకత్వానికి తాజా మీటింగ్ లో భరోసా ఇచ్చారు. ఈరోజు యువనాయకులంతా రేపటి ఎమ్మెల్యేలు అంటూ వారిలో ఆశ కల్పించారు. 2029లో గట్టి పోటీ ఇవ్వాలంటే సీనియర్లు సరిపోరని, యువ నాయకత్వంతోనే ఆ పని అవుతుందని గ్రహించారు జగన్. సీనియర్ నాయకులు ప్రెస్ మీట్లు పెట్టి విమర్శించే లోపు, యువ నాయకులు సోషల్ మీడియాలో హడావిడి చేయగలరు. ఆ తేడాని సరిగ్గా ఉపయోగించుకోవాలని డిసైడ్ అయ్యారు జగన్. మరి యువ నాయకత్వంలో కూడా వారసులకే అవకాశాలు ఉంటాయా, ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి నిలదొక్కుకున్నవారిని పార్టీలో ఎదగనిస్తారా అనేది వేచి చూడాలి

## నోటిపై భూ సమీకరణ పథకం నిబంధనలు-2025

విజయవాడ, జూలై 3,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ పథకం (రూపకల్పన, అమలు) నిబంధనలు-2025ను నోటిఫై చేసింది. ఈ నిబంధనలు నవశక రాజధాని అమరావతిని నిర్మించడానికి భూమిని సేకరించే ప్రత్యేక పద్ధతిని నియంత్రిస్తాయి. ఈ నిబంధనలు ‘రాజధాని ప్రాంతానికి’ వర్తిస్తాయని, అయితే ‘రాజధాని నగరం’ ప్రాంతానికి మాత్రం ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర భూ సమీకరణ పథకం (రూపకల్పన, అమలు) నిబంధనలు-2015 వర్తిస్తాయని పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ తెలిపారు.”ప్రభుత్వ సంకల్పం మేరకు ‘ప్రజా రాజధాని’ని నిర్మించడానికి, అలాగే విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఇతర అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మించడానికి, భూసేకరణ యంత్రాంగాన్ని స్వచ్ఛంద పథకంగా రూపొందించాం” అని కుమార్ ఒక ప్రభుత్వ ఉత్తర్వు లో పేర్కొన్నారు. ఇది భూయజమానులు, ప్రభుత్వం/అధికార సంస్థ మధ్య పరస్పర ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటుందని కుమార్ తెలిపారు. భూసేకరణలో ఇది ఒక ప్రత్యేక పద్ధతి అని, దీనికి ‘భూ సమీకరణ పథకం’ అని పేరు పెట్టారని ఆయన అన్నారు.’భూ సమీకరణ పథకం’ నిబంధనలు ప్రభుత్వం అమరావతి, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు, విజయవాడలను కలిపి ‘మెగా సిటీ’గా మార్చాలని యోచిస్తున్న సమయంలో వచ్చాయి. ఈ ప్రయత్నం ద్వారా ఇప్పటికే అమరావతి కోసం ప్రభుత్వం వద్ద ఉన్న 54,000 ఎకరాలకు అదనంగా మరో 40,000 ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ‘భూ సమీకరణ పథకం’ రాజధాని ప్రాంత అభివృద్ధి కోసం రూపొందింది. ఇందులో రైతులు, యజమానులు లేదా యజమానుల బృందం యాజమాన్యంలోని భూములను ఒక అభివృద్ధి పథకం కింద అధికార సంస్థ ఏకీకృతం చేస్తుంది. సమీకరణ పథకం’ అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ద్వారా రూపొందిన మెరుగైన పథకం. 2013 నాటి భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ చట్టంలోని సెక్షన్లు 107, 108 కింద ఇది సాధ్యమైంది.”ఈ పథకం విస్తృత లక్ష్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నివాసయోగ్యమైన, సుస్థిరమైన రాజధాని ప్రాంత నిర్మాణంతో ప్రభావితమైన కుటుంబాలకు, అలాగే రాజధాని ప్రాంతంలోని రైతులు, భూయజమానులకు న్యాయం చేయడం. మెరుగైన పరిహారం పొందడానికి, రాష్ట్ర అభివృద్ధి ప్రక్రియలో వారిని భాగస్వామ్యం చేయడానికి కూడా ఇది ఉద్దేశించింది” అని ముఖ్య కార్యదర్శి అన్నారు. భాగస్వాములైన భూయజమానులకు పునర్నిర్మించిన ప్లాట్‌తో పాటు అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలు, ఇతర ప్రయోజనాలతో సరసమైన పరిహారం లభించేలా ఈ పథకం రూపొందిందని కుమార్ వివరించారు.

## సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చి విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలి

సిద్దిపేట

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలు, గురుకుల జూనియర్ కళాశాలు, సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చి విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారుగురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నుండి మంజూరైనా నిధులను కళాశాలలకు పెయింటింగ్, టేబుల్స్, డ్యూయల్ డెస్క, విండోస్ రిపేర్ చేయించుకోవాలని అధికారులకు తెలిపారు. ఇంజనీరింగ్ ఏజెన్సీ నిర్వహించే అన్ని పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అత్యవసర తాగునీటి వసతి, మరియు మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని ఇంజనీరింగ్ ఏజెన్సీ కావలసిన వాటికి ఎస్టిమేట్ తయారు చెయ్యాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి కళాశాలకు రావడానికి బస్ సౌకర్యం కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఆర్టిసి అధికారులతో సమావేశం నిర్వహించి కావలసిన రూట్ల కు బస్ సౌకర్యం మరియు కొన్ని కళాశాలలకు బస్ పరిధి పెంచేందుకు నోట్ తయారు చేసి ఆయా రీజనల్ మేనేజర్ లెటర్ పెట్టాలని తెలిపారు. జూనియర్ కళాశాల మరియు అన్ని హాస్టల్ లలో అన్ని సౌకర్యాలు సమకూర్చి ఒక్క సీటు మిగలకుండా విద్యార్థులు చేరేందుకు చర్యలు తీసుకోవాలి. అధికారులు మరియు ప్రిన్సిపల్స్ విద్యార్థుల పట్ల మాన వీయ కోణం లో ఆలోచించాలని, గజ్వేల్ ఎడ్యుకేషన్ హబ్ మరియు కొన్ని కళాశాలలో రాత్రి వేళల్లో ఆకతాయిలు చేరి మద్యం తాగుతూ, కిటికీలు, డోర్, టాయిలెట్స్ ఇతరత్రా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని తెలపగా సీసీ కెమెరాల పిట్టింగ్ చేసుకోవాలని పోలీస్ అధికారులకు లెటర్ పెట్టీ పికెటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతలో రాజిపడవద్దని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ రవీందర్ రెడ్డి, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డిబిసీడీవో నాగరాజమ్మ, డిఎస్సిడిఓ కవిత, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్పై దాడి

### ఉద్యోగుల నిరసన

హైదరాబాద్ మహబూబ్నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్పై వైస్ చైర్మన్ విజయ్ కుమార్ దాడి చేయడాన్ని నిరసిస్తూ మలక్పేటలోని గంజ్లో టీఎన్జీఓ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. దాడికి నిరసనగా రాష్ట్రంలోని అన్ని మార్కెట్ కమిటీ కార్యాలయాల ఆవరణలో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దాడి చేసిన వైస్ చైర్మన్పై మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, ఆయనను ఆ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.

# రెడ్ బుక్‌లో నెక్ట్స్ ఎవరు...

తిరుపతిచ జూలై3, (

ఎట్టకేలకు వల్లభనేని వంశీకి బెయిల్ దొరికింది ...140 రోజుల జైలు జీవితానికి మోక్షం లభించింది ...అయితే ఇప్పుడే వంశీని జైలు జీవితం విడిపోతుందా! లేక ఇంకేమైనా ఈ కథలో టెస్టులు ఉంటాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయి. అయితే అనవసరంగా నోరు పారేసుకుని, రెడ్ బుక్ బాధితులుగా మారిన అనేక మంది ,ఇప్పటికే కారాగారంలో ఊసలు లెక్కపెట్టి వచ్చారు.... అందులో సినిమా రంగానికి చెందినవారు, పత్రికారంగానికి చెందినవారు, రాజకీయ రంగానికి చెందినవారు అన్న తేడా లేకుండా, ఎవరీ లెక్కలు వాళ్ళకి అప్పజెప్తుంది రెడ్బుక్ ....అయితే అందరికన్నా అగ్ర తాంబూలం ఈ రెడ్ బుక్కులో ఎవరికి అందబోతుంది ....ఇప్పటికీ రేట్ బుక్ లో మొదటి పేజీ మాత్రమే చూస్తున్నారని చెబుతున్న టిడిపి కార్యకర్తల మాటల్లో ఆంతర్యం ఏంటి ? రెడ్ బుక్ లో తదుపరి పేజీల్లో ఎవరెవరి పేర్లు పొందుపరిచి ఉన్నాయి. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది ...అనే సామెత ఉంది ....పెద్దవాళ్లు ఊరికే అనలేదా మాట ...ఎక్కడైతే అనవసరంగా నోరు పారేసుకుంటామమో ,అక్కడ మన ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది... అని పెద్దలు ముందే గమనించబట్టి ఈ సామెతలు కనిపెట్టి ఉంటారు.... అయితే ఇటీవల రాజకీయాల్లో ఈ మాటను ఎవరు వినడం లేదు సరి కదా, పెడ చెవిన పెడుతున్నారు ... దీంతో వాళ్లు వీళ్ళు అని తేడా లేకుండా, ప్రతి ఒక్కరు సమస్యల్లో ఇరుకుంటున్నారు .. అలాంటి బాపతే గడిచిన కొన్నాళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో జైలలో కాలక్షేపం చేస్తున్న నాయకులు... మాజీ ఎంపీ నందిగం సురేష్, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్, సినీ నటుడు పోసాని కృష్ణమురళి, బోరుగడ్డ అనిల్ కుమార్, ఇప్పుడు తాజాగా 140 రోజులు జైలు జీవితానికి బెయిల్ తీసుకున్న వల్లభనేని వంశీ,,, వీరంతా వేరే వేరే కేసుల్లో జైలు జీవితం అనుభవించిన దీనంతటి సారాంశం అధికారంలో ఉన్నప్పుడు నోరు పారేసుకున్నారు అన్న విషయం తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు తెలియంది కాదు.... అయితే ఇప్పటికీ వల్లభనేని వంశీ జైలు జీవితం కథకు ఫుల్ స్టాప్ పడినట్లేనా లేక ఇతర వ్యవహారాల్లో మళ్ళీ శ్రీకృష్ణ జన్మస్థానం వల్లభనేని వంశీని వెంటాడుతుందా అన్న ప్రశ్న కూడా ఉంది. ఒక్క వల్లభనేని వంశీ నే కాదు,... ఎవరైతే గతంలో నోరు పారేసుకున్నారు వాళ్ళందరికీ శ్రీకృష్ణ జన్మస్థానం రుచి చూపించాలని ప్రయత్నం అయితే గట్టిగానే జరుగుతుంది ....అలాంటప్పుడు ఒళ్ళు ,నోళ్ళు దగ్గర పెట్టుకొని మసులుకోవాలన్న హెచ్చరికలు కూడా వినపడుతున్నాయి... ఈ హెచ్చరికలు విషయం పక్కనపెడితే, ఇప్పుడు రెడ్ బుక్ లోని మొదటి పేజీ నడుస్తుంది ....ఈ రెడ్బుక్ లోని మొదటి పేజీలో ఇంకెన్ని పేర్లు ఉన్నాయి? చివరి పేజీకి వచ్చేసరికి ఎంతమంది నాయకులు జైల్లో మగ్గాల్సి వస్తుంది అన్న చర్చ కూడా జరుగుతుంది ....ఇక తాజాగా వినిపిస్తున్న పేర్లు టిడిపి వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తుంది... టిడిపి సోషల్ మీడియాలో కొందరి వైసీపీ నాయకుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి....సీదిరి అప్పలరాజు నుండి ,కొడాలి నాని వరకు ఆ లిస్టులో పేర్లు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. అందులో ప్రముఖంగా వినిపిస్తున్న పేర్లు, సీదిరి అప్పలరాజు , రాంగోపాల్ వర్మ ,శ్రీరెడ్డి మాజీ మంత్రులు,పేర్ని నాని , జోగి రమేష్, అంబటి రాంబాబు విడదల రజిని , మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ లాంటి వారి పేర్లు రెడ్ బుక్ లో ప్రముఖంగా ఉన్నట్లు చర్చ జరుగుతుంది.... అయితే ఇందులో ఇప్పటికే కొంతమందికి,కొన్ని కేసులలో నోటీసులు వచ్చిన, తమకున్న టాలెంట్ ఉపయోగించి కోర్టులకు వెళ్లి కొంత ఉపశమనం పొందారు ...అయితే రాబోయే రోజుల్లో వీళ్ళందరికీ మరోసారి రెడ్బుక్ వ్యవహారాన్ని పరిచయం చేపించాలని టిడిపి శ్రేణులు ఉవ్విల్లు ఊరుతున్నట్లు తెలుస్తోంది.. . చంద్రబాబుకు మైండ్ పోయిందని ట్రీట్మెంట్ చేయించాలని, వయసును కూడా గౌరవించకుండా ఇష్టరాజ్యంగా మాట్లాడిన మాజీ మంత్రి అప్పలరాజు, ఇప్పుడు రెడ్ బుక్ లోని మరో పేజీలో ఉన్నట్లు చర్చ జరుగుతుంది అంతేకాదు వల్లభనేని వంశీకి ఆత్మీయ మిత్రుడు, టిడిపికి గతంలో కొరకరాని కొయ్యగా మారి ఇప్పుడు చడిచప్పుడు లేకుండా అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో మకం వేసి ఉంటున్న కొడాలి నాని కి , రెడ్ బుక్కు లో ప్రముఖ పేజీ ఉన్నట్లుగా చర్చ జరుగుతుంది .... దీంతోపాటు టిడిపిపై తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు తో పాటు ఇటీవల పోలీసులపై కూడా దూకుడు ప్రదర్శించిన, మాజీ మంత్రి అంబటి రాంబాబు, జగన్ పర్యటనలో ఇద్దరు వ్యక్తుల మరణాలకు కారణమైన నాయకులకు త్వరలోనే కేసుల చిట్టా పరిచయం కాబోతుందని ప్రచారం జరుగుతుందిమరి రాబోయే రోజుల్లో కారాగారంలో కాలక్షేపం చేసే నాయకులు వీళ్లేనా? టిడిపి క్యాడర్ చేసుకుంటున్న,చర్చలో నిజం ఎంతో అబద్ధం ఎంతో టిడిపి నేతలకే తెలియాలి ....అయితే టిడిపి కార్యకర్తలు మాత్రం చేసిన తప్పుకే వాళ్ళు శిక్ష అనుభవిస్తున్నారు కానీ, టిడిపి వ్యక్తిగతంగా ఎవరిని టార్గెట్ చేయలేదనేది చెబుతున్న మాట .... సరే ఎవరి మాట ఎలా ఉన్నా జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే, ఒక పద్ధతి ప్రకారం రెడ్ బుక్ లో పేజీల్లో ఉన్న నాయకులకు ట్రీట్మెంట్ జరుగుతుందనేది వాస్తవం. మరి ఈ తదుపరి పేజీల్లో ఉండే తదుపరి నాయకులు ఎవరో కాలమే నిర్ణయించాలి

## బర్కత్ పల్లి లో తాగునీటికి కటకట

## కాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ముట్టడి

పరిగి

పదిహేను రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా పంచాయతీ సెక్రటరీ పట్టించుకోవడం లేదంటూ బర్కత్ పల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వికారాబాద్ జిల్లా పరిగి మండలం బర్కత్ పల్లి గ్రామానికి చెందిన మహిళలు, కొందరు యువకులు పరిగి -వికారాబాద్ బర్కత్ పల్లి గేటు వద్ద ఉదయం రోడ్డుపై బైఠాయించారు. అక్కడి నుంచి పరిగి ఎంపీడీవో కార్యాలయం వరకు కాలి బిందెలతో నిరసనగా వచ్చి ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం కానీ ఒక్క ట్యాంకర్ కు 500 చొప్పున చెల్లించాలని పంచాయతీ సెక్రెటరీ కోరినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే ట్రాక్టర్ కు డీజిల్ కావాలని అడిగినట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించే వరకు ఎంపీడీవో కార్యాలయం నుంచి వదిలి వెళ్ళేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్కు మెమొరడం అందించి వెళ్ళిపోయారు.

ఉదయం సమయం పదిన్నర అయినా ఎంపీడీవో కార్యాలయానికి రాకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్ కి మెమొరడం అందించి వెళ్లిపోయారు.

# గన్నవరం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దొంగల హల్చల్

గన్నవరం జూలై 3,

గన్నవరం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అర్ధరాత్రి దొంగలు పడినట్లు కార్యాలయం సిబ్బంది గుర్తించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం తెరిచే సమయానికి బీరువాలోని డాక్యుమెంట్స్ స్టాంప్స్ చల్లా చెదురుగా పడి ఉండటానికి గమనించిన సిబ్బంది పై అధికారులకు సమాచారమిచ్చారు. , సదరు ఘటనపై గన్నవరం పోలీస్ స్టేషన్లో సబ్ రిజిస్టర్ పిర్యాదు చేసారు. జిల్లా రిజిస్టర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గన్నవరం పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

# కుట్ర రాజకీయాలకు అడ్రస్ గా మారిన తాడేపల్లి ప్యాలెస్

బాపట్ల జూలై 3,

సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా రేపల్లే నియోజకవర్గం నగరం మండలం సజ్జావారిపాలెంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు.

సజ్జవారిపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ సింగయ్య మరణంపైనా వైసీపీ నేతలు డ్రామా చేయబోయారు. సింగయ్య భార్యకు ఇష్టం లేకున్నా ఆమె చేత అబద్దాలు చెప్పించారు. తాడేపల్లి ప్యాలెస్ కుట్ర రాజకీయాలకు అడ్రస్ గా మారింది. జగన్ రెడ్డి రథ చక్రాల కింద పడి దళితుడైన సింగయ్య చనిపోయాడు. జగన్ రెడ్డి బ్యాచ్ సిగ్గు లేకుండా పేదవాడి ప్రాణానికి విలువ లేకుండా చేశారు. సింగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని నారా లోకేష్ భావిస్తున్నా.రు. ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విధంగా జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. యువకులను తీవ్రవాదులుగా మార్చేలా రెచ్చ గొడుతున్నాడు. కానీ రాష్ట్ర భవిష్యత్తుకు దుష్టశక్తులుగా మారిని వారిని కచ్చితంగా అడ్డుకుంటాం. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని అన్నారు.

# పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్ధికి పాము కాటు

జగిత్యాల

జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పాము సంచారం కలకలం రేపింది. రాత్రి డిన్నర్ సమయంలో హ్యాండ్ వాష్ చేసుకునేందుకు వెళ్ళిన 8వ తరగతి విద్యార్థి నవనీత్ ను విష పురుగు కాటు వేసింది. నవనీత్ కాలుకు రెండు కాట్లు ఉండడంతో కోరుట్ల ఆసుపత్రికి తరలించారు.

కాటేసింది పామా?, విషపురుగా స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు, టీచర్స్ అయోమంలో వున్నారు. కాటుకు గురైన విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్ఉలు స్పష్టం చేసారు. గత ఏడాది పాము కాటుతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మరో ముగ్గురు విద్యార్థులకు ప్రమాదం తప్పింది.

డిన్నర్ సమయంలో హ్యాండ్ వాష్ చేసుకునేందుకు వెళ్లినప్పుడు ఏదో కుట్టినట్లు అనిపించిందని వెంటనే టీచర్స్ సమాచారం ఇచ్చానని విద్యార్థి చెబుతున్నాడు. డాక్టర్ మాత్రం ఏమి కాటు వేసిందో స్పష్టత లేదని గతంలో జరిగిన ఘటనలు దృష్టిలో పెట్టుకొని స్నేక్ బైట్ గా అనుమానిస్తూ చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

# నైపుణ్యం కనపరిచిన పోలీసులకు నగదు బహుమతులు

నర్సాపురం

నరసాపురంలో హత్య కేసును చేదించిన పోలీసులకు కోడిపందాలు ఆడుతున్న జూదరులను అరెస్టు చేయడంలో నైపుణ్యం కనపరచిన పోలీసులకు నగదు బహుమతులను రివార్డులను జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి అందించారు

నరసాపురం మండలం కొప్పర్రు పంట కాల్వలో జనవరి 27 న కుళ్ళిన స్థితిలో కొట్టుకు వచ్చిన మృతదేహం యొక్క హత్య కేసు ను పోలీసులు చేధించారు.హత్య చేసిన పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన మల్లిపూడి శ్రీనివాస్ ను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపిన వివరాలు ప్రకారం పెరవలి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన చుక్కల శ్రీనివాస్ కాకరపర్రు గ్రామానికి చెందిన మల్లిపూడి శ్రీనివాసులు స్నేహితులు ఇద్దరు జనవరి మూడో తేదీన మద్యం మత్తులో చుక్కల శ్రీనివాస్ డీఎస్సీ కోచింగ్ కు వెళ్తున్నాను అని చెప్పడంతో కోచింగ్ వెళ్లతో వెళ్ళవద్దని మల్లిపూడి శ్రీనివాస్ వారించాడు దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో తాగిన మైకంలో మల్లీపూడి శ్రీనివాస్ బీర్ బాటిల్ తో చుక్కల శ్రీనివాస్ సు పొట్టలో పొడిచి హత్య చేసి అనంతరం మృతదేహాన్ని తాడుతో కట్టి పెరవలి పంట కాలవలో పడవేశాడు కుళ్ళిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించిన నరసాపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేసి డిఎన్ఏ పరీక్షలు ద్వారా మృతుడును గుర్తించి మృతుడు నీ హత్య చేసిన మల్లీపూడి శ్రీనివాసును అరెస్టు చేశారని తెలిపారు

నరసాపురం మండలం పాత నవరసాపురంలో మే నెల2024 లో అర్ధరాత్రి భారీగా కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి కోడిపందాలు ఆడుతున్న 27 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 3,31,200 నగదును ఐదు లక్షల విలువచేసే 23 కోడిపుంజులను 28 మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు ఈ ఆపరేషన్లో నైపుణ్యం కనపరిచిన అంకితభావంతో పనిచేసిన పోలీసులకు నరసాపురం అడిషనల్ సివిల్ జడ్జ్ తి రాజ్యలక్ష్మి 72,480 నగదును పోలీసులకు రివార్డుగా ప్రకటించారు ఈ బహుమతిని నరసాపురం డిఎస్పి ఆఫీసులో జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి పోలీసులకు అందజేశారు

# జమిలీ జపంలో వైసీపీ నేతలు

తిరుపతి, జూలై 3,

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఏపీ రాజకీయాల్లో వైసీపీ అధ్యక్షుడు జగన్ గౌరవం ఇచ్చే ఇచ్చే అతికొద్ది మంది నాయకుల్లో ఒకరు. కొంత కాలంగా పొలిటికల్ స్టేట్మెంట్లకు దూరంగా ఉంటున్నారు పెద్దిరెడ్డి. మాజీ సీఎం జగన్ తరహాలోనే ఆయన జమిలి మంత్రి పఠిస్తున్నారు. 2027 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వస్తాయని, వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్వయంగా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషే ఆ విషయం చెప్పారని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పెద్దిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. పైగా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారంటూ పెద్దిరెడ్డి చెప్పడం హాట్ టాపిక్గా మారింది. జగన్ తరహాలో ఆయన కూడా తొలిసారి జమిలిమంత్రం పఠించడటంతో రాజకీయ వర్గాల్లో జమిలిపై చర్చ మొదలైంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితమైంది. అయితే.. సార్వత్రిక ఎన్నికలు పూర్తైన కొన్ని రోజుల తర్వాత నుంచి రాష్ట్రంలో జమిలి ఎన్నికల ప్రచారం జోరందుకుంది. 2027లో జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని వైసీపీ నేతలు ఊదరగొడుతున్నారు. పార్టీలో పెద్దాయనగా గుర్తింపు పొందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడాఇప్పుడు అదే చెబుతుండటం హాట్టాపిక్గా మారింది.అసలు పెద్దిరెడ్డి ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్న చర్చ ఊపందుకుంది. పెద్దిరెడ్డి ఈ సమయంలో జమిలి జపం చేయడానికి ప్రధానంగా రెండు కారణాలు చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎన్నికల్లో ఘోర పరాజయం చెందడం వైసీపీని సహజంగానే నిరుత్సాహానికి గురిచేసింది. రాష్ట్రంలో కూటమి తిరుగులేని మెజార్టీ ఉండడంతో వలసలు సర్వ సాధారణమయ్యాయి. క్షేత్రస్థాయిలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు, క్యాడర్లో నైతిక స్థైర్యం నింపేందుకే స్వయంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇలాంటి కామెంట్లు చేసి ఉండొచ్చన్న మాట విన్పిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో విఫలమైందని ఆరోపిస్తోంది వైసీపీ. గత వైసీపీ పాలనలో ప్రతి ఒక్కరికీ తాము ఎన్నో సంక్షేమ పథకాలు అందించగా.. ఇప్పుడు వాటిలో కొన్నింటిని కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయలేకపోతోందని జగన్ పదేపదే ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడం కోసమే ఈ మైండ్ గేమ్ అడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.పెద్దిరెడ్డి కావచ్చు.. లేదంటే మరో వైసీపీ నేత కావచ్చు.. ఎవరి కామెంట్లనైనా పక్కన పెడితే జమిలీ ఎన్నికలు 2027లో వచ్చే అవకాశాలు ఉన్నాయా అంటే అదంత సులువేం కాదన్న మాట విన్పిస్తోంది. ఇప్పటికే జనగణనకు సంబంధించి కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. జనగణనలోనే కులగణన చేపట్టాలని రాష్ట్రాలను ఆదేశించింది.జనగణన, కులగణన పూర్తి చేసి, పార్లమెంటులో వాటిని ఆమోదించే ప్రక్రియ పూర్తయ్యే సరికి చాలా సమయం పడుతుంది. పైగా నియోజకవర్గాల పునర్విభజన అంశం ఎలాగూ ఉంది. ఆ ప్రకారం చూస్తే ఏదైనా అద్భుతం జరిగి చకచకా పరిణామాలు జరిగితే తప్ప 2029 వరకు జమిలీ వచ్చే అవకాశామే లేదన్న వాదన వినిపిస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు కూడా అదే చెబుతున్నారు. ఆ క్రమంలో వైసీపీ కార్యకర్తలు, నేతలను ఇతర పార్టీల వైపు వెళ్లకుండా నిలువరించడం, ప్రత్యర్థి పార్టీలపై మైండ్ గేమ్ ఆడడం లక్ష్యంగా వైసీపీ నేతలు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారన్న వాదన బలంగా విన్పిస్తోంది.

# ఎయిర్ పోర్ట్ నుండి విజయవాడ వెళ్లే జాతీయ రహదారిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

గన్నవరం

గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి విజయవాడ వైపు వెళ్లే జాతీయ రహదారిని, వంతెనలు, గ్రీనరీని పరిశీలించి సంబంధిత అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ఎయిర్ పోర్ట్ నుండి బయటికి వచ్చిన తర్వాత నేషనల్ హైవే పై గ్రీనరీ డెవలప్మెంట్ కోసం గవర్నమెంట్ చాలా సీరియస్ గా తీసుకుంది. గ్రీనరీ డెవలప్మెంట్ కోసం ఈరోజు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో చర్చించడం జరిగింది. రోడ్డు మరమ్మత్తులు,చేసి మొక్కలు నాటి ఎలా డెవలప్మెంట్ చేయాలని విస్తృతంగా పర్యటించి నిర్ధారణకు వచ్చాము. నేషనల్ హైవే కి సంబంధించి విద్యుత్ లైట్లు పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగింది. రాబోవు కొద్ది రోజుల్లో ఎయిర్ పోర్ట్ నుండి వెళ్లే రహదారి హై స్టాండర్డ్ రోడ్డుగా రూపొందించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

# షీటీమ్, భరోస,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలి

వనపర్తి

షీటీమ్ భరోస సిబ్బంది మహిళల రక్షణ చట్టాల గురించి స్కూల్, కాలేజీలలో అవగాహన కల్పించాలిమహిళలు, పిల్లల రక్షణకు షీటీమ్, భరోస, సిబ్బంది స్నేహిత సమన్వయంతో విధులు నిర్వహించి మహిళల రక్షణకు మేమున్నామని భరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ షీటీమ్, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సిబ్బందితో 2025 జనవరి 1 నుండి జరిగిన కేసుల పూర్వపరాలు పరిశీలించి బాధితులకు జరిగిన న్యాయం, ముద్దాయిల మీద పెట్టిన కేసులు గురించి రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కేసు మొదటి నుండి చివరి వరకు ప్రతి దశలో మెరుగుపడాల్సిన పరిస్థితి వారికి పోలీసు విభాగం మరియు రెవెన్యూ విభాగం నుండి వచ్చే సంక్షేమ పథకాలు ఆర్థిక సాయం, హెల్త్ చికిత్స అన్ని విధానాల గురించి సమిక్ష నిర్వహించిన అవగాహన కల్పించారు.

ఈవిటీజింగ్ జరిగే హాట్స్పాట్ వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. షీటీమ్ జిల్లా నెంబర్, మరియు షీటీమ్ సిబ్బంది నెంబర్లు గ్రామాలలో, కాలేజీలు స్కూల్ ల వద్ద పిల్లలకు కనబడే విధంగా చిన్న చిన్న బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా దేవాలయాలు, నల్ల చెరువు, తాళ్ల చెరువు, ప్రజా వైద్యశాల పార్క్, రాజీవ్ పార్క్, ఏకో అర్బన్ పార్క్, బస్టాండ్ల వద్ద, పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. భరోసా సెంటర్ సిబ్బంది కూడా తరచుగా షీటీమ్ కార్యక్రమంలో పాల్గొని మైనర్ అమ్మాయిలకు అందిస్తున్న సేవలు గురించి వివరించాలని సూచించారు. ప్రజల రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. మైనర్ అబ్బాయిలు అమ్మాయిలు కనబడితే కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. కౌన్సిలింగ్ నిర్వహించే సమయంలో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కర్ణాటకను భయపెడుతున్న హార్ట్ ఎటాక్

బెంగళూరు, జూలై 3,

ర్ణాటకలో గుండెపోటు మరణాలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా యువత గుండెపోటుతో మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య స్పందించి, కారణాలు తెలుసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ రవీంద్రనాథ్ నేతృత్వంలోని కమిటీ పది రోజుల్లో నివేదిక ఇవ్వనుంది. కొవిడ్ టీకాల ప్రభావం, ఇతర ఆరోగ్య సమస్యలపై అధ్యయనం చేయనున్నారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం 'హృదయ జ్యోతి', 'గృహ ఆరోగ్య' పథకాలను అమలు చేస్తోంది. పూర్తి వివరాలు మీ కోసం...కర్ణాటకను హార్ట్ ఎటాక్ భయపెడుతుంది. గత కొన్ని రోజులుగా వరుసగా యువత గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపుతుంది. కర్ణాటక యువతలో పెరుగుతున్న గుండెపోటు మరణాల పట్ల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి కారణాలు గుర్తించి.. ఈ సమస్య పరిష్కారం కోసం ఒక కమిటీని కూడా నియమించారు. గత నెలలో అనగా జూన్లో ఒక్క హసన్ జిల్లాలోనే ఇరవై మందికి పైగా గుండెపోటు కారణంగా మరణించడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం నాడు కూడా 27 ఏళ్ల సంజయ్ అనే యువకుడు గుండెపోటుతో చనిపోయాడు.ఈ గుండెపోటు మరణాలకు గల కారణాలు, ఇందుకు పరిష్కారం చూపాలంటూ సీఎం సిద్ధ రామయ్య జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్ను ఆదేశించారు. ఆయన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీని గురించి ఎక్స్ వేదికగా సిద్ధ రామయ్య పోస్ట్ చేశారు. యువకుల్లో ఆకస్మిక మరణాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఫిబ్రవరిలోనే ఆదేశాలు జారీ చేశామని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా తెలిపారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారిని పరీక్షించి, సమస్యలను విశ్లేషించాలని కమిటీకి సూచించారు.కొవిడ్ టీకాల ప్రభావం, గుండె సంబంధిత సమస్యలపై అధ్యయనం కొనసాగుతోందని సీఎం వెల్లడించారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక మరణాల వెనుక గల కారణాలను గుర్తించి.. వాటిని నివారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని బీజేపీ నేతలపై ఆయన మండిపడ్డారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం హృదయ జ్యోతి, గృహ ఆరోగ్య వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు.యువత, అమాయక ప్రజల జీవితాలు తమకు చాలా ముఖ్యమని సీఎం సిద్ధరామయ్య ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హసన్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా ఆకస్మిక మరణాల వెనుక ఉన్న అసలు కారణాలను గుర్తించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వాటిని నివారించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.డాక్టర్ రవీంద్రనాథ్ మార్గదర్శకత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కర్ణాటకలో ఒక్కసారిగా ఇన్ని గుండెపోటు మరణాలు నమోదు కావడం పట్ల జనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# లోకల్ బాడీ ఎన్నికలకు రెడీ

హైదరాబాద్, జూలై 3,

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో త్వరలోనే ఎన్నికల నగరా మోగనుందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాది సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలని హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణలో పల్లెల్లో త్వరలోనే ఎన్నికల జాతర మె?దలు కానుంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సీపీఎం పొలిట్బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు సీఎంను కలవగా.. వారితో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. త్వరలోనే రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గచ్చిబౌలి, బాగ్ లింగంపల్లిలోని తమ ట్రస్ట్ భవనాలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని సీపీఎం నేతలు కోరగా.. ఈ విషయాన్ని పరిశీలిస్తానని సీఎం హామీ ఇచ్చారు. సేవాభావంతో పనిచేస్తున్నందున పన్ను మినహాయింపు ఇవ్వాలని సీపీఎం నేతలు కోరారు.కాగా, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. సెప్టెంబర్ 30, 2025లోపు సర్పంచ్ ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పును వెలువరించింది. ప్రభుత్వం 30 రోజులు, ఎన్నికల సంఘం 60 రోజులు సమయం కోరినప్పటికీ న్యాయస్థానం 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. తెలంగాణలో సర్పంచుల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1న ముగియగా, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 26న పూర్తయ్యింది.అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ, 50 శాతం రిజర్వేషన్లు మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం రిజర్వేషన్లపై తర్జనభర్జన పడుతోంది. చట్టప్రకారం బీసీలకు రిజర్వేషన్ ఖరారు కాకుంటే పార్టీ తరపున అయినా అమలు చేయాలని భావిస్తోంది. అందుకు కసరత్తు సైతం మె?దలుపెట్టింది. ఇక ఇటీవల హైకోర్టు తీర్పుతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం అయింది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేయటంతో ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు సమరానికి సిద్ధమవుతున్నారు.

కాంగ్రెస్ దృష్టి

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 4న హైదరాబాద్ కు రానున్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామస్థాయి కార్యకర్తల స మావేశంలో ఆయన పాల్గొని దిశా నిర్దేశనం చేయనున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయడానికి నాయకులకు కార్యకర్తలకు పలు సూచనలు చేయనున్నారు. స్థానిక సమరానికి అధికార కాంగ్రెస్ పార్టీ సన్నద్ధం అవుతోంది.ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా సత్తా చాటి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యక ర్తలను పార్టీ పెద్దలు అప్రమత్తం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నా యకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అన్ని స్థానాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారుఈ మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి గ్రా మస్థాయి నుంచి కార్యకర్తలను ఖర్గే సభకు తరలించేందుకు నాయకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పీసీసీ ఇంచార్జి లుజిల్లాల్లో పర్యటించి ఈనెల 4న జరిగే సభ పై దిశా నిర్దేశం చేశారు. పార్టీని ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరింత బలోపేతం చేయడంతో పాటు నిర్మాణం చేసే దిశగా పిసిసి అడుగులు వేస్తున్న క్రమంలో జిల్లాలో పార్టీ పదవులు ఆశిస్తున్న నేతలు కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖర్గే సభకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కదిలి వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇటీవల పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మన జిల్లాకి చెందిన నేతలు తమకు కేటాయించిన జిల్లాలో పర్యటించడమే కాకుండా తమ ప్రాంత పరిధి నుండి కార్యకర్తలను తరలించే దిశగా ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రెండు రోజులుగా పార్టీ సమావేశాలు జరుగుతున్నాయి.సభకు ఇక్కడి నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ ఇక్కడే మకాం వేసి కార్యకర్తలను సభకు సన్నద్ధం చేస్తున్నారు. సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అర్బన్ ప్రాంతం నుండి నాయకులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు కూడా పార్లమెంట్ పరిధిలోని నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని ఖర్గే సభకు కావలసిన ఏర్పాట్లకు హామీ ఇచ్చారు. మొత్తంగా ఖర్గే సభ అనంతరం గ్రామస్థాయిలో కార్యకర్తలు, నాయకులు రెట్టింపు పని చేసేందుకు సిద్ధం చేయాలని పార్టీనిర్ణయించింది.

# కడపలో ఘనంగా జరిగిన వైఎస్సార్సీపీ జిల్లా సర్వసభ్య సమావేశం

కడప (బ్రహ్మంగారిమఠం)కడప నగరంలోని రామాంజనేయపురంలో నూతన వైఎస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా సర్వసభ్య సమావేశం మరియు "రీ కాల్ చంద్రబాబు" మేనిఫెస్టో కార్యక్రమం గురువారం వైసీపీ అతిరథ మహారద నాయకుల మధ్య ఘనంగా నిర్వహించబడింది.ఈ సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి , మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాషా , కడప నగర మేయర్ కె. సురేష్ బాబు , రాజంపేట ,బద్వేల్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి , దాసరి సుధా , ఎమ్మెల్సీలు డి.సి. గోవింద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, రామసుబ్బారెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు రఘురాం రెడ్డి, రాచమల్ల శివప్రసాద్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# బాలల రక్షణలో భాగస్వాముల పాత్రపై అవగాహన వర్క్‌షాప్





భారత శక్తి ప్రతినిధి,కడప, జులై 03: వైఎస్ఆర్ జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాట్సల్యా పథకంలో భాగంగా, బాలల రక్షణలో కీలకంగా వ్యవహరించే అధికారులైన తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారీలు (ఎంపీడీఓస్), బాల సంక్షేమ పోలీస్ అధికారులు (సి డబ్ల్యూ పి ఒ లు), మండల విద్యా అధికారులు (ఎం ఇ ఒ లు) పాత్రపై విశేష అవగాహన వర్క్‌షాప్ ఈరోజు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ వర్క్‌షాప్‌ను జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి డి.శ్రీలక్ష్మి ప్రారంభించి, బాలల రక్షణలో ప్రతి విభాగం సమన్వయం అవసరమని పేర్కొన్నారు. పిల్లలకు సంబంధించిన కేసుల్లో వీరందరి పాత్ర ఎంతో కీలకమని, జేజే చట్టం – 2015, పోక్సో చట్టం – 2012, బాలల వివాహ నిషేధ చట్టం వంటి చట్టాల అమలులో ఈ అధికారుల బాధ్యతలు స్పష్టంగా ఉండాలని అన్నారు.

వర్క్‌షాప్‌లో ముఖ్యాంశాలు:పిల్లలకు మానవీయ దృక్పథంతో సేవలు అందించడం,బాలల వివాహాల నిరోధంలో తహసీల్దార్ల సహకారం,సంక్షేమ పథకాల అమలులో ఎంపీడీఓల పాత్ర,బాలలపై నేరాల విచారణలో సి డబ్ల్యూ పి ఒ ల బాధ్యతలు,స్కూళ్లలో బాలల రక్షణపై ఎం ఇ ఒ ల పాత్ర, అవగాహన కార్యక్రమాలు,తదనంతరం వర్క్ షాప్ నందు పాల్గొన్న అధికారులు అందరికీ మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారినీ డి .శ్రీలక్ష్మి సర్టిఫికెట్స్ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారులు, సమాజ సంక్షేమ శాఖ ప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణలో పని చేసే స్వచ్ఛంద సంస్థలు, మరియు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. చివరగా, అన్ని విభాగాల సమన్వయంతోనే బాలల రక్షణ సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# పేద విద్యార్థులకు వరం.. మహా గురుకులం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, జూలై 3(భారత శక్తి) : నాణ్యమైన విద్య, అధునాతన వసతులతో రూపుదిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ (బాలుర) మహా గురుకులం విద్యాలయం.. పేద విద్యార్థుల పాలిట వరం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభివర్ణించారు. బి.మఠం మండలంలో నూతనంగా ఏర్పాటైన డా.బి.ఆర్.అంబేద్కర్ మహా గురుకులం (బాలుర) విద్యాలయంలో ఆకాడమిక్ భవనాల్లో తరగతులు, వసతి గృహ భవనాల జిల్లా కలెక్టర్ డి.. శ్రీధర్ చెరుకూరి, మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ లతో కలిసి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు.

లిలి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...



బి.మఠం మండల కేంద్రానికి సమీపంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న డా. బి.ఆర్. అంబేద్కర్ మహా గురుకులం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వచ్చిందన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు విద్యా వసతులు కల్పించగల సామర్థ్యం ఉన్న ఈ బాలుర మహా గురుకులంలో.. ఈ విద్యా సంవత్సరానికి గాను 640 మంది విద్యార్థులతో అడ్మిషన్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఆధునాథనమైన సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించే మహా గురుకులంలో.. చేరేందుకు అర్హులైయిన పేద విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈరోజు భారత దేశం ఆర్థిక అభివృద్ధిలో 4వ స్థానంలో నిలుచుందంటే.. అందుకు కారణం మన విద్య వ్యవస్థపై మన ప్రభుత్వాలు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ వల్లనే అన్నారు. మన పూర్వీక మహా ఋషులు అవలంభించిన ఒక విలువలతో కూడిన విద్య వ్యవస్థ మన దేశంలో ఇప్పటికీ కొనసాగుతోందని.. అలాంటి విద్యా వ్యవస్థే.. ఈ గురుకుల విద్యాలయ వ్యవస్థ అన్నారు. సమాజంలో పిల్లలకు అద్భుతమైన విద్యను అందించడమే.. ఒక గొప్ప నాయకుడి నిజమైన బాధ్యత అన్నారు. ఎక్కువగా రాజాకీయ నాయకులు తమ ఊర్లలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకే. మొగ్గు చూపుతారన్నారు. అయితే... మైదుకురు ఎమ్మెల్యే మాత్రం మౌలిక వసతులకంటే ముందు విద్యాలయాన్ని నెలకొల్పితే.. ఎంతో మంది విద్యావంతులు, వారి ద్వారా ఎంతో మంది ప్రయోజకులు ఎత్పన్నం అవుతారన్న ఆలోచనతో.. మహా గురుకులం అభివృద్ధికి నిరంతరం శ్రమించారన్నారు. ఆయనతో పాటు ఆర్డీవో, అధికారుల కృషీ ఫలితమే.. ఈ మహా గూరుకులం పరిపూర్ణతకు నిదర్శనం అని ప్రశంసించారు. అందరి సమిష్టి కృషితోనే.. మహా గురుకులం లాంటి ఆదర్శనీయ భవనాలు మన ముందు గొప్ప విద్యాలయాలుగా ఎదుగుతాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ఈ మహా గురుకులం జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలను అందిస్తోందని, అలాగే 2027 విద్య సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమమైన ఫలితాలను అందివ్వాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఈ మహా గురుకులం జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో రెపరిప లాడించే స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

లి లిఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.. 2016 లో ఈ గురుకులం ప్రాజెక్టు నిర్మాణానికి సంబందించి అనుమతులు, టెండర్లు కూడా పూర్తి చేసి.. రూ. 21 కోట్ల వ్యయంతో మహా గురుకులం నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. సంబందిత పనులను ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. కానీ గత ప్రభుత్వంలో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయడంలో అలసత్వం వహించిందన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వారి ప్రత్యేక చొరవతో రెండు వారాల్లోనే పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను సమకూర్చడం జరిగిందన్నారు. అంతేకాకుండా.. తాజాగా రూ.1.23 కోట్ల వ్యయంతో రోడ్లు, ప్లే గ్రౌండ్, సుందరీకరణ పనులను పూర్తి చేయడంనారిగిందన్నారు. అడ్మిషన్లు పూర్తయ్యేలోపు అన్ని రకాల సిద్ధం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు. మైదుకురు నియోజకవర్గ అభివృద్ధి కోసం.. జిల్లా కలెక్టర్ వారు ఎంతో సహాయ సహకారాలు అందించారని.. అందుకు ప్రజల తరపున, తన.తరుపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామనన్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని 5 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడంలో, అలగానూరు రిజర్వాయర్ కోసం రూ.36 కోట్లను మంజూరు చేయడం జరుగుతుందని హామీ ఇవ్వడంలో, బి.మఠం దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 6 కోట్ల విడుదలకు హామీ ఇవ్వడంతో, మహా గురుకులం పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయడంలో, అలాగే బీ.మఠంలో కబ్జాకు గురైన 10 ఎకరాల స్మశాన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో.. ప్రత్యేక శ్రద్ధ వహించిన ఘనత జిల్లా కలెక్టర్ గారికే దక్కుతుందన్నారు. ఈ విద్యాలయాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉందన్నారు. అలాగే.. నియోజకవర్గానికే కాకుండా జిల్లాకే తలమానికంగా రూపు దిద్దుకోనున్న.. జవహర్ నవోదయ విద్యాలయాన్ని నిర్మించేందుకు పలుగురాళ్ల పల్లె రెవెన్యూ భూమిలో 30 ఎకరాల భూమిని కేటాయించడం గర్వించదగ్గ విషయం అన్నారు.

లి లిజిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలో అన్నింటికీ మూలం ఒక్క విద్యనే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఒక్క పాఠశాల ఎంతో మంది ప్రయోజకులను తీర్చిదిద్దుతుందన్నారు. నేటి విద్యార్థి.. భవిష్యత్తులో ఒక ఉన్నత అధికారిగానో, ఒక రాజకీయవేత్తగానో, ఒక శాస్త్రవేతగానో.. ప్రజలకు సేవ చేయవచ్చన్నారు. విద్యాలయాలు దేశ అభివృద్ధికి మూలాల అనే విషయాన్ని కూడా గుర్తు పెట్టుకుని.. భవిష్య త్వరలో కూడా విలువలతో కూడిన విద్యను అందించే పాఠశాలలను నెలకొల్పాలని, ఉన్న పాఠశాలలను కాపాడాలని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వ పాఠశాలలో చదివిన మేము.. మీ ముందు అధికార హెూదాలో ఉన్నామనంటే.. క్రమశిక్షణ, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, ఉన్నత ఆశయంతో చదవడం వల్లనే సాధ్యం అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరు ఒక లక్ష్యంతో చదవాలన్నారు.

లి లిగురుకుల విద్యాలయాల జిల్లా కో.ఆర్డినెటర్ ఉషశ్రీ మాట్లాడుతూ.. ఒక గ్రామానికి బడి, గుడి ఉంటే ఆ గ్రామం ఆధ్యాత్మికంగా, వివేకవంతంగా అభివృద్ధి చెందడంతో పాటు.. ఆ ప్రాంత విద్యార్థులు, మంచి విలువలతో కూడిన విద్యతో పాటు.. అక్కడి ప్రజలకు సంస్కృతీ సంప్రదాయాలు అలవాడుతాయన్నారు. ఒక దేశం అభివృద్ధి కోరేవారు ఎవరైనా.. ప్రతి గ్రామంలో ఒక బడిని స్థాపించేందుకు ముందుకురావాలన్నారు.

లిలి సమావేశానికి ముందు.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) లో రూ.1.23 కోట్ల తో చేపట్టిన అభివృద్ధి పనులు – సిసి రోడ్లు, విద్యుదీకరణ, ఆటస్థలం మరియు మొక్కల పచ్చదనం పనులకు సంబంధించి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం.. తరగతి గదులు, హాస్టల్ గదుల వసతులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటిన అనంతరం క్రీడా మైదానం, రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో చివరగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు.. హాస్టల్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, డీఈవో శంశుద్దిన్, ఎస్ఎస్ఏ ఎపిసిఎ. నిత్యానందరాజులు, సోషల్ వెల్ఫర్ డిడి సరస్వతి, డ్వామా పిడి ఆది శేషారెడ్డి, తహసిల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపిడిఓ వీర కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరుడు, ఎంపిపి వీర నారాయణ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల నిబంధనలు ఉల్లంఘిస్తే.. చర్యలు తప్పవు:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





కడప, జులై 3(భారత శక్తి): విద్యాలయాల విలువలను దిగజార్చేలా ప్రబవర్తించినా, పాఠశాల నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హెచ్చరికలు జారీ చేశారు. వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను మైదుకురు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ లతో కలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. పేద విద్యార్థులకు అధునాతన వసతులతో నాణ్యమైన విద్యనందించే లక్ష్యంతో.. వనిపెంటలో నిర్వహణలో ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే బాలికల బీసీ గురుకుల విద్యాలయంలో కొన్ని సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే.. కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో.. బి.మఠం పర్యటన తిరుగు ప్రయాణంలో ఆ పాఠశాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల సమస్యలపై ప్రిన్సిపాల్ నిర్మలతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. పాఠశాల మొత్తం విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య, సిబ్బంది సంఖ్య తదితర విషయాలపై మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా వుండడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పాఠశాల పునఃప్రారంభం అయ్యి 20 రోజులు దాటినా విద్యార్థులు తిరిగి రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వచ్చే సోమవారం నాటికి పాఠశాల రిజిస్టర్ లో ఉన్న విద్యార్థులందరూ హాజరవ్వాలని సూచించారు. లేని పక్షంలో పాఠశాల నుండి పేర్లు తొలగించడం జరుగుతుందన్నాను. అలాగే.. పాఠశాల నిబంధనలను ఉల్లంఘించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మంగళవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో.. తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో నూతనంగా ఏర్పాటైన మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల విద్యాలయంలో పెండింగ్ పనులు, వసతులు సంబందిత అంశాలపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతులతో సువిశాల ప్రాంగణంలో రూపు దిద్దుకున్న మహాత్మాగాంధీ జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల, జూ.కళాశాల వెనుకబడిన తరగతులు, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించనుందన్నారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యాలయాన్ని త్వరలో నూతన భవనంలో సదుపాయాలు సిద్ధం చేసి షిఫ్ట్ చేయడం జరుగుతోందన్నారు. రెండు నెలల గడువులోగా గురుకులంలో ఎలాంటి మౌళిక సదుపాయాల కొరత లేకుండా.. రోడ్లు, విద్యుత్, నీటి పైప్ లైన్, గ్రీనరీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చాలన్నారు. అన్ని విభాగాల భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని.. ఇంకనూ పెండింగ్ లో ఉన్న ఫర్నిచర్, కిచెన్ సామగ్రి, కంప్యూటర్స్ తదితర వస్తువులను నిర్ణీత గడువులోగా సిద్ధం చేయాలని సంబందిత అధికారులను అదేశించారు. పాఠశాల విషయాల్లో స్థానిక రాజకీయ జోక్యాలను సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, బీసీ వెల్ఫేర్ అధికారులు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిలి

## -ప్రత్యేక అధికారులు ప్రో ఆక్టివ్ గా పనిచేయాలి

వైయస్సార్ కడప జిల్లా, జూన్ 03(భారత శక్తి): జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ హాలులో స్వర్ణాంధ్ర విజన్- 2047 లో బాగంగా నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ పై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు,మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి ప్రజా ప్రతినిధుల సహకారంతో అధికారులు ప్రో యాక్టివ్ గా పని చేయాలన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత,



వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, వంటి 10 ప్రధాన సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ప్రణాళిక రూపకల్పనకు నియోజకవర్గ యాక్షన్ ప్లాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల అంశాలను సాధించడానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించేందుకు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నియోజకవర్గ యూనిట్లు విజన్ యాక్షన్ ప్లాన్ సాధించడానికి కీలకం కానున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 78వేల బంగారు కుటుంబాలను గుర్తించామని నియోజకవర్గంలోని మండల వారీగా బంగారు కుటుంబాల మ్యాపింగ్ లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. అలాగే ప్రతి గ్రామం , మండలాలలో మార్గదర్శలను గుర్తించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని వాళ్ల ఉన్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోనీ ఏడు నియోజకవర్గాలలో ప్రధానమైన వృద్ధి ఇంజన్లను గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాబోవు ఐదు సంవత్సరాలలో జిల్లాలో హార్టికల్చర్ 17%, మ్యానుఫ్యాక్చరింగ్ 18%, ఎనర్జీ 16%, టూరిజం 18 రియల్ ఎస్టేట్ 18% కమ్యూనికేషన్ 18% అభివృద్ధి సాధించే విధంగా లక్ష్యాలను నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. జిల్లా వృద్ధిరేటు 16 శాతంగా నిర్దేశించుకోవడం జరిగిందనీ,అందుకు అనుగుణంగా అన్ని రంగాల్లో మంచి వృద్ధిరేట్లు సాధిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామన్నారు నియోజకవర్గ,ఆయా మండలాల విజన్ యాక్షన్ ప్లాన్‌పై స్పెషల్ అధికారులు,మండల అధికారులు పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు. కీలక రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక, సర్వీస్ రంగాలలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సమస్యలను అధిగమించి ఇచ్చిన లక్ష్యాలను సాధించేందుకు కృత నిశ్చయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ప్రధాన పంటలలో వృద్ధి సాధించాలన్నారు అలాగే ప్రత్యామ్నాయ పంటలు సీడ్ ప్రొడక్షన్, ఉత్పాదకత, ఏరియా ఎక్స్టెన్షన్లలో దృష్టి సారించి టార్గెట్లను అచీవ్ చేయాలన్నారు. వరి, పత్తి,వేరుశెనగ పంటల్లో రైతులకు సబ్సిడీ కింద మైక్రో న్యూట్రియన్లు అందించి ఉత్పాదకతను పెంచాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్ ప్రధానమైన గ్రోత్ ఇంజన్ అని ఇందులో బనానా, స్వీట్ ఆరెంజ్, పసుపు, వంటి తోటలను ఉపాధి హామీ పథకం, మైక్రో ఇరిగేషన్ శాఖలతో అనుసంధానం చేసి ఎక్కువమంది రైతులు హార్టికల్చర్ వైపు మొగ్గు చూపే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగం జిల్లాలో మరో ప్రధాన కి రోల్ ప్లే చేస్తోందని మున్సిపల్ కమిషనర్లు అందరూ అనుమతులను సులభతరం చేసి రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు వారంలో రెండు రోజులు రియల్టర్లతో ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహించాలన్నారు. లేఔట్స్ బిల్డింగ్ నిర్మాణాల వంటి అనుమతుల్లో జాప్యం తగ్గించి త్వరితగతిన మంజూరు చేస్తే మున్సిపాలిటీలకు అధిక రాబడి వస్తుందని ఆ విధంగా మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే గ్రామాల్లో స్వయం సమృద్ధి సాధించడానికి ప్రతి మండలంలో ఒక సోలార్ విలేజ్ అనుకూలతలను పరిశీలించాలన్నారు..జిల్లా ప్రధాన కేంద్రమైన కడప నియోజకవర్గంలో ఇండస్ట్రియల్, కన్స్ట్రక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి వృద్ధి సాధించాలన్నారు. రాయలసీమలోని కడప నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని అందుకు అనుగుణంగా ఎమర్జింగ్ ఏరియాలను గుర్తించి ఓపెన్ లేఔట్లు ట్రేడింగ్ లలో అనుమతులను సరళతరం చేయాలన్నారు. జిల్లా తలసరి ఆదాయం పెంచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని తెలిపారు. సమస్యలు అదిగమించి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామని అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం నియోజకవర్గాల వారీగా విజన్ యాక్షన్ ప్లాన్ ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా వ్యవసాయం, హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, పశుసంవర్ధక, ఫిషరీస్ వంటి శాఖల్లో జిల్లా అధికారులు యాక్షన్ ప్లాన్ కనుగుణంగా లక్ష్యాల సాధనకు ఏ విధంగా కృషి చేస్తున్నారన్న అంశాలపై జిల్లా కలెక్టర్ రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీవో హాజరతయ్యా, కడప ఆర్డిఓ జాన్ ఇర్విన్, బద్వేలు ఆర్టీవో చంద్రమోహన్, జమ్మలమడుగు ఆర్డిఓ సాయి,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా అధికారులు,ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాశ మైలారం లో ని సిగాచి పరిశ్రమలో రిస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి: జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జులై 03:ప్రమాదం జరిగినప్పటి నుండి జిల్లా కలెక్టర్ కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ ఇద్దరు సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఘటనా స్థలాన్ని వారు తరచూ సందర్శించి సహాయక బృందాలకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ఐల కార్యాలయంలో ప్రత్యేక సహాయక కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. వారి కుటుంబ సభ్యులకు భోజనం, తాత్కాలిక నివాసం, రవాణా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. బాధిత కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు.బాధితులు వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేసామన్నారు.ఒడిశా, బీహార్ రాష్ట్రాల అధికారులు కూడా సహాయక చర్యలు అందిస్తున్నారు . సిగాచి ఫార్మా పరిశ్రమ ప్రమాద తాజా పరిస్థితులను కలెక్టర్ వివరించారు. సిగాచి పరిశ్రమ అధికారికంగా అందిన వివరాల ప్రకారం వివరాలు ఈ విధంగా అందించారు.మొత్తం 143 మంది ఉద్యోగులు వివరాలు అందించారు.సురక్షితంగా ఉన్నవారు 60,గాయపడి చికిత్స పొందుతున్నవారు 35,గుర్తించబడిన మృతుల సంఖ్య 18, గుర్తించలేని మృతదేహాలు 20 , గల్లంతైనవారు 10, మంది ఉన్నారు. కుటుంబాలకు అప్పగించిన మృతదేహాలు 18, ప్రయోగశాలలో డిఎన్ఏ ఫలితాల కోసం పెండింగ్‌లో 18 నమూనాలు ఉనాయి. ఇంకా సేకరించాల్సిన మృతదేహాల నమూనాలు 2,పరీక్షించాల్సిన కుటుంబ సభ్యుల రక్త నమూనాలు 25, ఇంకా 5 కుటుంబాల నుండి సేకరించాల్సి ఉంది.గుర్తించలేని కుటుంబాల సంఖ్య 3, డిఎన్ఏ ద్వారా మ్యాచ్ అయిన నమూనాలు 5,

పూర్తయిన పోస్టుమార్టం (%్రావీజు): 36

%మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున మంజూరు.చేసిన కుటుంబాల సంఖ్య: 18,

గాయపడిన వారికి రూ.50,000 చొప్పున మంజూరైనవారు 34,తాత్కాలిక ఆర్థిక సహాయంకింద

18 మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున,

గాయపడిన 34 మంది కి రూ.50,000 చొప్పున చెల్లించిన తాత్కాలిక సహాయం,

మిస్సింగ్ అయిన 10 కార్మికుల కుటుంబాలకు రూ.10,000 చొప్పున తాత్కాలిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. బాధిత కుటుంబాలు లేదా వారి బంధువులు సమాచారం కోసం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 08455-276155 ను సంప్రదించవచ్చును.

ఈ హెల్ప్‌డెన్క్ ద్వారా వారి అవసరాలపై సత్వర స్పందించడానికి సిబ్బంది కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

## శ్రీ రామ కృష్ణ వైదిక ధర్మ పీఠంలో ప్రతి ఆశాడ మాసంలో 13 రోజుల చండీ హెూమం నిర్వహిస్తున్న శ్రీ శీర్ల వంచ కృష్ణమాచార్యులు







(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 03: శ్రీ రామ కృష్ణ వైదిక ధర్మ పీఠంలో ప్రతి ఆశాడ మాసంలో చండీ హెూమం 13 రోజులు జరుగుతుందని చైర్మన్ శ్రీ శీర్ల వంచ కృష్ణమాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ధర్మో రక్షతి రక్షితః హిందూ ధర్మాన్ని కాపాడండి అది మిమ్మల్ని కాపాడుతుంది అని అన్నారు. శ్రీ శీర్ల వంచ కృష్ణమాచార్యులు నాలుగు సంవత్సరాలుగా శ్రీ రామకృష్ణ వైదిక ధర్మ పీఠం పాఠశాలలో కుల మత భేదం లేకుండా తన సొంత ఖర్చులతో అన్ని కులాల వారికి వేద పాఠశాలలో ఉచితంగా విద్య బోధలను నేర్పించి వారికి తగిన స్థానం కల్పించి ప్రయోజకులను చేయడంలో ముందున్నారు. ఈ యొక్క వేద పాఠశాల ద్వారా చాలా మంది ఆకర్షితులైన వారికి విద్యను అందిస్తున్నారు. హిందువులందరూ అర్హులే ఆసక్తి ఉన్న వారికి మన పాఠశాలలో అన్ని వసతులతో ఫ్రీ క్లాసులు నేర్పించబడును. ఆషాడ మాసం సందర్భంగా 13 రోజులు చండీ హెూమం జరుగును. గురువారం మూడవ రోజు హెూమం జరిగినది.ఈ కార్యక్రమానికి వస్తున్న ప్రముఖులందరికీ చైర్మన్ శీర్ల వంచ కృష్ణ మాచర్యులు వేద పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేసారు.

## మూడు రకాల దోమల వల్ల అయిదు రకాల వ్యాధులు- అప్రమత్తంగా ఉందాం: హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్



మందమర్రి టౌన్, జులై 03, (భారత శక్తి): మందమర్రి పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో కీటక జనిత వ్యాధుల అవగాహన కార్యక్రమం మంచిర్యాల డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ విద్యార్థులకు దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు పట్ల అవగాహన కల్పించారు. ఎనాఫిలిస్, క్యూలెక్స్, ఏడిస్ ఈజిప్టి అనే మూడు రకాల దోమలు మనకు మలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ, మెదడు వాపు వ్యాధి, బోధకాలు వంటి ఐదు రకాల వ్యాధులు వచ్చేందుకు కారణమవుతాయని వారు తెలిపారు. ఎనాఫిలిస్ ఆడ దోమ వల్ల మలేరియా వ్యాధి సోకుతుందని చలి జ్వరం దాని ముఖ్య లక్షణం అని పేర్కొన్నారు. మురికి నీటిలో అభివృద్ధి చెందే క్యూలెక్స్ దోమ ద్వారా బోధకాలు మెదడు వాపు వ్యాధి సంక్రమిస్తాయని ఆయన తెలిపారు. డెంగ్యూ వ్యాధికి కారణమయ్యే ఏడిస్ దోమలు మన ఇళ్లలోని కూలర్లు, కొబ్బరి బొండాలు, నీళ్ల ట్యాంకులు, కుండ పెంకులు, పాడేసిన టైర్లల్లో నీరు నిలువ ఉంటే వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఇళ్లలోని నిలువ నీటిలో కనిపించే తోకపురుగులే దోమ లార్వాలని వారు పేర్కొన్నారు. గుడ్డు దశ నుండి దోమగా మారడానికి వారం రోజుల సమయం పడుతుందని, అందుచేత వారం కన్నా ఎక్కువగా నీరు నిలువ ఉండకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని పిలుపునిచ్చారు. వారం కన్నా ఎక్కువ నీరు నిలువ ఉంచాల్సి వస్తే తప్పనిసరిగా వాటిపై మూత పెట్టుకోవాలని సూచించారు. పూడ్చే అవకాశం లేని పెద్ద నీటి గుంతల్లో వాడి పడేసిన ఇంజన్ ఆయిల్ తో తయారుచేసిన ఆయిల్ బాల్స్ వేసి దోమల అభివృద్ధిని అరికట్టవచ్చని చెప్పారు. పాడుబడ్డ నూతి బొందలు లాంటి పెద్ద నీటి నిలువలు ఉంటే జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించి గంబూషియా చేపలను వదిలి దోమ లార్వాలను నాశనం చేయాలని తెలిపారు. ఎవరికైనా జ్వర లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ దవాఖానను సంప్రదించి వైద్యుల సలహాతో రక్త పరీక్ష చేయించుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల ద్వారా ఆరోగ్య సమాచారాన్ని సమాజానికి అందించడం మంచిదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమము చేపట్టినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ తోపాటు సి హెచ్ ఓ రామమూర్తి, సబ్ యూనిట్ అధికారి నామ్ దేవ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సారా తస్లీమ్, ఏఎన్ఎం సుశీల, కేజీబీవీ ఏఎన్ఎం, ఉపాధ్యాయురాలు రజిని, ఆమెన లు, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## అసంపూర్ణంగానే సింగరేణి క్వార్టర్ల పట్టాలు

అదిలాబాద్, జూలై 3,

బెల్లంపల్లిలో పురాతన సింగరేణి క్వార్టర్ల పట్టాల ప్రక్రియ అసంపూర్ణంగానే మిగిలిపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో బెల్లంపల్లిలోని బొగ్గు గనులతో వెలసిన తొలితరం సింగరేణి క్వార్టర్లకు పట్టాలిచ్చా రు. 4500 క్వార్టర్లను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో ఈ క్వార్టర్లు రెవెన్యూ ఆధీనంలోకి మారిపోయా యి. పట్టాల అందజేత గత ఎన్నికల ముం దు మొదలైంది. దీంతో అసంపూర్ణంగానే ఈ ప్రక్రియ ఆగిపోయింది.కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరాక బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వినోద్ పట్టాల ప్రక్రియను పూర్తి చేస్తానని చెప్పారు. అయితే ఆయన హాయం లో కూడా పట్టాల నమోదు కొంతమేరకు చేపట్టి పూర్తి చేయలేకపోయారు. దీంతో పట్టాల వ్యవహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే చందంగా ఉండిపోయింది. పట్టాల ప్రక్రియ పరిపూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి పట్టాల ప్రక్రియను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సింగరేణి యజమాన్యం సరెండర్ చేసిన సింగరేణి క్వార్టర్లకు పట్టాలు పూర్తిస్థాయిలో ఇవ్వాలి. కానీ మధ్యలోనే వాటికి ఎగనామం పెట్టడంతో ఇళ్ల పట్టాల సమస్య అపరిష్కృతంగా మిగిలిపోయింది.సింగరేణి క్వార్టర్లు సొంతం కావడంతో కార్మికుల్లో ఎనలేని ఆనందం వ్యక్తం అవుతున్నది. ఇదే తరుణంలో అసంపూర్ణంగా మిగి లిపోవడంతో పట్టాలు చేతికందక మిగితా కార్మికులు బాధను కూడా వ్యక్తం చేస్తున్నా రు. ప్రకటించిన నివాస పట్టాలు యావత్ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందకుండా నే ముగించారు. మరో దఫా పట్టాల నిర్వహణను చేపడతారని ఎదురుచూస్తున్నారు. పూర్తిస్థాయిలో పట్టాలను చేపట్టకుండా మధ్యంతరంగా ముగించడం పట్ల లబ్ధిదారులు తెగ బాధపడి పోతున్నారు.ఇప్పటికైనా అధికారులు పెండింగ్‌లో ఉన్న పట్టాల వైపు దృ ష్టి పెట్టాలని కోరుతున్నారు. పట్టాలు పొం దని కార్మికులు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సౌకర్యాన్ని కోల్పోతున్నారు. ఇప్పటివరకూ సింగరేణి సంస్థ నుంచి పొందుతున్న విద్యు త్ సదుపాయం ఎంతకాలం ఉంటుందో తెలియదు. ఎంతకాలం సింగరేణి విద్యుత్తు ఉంటుందో? ఎప్పుడు తొలగిస్తారో ఆందోళనలో కార్మికులు కాలం వెళ్లదీస్తున్నారు.ఇళ్ల పట్టాలకు నోచుకోని సింగరేణి కార్మికులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయం అందని ద్రాక్షగా మారింది. సింగరేణి నుంచి అప్పగించిన క్వార్టర్లకు పట్టాల ఘట్టం పరిపూర్తి కాలేదు. సింగరేణి కాలనీలో ప్రభుత్వ విద్యుత్తు సదుపాయం కల్పన కూడా ఇంకా పూర్తి కాలేదు. కొన్ని కాలనీలో విద్యుత్ స్తం భాలు వేసి వైరింగ్ చేశారు. మరి కొన్ని బస్తీ ల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాట్ల పనులే సాగుతున్నాయి. విద్యుత్ పనులు పాక్షికంగా జరి గాయి. పట్టాలు పొందని ఎంతోమంది లబ్ధిదారులు విద్యుత్తు సదుపాయాన్ని పొందలే కపోతారు. ఈ విషయాన్ని అధికారులు, ఎమ్మెల్యే తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. సగానికి పైగానే సింగరే ణి క్వార్టర్లకు పట్టాలు పూర్తికాలేదు.పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టా లు కోసం మరోసారి అవకాశం ఇవ్వాలన్న ప్రజల విన్నపాలను లెక్కలోకి తీసుకోవాలి. ఇంతకు పూర్వం లబ్ధిదారుల్లో పట్టాల కోసం చేసుకున్న అప్లికేషన్లో చాలా వరకు సాంకేతిక కారణాల వల్ల రిజెక్ట్ అయ్యాయనీ వాపోతున్నారు. దీంతో ఇచ్చిన గడువులో నిర్ణీత కాలంలో పట్టాలు చేతికి రాకుండా పోయా యి. మెజార్టీగా తగినంత సమయం వెచ్చించకపోవడం వల్లనే లబ్ధిదారుడి చేతికి పట్టా అందలేకుండాపోయిందన్న వాదనలు ఉన్నాయి.ఈ రకంగా పట్టాల సమస్య బెల్లంపల్లిలో అసంపూర్ణంగా మిగిలిపోయింది. లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే మరోసారి పట్టాల ప్రక్రియను చేపట్టాల్సిన అవ స రం ఎంతైనా ఉన్నది. ప్రజల కోసం, ప్రకటించిన ఇళ్ల పట్టాల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పట్టాలకు అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపైనే ఉంది. ఇలా జరగ ని పక్షంలో వందలాది మంది ఇళ్లపట్టాలను కోల్పోవల్సివస్తుందనీ వాపోతున్నారు.మొక్కుబడిగా గత ప్రభుత్వం, ప్రస్తుత ఎమ్మె ల్యే పట్టాల అందజేతను హడావిడిగా కొనసాగించారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. దాని ఫలితంగానే పెండింగ్లో పెద్ద ఎత్తున పట్టాలు మిగిలిపోయాయ న్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి ఒక్కరికీ పట్టాలు చేతికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఎంతైనా ఉందన్న విషయాన్ని గుర్తించాలని కోరుతున్నారు.

## జూలై 3న సేయింట్ థామస్ హతసాక్షి డే

### -నేడు భారతీయ క్రైస్తవ దినోత్సవం

### - తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 03):సూర్యాపేట పట్టణ కేంద్రం స్థానిక 5వ వార్డు నందు తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు,బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్ తన నివాసంలో ఘనంగా జూలై 3న సేయింట్ థామస్ హతసాక్షి దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు భారతీయ క్రైస్తవ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీ. శ. యేసు క్రీస్తు శిష్యులు అయినా 12 మంది లో ఒకరైన అపో. సేయింట్ థామస్ యేసు క్రీస్తూ డొక్కలో మరియు తన చేతి గాయములలో వ్రేలు పెట్టి చూసి నమ్మిన వాడు, క్రీ.శ 52లో భారత దేశంలోని కేరళ రాష్టంలోకి సువార్త నిమిత్తం వచ్చి అక్కడ నుండి తమిళనాడు కు సువార్త ను ప్రకటించి అనేకులను క్రీస్తూ లోని నడిపించారు, పరంగిమలై భారతదేశంలోని తమిళనాడులోని చెన్నైలోని ఒక చిన్న కొండ, గిండికి సమీపంలో మరియు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చాలా సమీపంలో ఉందని భారతదేశంలోని పురాతన సిరియన్ క్రిస్టియన్ కమ్యూనిటీ వారి చర్చి యొక్క మూలాన్ని సెయింట్ థామస్ ది అపోస్టల్ గా గుర్తించారని సేయింట్ థామస్ 20 సంవత్సరాలు సువార్త ను ప్రకటించి క్రీ.శ 72లో మైలాపూర్ లో హతసాక్షిగా హత్యకు గురయ్యారని ఆయన మరణించిన దినం ప్రతి యేటా జూలై 3న పండుగగా జరపుకుంటరని అన్నారు.భారత దేశానికి సువార్త ఇంగ్లిష్ వారి ద్వారా రాలేదని, ఇశ్రాయెల్ నుండి వచ్చిందని గుర్తు చేస్తూ అది మాత్రమే కాకా వస్కోడీ గామా అమెరికా నుండి సముద్ర మార్గాన్ని మన దేశానికి కనిపెట్టకముందే భారతదేశం లో క్రైస్తవులు వున్నారని,ఇంకా బైబిల్ లోని పాత నిబంధనలోని పరో కాలం నానీ సమాజ మందిరం చిన గోగు కేరళ లోని కొచ్చి లో ఉందని అన్నారు.

## సౌకర్యాలు లేని కేజీవీబీలు...

నిజామాబాద్, జూలై 3,

నిర్మల్ జిల్లాలో పేదరికంలో ఉన్న పిల్లల కోసం సర్వ శిక్ష అభియాన్ కింద ఏర్పాటు చేసిన కేజీబీవీ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు వరదల్లో వచ్చి పడుతున్నాయి. నిర్మల్ జిల్లాలో మొ త్తం 19 కేజీబీవీ ఉన్నాయి. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశా లు కల్పిస్తున్నారు. 6 నుంచి 10 తరగతి వర కు ఉన్న పాఠశాలలో 240 మంది ఇంటర్ వరకు ఉన్న కేజీబీవీలో 340 మంది విద్యార్థులను చేర్చుకోవాల్సిన నిబంధన ఉన్న జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంస్థల్లో ఆడపిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు.ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థులు మాత్రమే చేసుకోవలసి ఉండగా స్థానికంగా ఉన్న పోటీ నేపథ్యంలో ఒక్కొక్క క్లాసులో 50 నుంచి 70 మంది వరకు విద్యార్థులు చదువుతున్నట్టు కేజీబీవీఎస్ఓ లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలకు ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ అం దులో 240 మంది పాఠశాల స్థాయిలో 3 60 మంది కళాశాల స్థాయిలో వసతులు కల్పించవలసి ఉన్న పరిమితికి మించి విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడంతో కేజీబీవీలు విద్యార్థులతో కటకటలాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఐదవ తరగతి పాసైన బాలికలందరినీ గురుకులాల్లో రీయంట్రీ పరీక్ష రాయించిన అక్కడ సీట్లు తక్కువగా ఉండటంతో తిరిగి కేజీబీవీ వైపు మొగ్గు చూపుతున్నట్టు కేజీబీవీ ఉపాధ్యాయులు తెలిపారు.

జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలో గత రెం డేళ్లుగా విద్యార్థుల అడ్మిషన్ల జోరుగా సాగుతున్నాయి. కేజీబీవీ పాఠశాలలో ఆడపిల్లలకు రక్షణగా ఉండడం, మంచి చదువు అం దించడం పోషక విలువలు ఆహారం ప్రతిరోజు వ్యాయామం ఆటలు ఇతర సామాజిక అంశాలపై ఆడపిల్లలకు విద్య అందించడం తో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు కేజీబీల వైపు మొగ్గు చూపేలా ప్రోత్స హిస్తున్నారు. ఈ పాఠశాలలో చేర్చే పిల్లల్లో తల్లిదండ్రులు లేని వారు ఆర్థికంగా పేదరికం లో ఉన్నవారు కార్మికుల పిల్లలు వ్యవసాయ కూలీల పిల్లలు ప్రాధాన్యత క్రమంలో చేర్పిం చు కోవలసి ఉన్న స్థానిక నేతల ఒత్తిళ్లు రాజకీయ పైరవీలు అధికారుల సూచనలు కారణంగా వేరే పిల్లలు కూడా చేర్చుకోవాల్సి వస్తుందని ఎస్వోలు వాపోతున్నారుఈ సం వత్సరం ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం ప్రతి క్లాసులో 40 మంది విద్యార్థులను మాత్రమే తీసుకోవాల్సి ఉన్న మెజార్టీ కేజీబీవీలో 60 నుంచి 70 వరకు అడ్మిషన్లు నిర్వహించగా మరో 20 మంది వెయిటింగ్‌లో ఉన్నట్లు కేజీబీవీ పాఠశాలల నిర్వహకులు తెలిపారు. కేజీబీవీలో విద్యాబోధన అవసరమయ్యే తరగతి గదులు బెంచీలు మరుగు దొడ్లు స్నానపు గదుల కొడతా డైనింగ్ హాల్ కొత్త కారణంగా విద్యార్థులు దశలవారీగా భోజనం చేస్తున్నారు. పాఠశాల భవనాలు కొన్ని కొత్తవి కాగా పాత భవనాలు నిర్వహిస్తున్నావుగా అవి వర్షాలకు కురుస్తూ విద్యా ర్థులు చదువుకో ఆటంకం కలిగిస్తున్నాయి. ఇప్పటికే అన్ని కేజీబీవీ పాఠశాలలో అడ్మిషన్లు క్లోజ్ అని నోటీసు బోర్డులు అందించారు అయినా తమ పిల్లలను చేర్చుకోవాలని తల్లిదండ్రులు ఇంకా పాఠశాల చుట్టూ తిరుగుతున్నారు. కేజీబీవీ పాఠశాలలో ఒకవైపు విద్యార్థుల అడ్మిషన్ల మరోవైపు రాజకీయ ఒత్తిళ్లు మౌలి క సదుపాయాల కొడత విధులు నిర్వహిస్తున్న ఎస్వోలు ఇతర సిబ్బందిపై తీవ్ర ఒత్తి డిని ఎదుర్కొంటున్నట్టు ప్రచారం జరుగుతుంది. నిర్మల్ జిల్లాలోని అన్ని కేజీబీవీలో ఒక్కొక్క తరగతిలో 40 మంది అడ్మిషన్లను మాత్రమే తీసుకోవాల్సి ఉండగా నర్సాపూర్ దిల్వార్పూర్ నిర్మల అర్బన్ లక్ష్మణ్ చందా మామడ సారంగాపూర్ తదితర ప్రాంతాల్లో రెట్టింపు అడ్మిషన్లు నమోదు చేసుకోవడంతో తమ పిల్లలను కచ్చితంగా కేజీబీవీలో చేర్పించుకోవాలని తల్లిదండ్రులు ఎమ్మెల్యేలు మంత్రుల సిఫార్సులను కళాశాలపై రుద్దడంతో వారు మనోవేదనకు గురవుతున్నారు.సౌకర్యాల విషయంలో స్పందించని ప్రజాప్రతినిధులు తమ అనుచరుల పిల్లలు మాత్రం కేజీబీవీ లో చేర్చుకోవాలని ఒత్తిడి తేవడంపై ఎస్వోలు మానసిక ఆవేదనకు గురవుతున్నారు. పిల్లలను ఎక్కువగా చేర్చుకుంటే మెనూ మారుతుందని ఇతర సదుపాల కల్పనలో నిర్లక్ష్యం పేరుతో ఉన్నతాధికారులు తనిఖీ నిర్వహించి విధుల్లో ఉన్న ఎస్వోలు వారి సిబ్బందిపై చర్యలు తీసుకోవడం కాకుండా సర్వీస్ నుంచి తొలగించడంపై చర్చ జరుగుతుంది.వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోగా ఉన్న నిధులతో సర్దుబాటు చేసి సౌకర్యాలు కల్పిస్తున్న అధికారులు తమపై చర్యలు తీసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ అభిలాష అభినందనలతో పాటు అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు కేజీబీవీ జిల్లా కోఆర్డినేటర్ సులోమికరణతో పాటు మండల స్థాయి అధికారులు కూడా కేజీబీవీలను తని ఖీ చేసి పదలెత్తిస్తున్నంతో విధులు నిర్వహించే సిబ్బంది

## బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ జూలై 3,

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో నష్టపోయిన కుటుంబానికి అండగా ఉంటామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం ఉదయం సనత్ నగర్ లోని రాజరాజేశ్వరి నగర్ లో రవి, మాధురి దంపతులు అద్దెకు ఉంటున్న ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# 7వ చిన్న తరహా నీటి వనరుల గణనపై అధికారులకు శిక్షణ:

## జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి.పూర్ణచంద్రరావు



మంచిర్యాల జులై 03,(భారతశక్తి): 7వ చిన్న తరహా, 2వ నీటి వనరుల గణనపై మండల ప్రణాళిక, గణాంక అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వి. పూర్ణచంద్రరావు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మండల ప్రణాళిక, గణాంక అధికారులకు ఏర్పాటు చేసిన నీటి వనరుల గణనపై శిక్షణ కార్యక్రమానికి భూగర్భ జలశాఖ, జిల్లా నీటి పారుదల శాఖ, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాట్లాడుతూ 7వ చిన్న తరహా, 2వ నీటి వనరుల గణనపై మొబైల్ యాప్ ద్వారా గణన చేసే విధానంపై అధికారులకు వివరించడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణలో జిల్లాలోని అన్ని నీటి వనరులను గ్రామాల వారిగా, వనరుల వారిగా గణన చేసేందుకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన ఉప గణాంక అధికారి ద్వారా శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. శిక్షణ పొందిన అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి, డివిజనల్ ఉప గణాంక అధికారి, కార్యాలయ ఉప గణాంక అధికారి, మండల ప్రణాళిక, గణాంక అధికారులు పాల్గొన్నారు.

# వర్ష విపత్తును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం

## సర్వం సిద్ధం: జిల్లా కలెక్టర్ దివాకర

ములుగు జిల్లా ప్రతినిధి,జూలై 3 (భారత శక్తి) : జూలై, ఆగస్టు మాసాలలో జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, జిల్లా ప్రజల అప్రమత్తంగా ఉంటూ అధికారులుసూచనలు సలహాలను పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.




గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 61గ్రామాలు వర్ష ముప్పుకు గురి అయ్యే అవకాశం ఉందని, 970 శితలవస్థ లో ఉన్న ఇండ్ల కుటుంబాల యజమానులను అప్రమత్తంగాఉండాలని సూచించడం జరిగిందని అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు భారీ వర్షాల సందర్భంగా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రమాద స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 800 చెరువులు ఉండగా 13 చెరువుల పెద్దవి ఉన్నాయని, నీటి ప్రవాహంతో నిండా చెరువులను ముందస్తుగా గమనించడం జరుగుతుందని వివరించారు. ప్రస్తుత వర్షాకాలంలో లోతట్టు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో ఉండే పరిస్థితి ఉండడంతో వారికి సరిపడా నిత్యవసర సరుకులను ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచుతున్నామని, అధికారులు మొదటి హెచ్చరిక చేయగానే ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి 24 గంటల పాటు అధికారులు విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశామని, ప్రమాద పరిస్థితిలో ఉన్న 30 గ్రామాల ప్రజలకు రిస్క్ జాకెట్లను పంపిణీ చేయడంతో పాటు ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచి నాలుగు బోట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పర్యటించే పర్యాటకులు నీటి ప్రవాహాలలో దిగవద్దని, దట్టమైన అడవి ప్రాంతాలకు వెళ్ళవద్దని అన్నారు. వర్షపు విపత్తుని ఎదుర్కోవడానికి పోలీస్, అగ్నిమాపక సిబ్బంది, వైద్యశాఖ, విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశామని, లోతట్టు ప్రాంతాల లోని గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్య అధికారులకు తెలిపారు. 58 పునరావాస కేంద్రాలలో 15 వేల మంది ఉండే విధంగా ఏర్పాటు చేశామని, ప్రస్తుత వర్షాకాలంన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం. డి. రఫిక్, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెల్ ని పరామర్శించిన బిజెపి నాయకులు



మందమర్రి, జూలై 3 (భారత శక్తి): ఇటీవల అనారోగ్యానికి గురైన చెన్నూరు మాజీ శాసనసభ సభ్యులు నల్లాల ఓదెలుని ఈరోజు వారి స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించిన బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ ,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు దీవి దీక్షితులు, దేవర నేని సంజీవ రావు మందమరి పట్టణ అధ్యక్షులు సప్పిడి నరేష్ గిర్నాటి జనార్ధన్ ధారా రవి సాగర్ ఉపాధ్యక్షులు శనిగారపు శ్రీనివాస్ సంతోష్ సత్యంబాబు ఆయనను పరామర్శించడం జరిగింది.

# అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డ్ లు జారీ చేయాలి:

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,జులై 03, (భారతశక్తి): రేషన్కార్డుల కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత గల లబ్ధిదారులకు రేషన్కార్డులను జారీ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తుల ప్రక్రియ, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డుల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే రేషన్కార్డులు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ రకాల ధృవపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని, పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని, లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. నిర్మాణ స్థాయికి అనుగుణంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని, బేస్మెంట్ స్థాయి వరకు పూర్తి అయిన బిల్లులు సంబంధిత లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో నివాసాలకు అందుతున్న మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు అందించాలని, వాటర్ ట్యాంక్లు, మోటార్లు, పైప్లైన్ల లీకేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించి నీటి సరఫరాను పున రుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని తెలిపారుఈ కార్యక్రమంలో మండల తహశిల్దార్ సదానందం, మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగంపల్లి గ్రామంలో 2.40 కోట్ల నిధులతో మిషన్ భగీరథ బల్క్ నీటి కనెక్షన్

## నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 03: గురువారం సదాశివనగర్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో 2.40 కోట్ల నిధులతో మిషన్ భగీరథ బల్క్ నీటి కనెక్షన్ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, సకల సదుపాయాలతో టిజిఐఐసి ని ఏర్పాటు చేసుకుంటున్నాం. ఇప్పటికే ఒక కంపెనీ ని తీసుకొచ్చాను. అది కూడా వచ్చే నెలలో ప్రారంభం కాబోతుంది అని అన్నారు. మరిన్ని కంపెనీ లతో కూడా మాట్లాడుతున్నాను, ఈ కంపెనీ లు రావడం వల్ల మన నియోజకవర్గంలోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఎన్నో సార్లు జాబ్ మేళాలు పెట్టి యువతకు ఉపాధి కల్పించాను అని గుర్తు చేసారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు 23 కోట్ల నిధులను విడుదల చేసాము అని అన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ నిర్మాణ పనుల్లో భాగంగా భూంపల్లి, మోతే, కాటేవాడి జలశాల నిర్మాణాలకు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో, చీఫ్ ఇంజనీర్ తో మాట్లాడి అవసరమైన పెండింగ్ లో ఉన్న క్లియరెన్స్ చేపించాము అని అన్నారు. ఆర్థిక శాఖ నుండి ఫైనల్ అప్రూవల్ వస్తే జలాశయాల నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని రైతులకు తెలిపారు. భూములు కొల్పోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా ప్రభత్వానితో మాట్లాడుతాను అని అన్నారు. రైతుల వివరాలు రిపోర్ట్ తయారు చేసి ఒక వారం రోజులో అందించాలని ఎమ్మార్వో ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల అధ్యక్షులు, మండల ఎమ్మార్వో, మిషన్ భగీరథ అధికారులు, మండల సీనియర్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ కమిటి సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మిద్దెల హరిజనవాడ గ్రామంలోని స్కూలు తొలగించడం సరైన విధానం

## కాదు: ఎన్ డి విజయ జ్యోతి



భారత శక్తి ప్రతినిధి, కడప, జూలై 3:మిద్దెల గ్రామం పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న ప్రజలను వారి బాధలను అడిగి తెలుసుకున్నారు అక్కడ ఉన్న ప్రధానోపాధ్యాయతో విషయం అడిగి తెలుసుకున్నారు. మిద్దెల గ్రామంలోని దళితవాడలో గల ఎంపీపీ పాఠశాల నుండి మూడు నాలుగు ఐదు తరగతులు గల విద్యార్థులను అక్కడి నుండి నరసాపురం మూలపల్లె పాఠశాలలకు తరలించడంలో అంతర్వేమిటి దళితవాడలో పాఠశాల తొలగిస్తే అక్కడ పేద ప్రజలు చాలా ఇబ్బంది పడతారు. ఈ విషయంపై గ్రామ దళితుల పక్షాన తొందరలో జిల్లా కలెక్టర్ కి సమస్య తెలియపరచి ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు దళితవాడలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరు భాష , రఫీ , అస్లాం,మరియు గ్రామ దళితులు పాల్గొన్నారు.

# సదాశివనగర్ గ్రామ గంగపుత్ర సంఘానికి 1,00,000 రూపాయల

## విరాళాన్ని అందించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 03: ఎన్నికల సమయంలో గంగపుత్ర సంఘ సభ్యులు తమ ఆర్థిక, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు విన్న మదన్ మోహన్ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వారి సమస్యలను పరిష్కరిస్తానని, సంఘానికి లక్ష రూపాయల సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే ప్రకారం గురువారం ఆ హామీని నెరవేర్చుతూ, ?1,00,000 రూపాయల విరాళాన్ని గంగపుత్ర సంఘ సభ్యులకు స్వయంగా అందజేశారు. ప్రజలతో చేసిన ప్రతి హామీని గౌరవంగా తీసుకుని, నెరవేర్చడమే తన ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గంగపుత్ర సంఘ సభ్యులు ఎమ్మెల్యే తమకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చి గంగ పుత్ర సంఘ ప్రజలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే మదన్ మోహన్ కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి నాయకత్వాన్ని కొనియాడారు.

# జెడ్పీటిసి ఎంపీటీసీ ఎలక్షన్ ల్లో గెలుపు దిశగా బహుజన్ సమాజ్ పార్టీ



మందమర్రి, జులై 3 (భారత శక్తి): మందమర్రి పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్ ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీలో చేరికలు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ హాజరై పలువురు యువకులకు కండువా కప్పి బహుజన్ సమాజ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎండి మతిన్ ఖాన్ పాల్గొన్నారు. అనంతరం ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో మంచిర్యాల జిల్లాలో జడ్పీటీసీ ఎంపీటీసీ లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతామని, జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులను ఇప్పటికే సంసిద్ధం చేశామని, జడ్పీ చైర్పర్సన్ ఎన్నికలో బహుజన్ సమాజ్ పార్టీ కీలక పాత్ర పోషిస్తుంది అని తెలిపారు.

# రమేష్ మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకులను శిక్షించాలి : బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి





గోవిందరావుపేట/ ములుగు జిల్లా ప్రతినిధి, జులై 3 (భారత శక్తి) : చుక్క రమేష్ మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకులను వెంటనే శిక్షించాలని టిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్క రమేష్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అక్రమాలు జరిగాయని వాట్సాప్ వేదికగా ప్రశ్నించినందుకు తనపై తప్పుడు కేసు పెట్టినందుకే మనస్థాపానికి గురై సూసైడ్ నోటు రాసి మరి ఆత్మహత్య చేసుకున్నాడని బడే నాగజ్యోతి తెలిపారు. అతని రాసిన సూసైడ్ నోటులో గ్రామంలో ఉన్న కొందరి కాంగ్రెస్ నాయకుల వల్ల నేను చనిపోతున్నా అని రాయడం దురదృష్టకరం అని అన్నారు. వాట్సాప్ గ్రూపులో ఇందిరమ్మ ఇండ్లలో జరుగుతున్న అవకతవకలపై రెండు నెలలుగా ప్రశ్నిస్తున్నాడని ఆమె తెలిపారు. నిన్న వాట్సాప్ గ్రూప్ లో సీతక్క మన గ్రామంలో పేదవాళ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారని అడిగినందుకు కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురిచేసి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చి తన ఆత్మహత్యకు కారణమయ్యారని ఆమె అన్నారు. ప్రశ్నించే గొంతుకలను పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు గురిచేసిన కూడా పోరాటం ఆపేది లేదని అన్నారు. వారి చావుకు కారణమైన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జయరామిరెడ్డి అంత్య క్రియలలో పాల్గొన్న ఎమ్మెల్సీ గోవింద రెడ్డి



భారత శక్తి ప్రతినిధి, కడప, జూలై 3: సర్వాయపల్లె వద్ద ఇటీవల జరిగిన రిత్విక్ టిప్పర్ ప్రమాదం బద్వేలు నియోజకవర్గాన్ని విషాదంలోకి నెట్టింది. ఈ ఘోర ప్రమాదంలో బి కోడూరు మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన గుంత జయరామిరెడ్డి మృతి చెందడం తీవ్ర విషాదం.

ఈ నేపధ్యంలో ఈరోజు గుంతపల్లి గ్రామానికి వెళ్లి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు జయరామిరెడ్డి పార్థివదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటాం ఎమ్మెల్సీ గారు తెలిపారు.

కంపెనీ నిర్లక్ష్యం తీవ్రంగా తప్పు %-% కఠిన చర్యలు అవసరం రిత్విక్ కంపెనీ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ఇకపై ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది," అని ఘాటుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఓబుల్ రెడ్డి మాధవరెడ్డి, జడ్పిటిసి దావీదు, సింగల్ విండో చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బి కోడూరు సర్పంచ్ ముని రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఓ. సుధాకర్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, కె. వెంకటరామిరెడ్డి, కొండ వెంకటరామిరెడ్డి, ముడియాల సుబ్బారెడ్డి,గుంత జయరాం రెడ్డి,జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద వరి విత్తనాల చిరు సంచుల పంపిణీ

మందమర్రి, జూలై 03(భారత శక్తి ):

జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం ద్వారా 2025 వాన కాలానికి వరి విత్తనాల చిరు సంచులను గురువారం చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాదు పులిమడుగు గ్రామానికి చెందిన భుఖ్య అలివేణి, కున్సోతు సత్యవ్వ అను ఇద్దరు మహిళలకు వరి కె ఎన్ ఎం 7715, కే ఎన్ ఎం 12510 అను రెండు రకాల వరి విత్తనాల చిరు సంచులను 100% సబ్సిడీపై పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాదు మాట్లాడుతూ,ఒక్కో సంచి ఐదు కిలోల బరువు ఉండి దాదాపు పది గుంటలలో నాటు వేయడానికి సరిపోతుందని, ఈ విత్తనాలను ప్రత్యేకంగా నారు పోసి మండల వ్యవసాయ అధికారుల సూచనలను పాటిస్తూ ప్రత్యేక యాజమాన్య పద్ధతులను పాటిస్తూ సాగు చేయాలని తద్వారా పనితీరును నివేదించి మిగతా రైతులకు కూడా ఇట్టి



వరి విత్తనాలను అందించడం జరుగుతుందని కాబట్టి ఈ చిరు సంచులను సరైన యాజమాన్య పద్ధతులను పాటించి సాగు చేయాలని రైతులకు సూచించారు. వెంట మండల వ్యవసాయ అధికారి కిరణ్ మై, వ్యవసాయ విస్తరణ అధికారులు కనకరాజు, ముత్యం తిరుపతి రైతులు నీలయ్య, కిషన్, రాజవ్వ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి: ఎస్సీఈడీ చాతరాజుల దుర్గాప్రసాద్

మందమర్రి టౌన్, జులై 3( భారత శక్తి):

తెలంగాణ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సాంఘీక సంక్షేమ శాఖ ఈడి చాతరాజుల దుర్గాప్రసాద్ అన్నారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ లో గల సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాన్ని, భాగ్యనగర్ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహాన్ని, శ్రీపతి నగర్ లో గల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రికార్డులను, విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను ఆయన పరిశీలించారు. సంక్షేమ వసతి గృహాలలో చదువుకునే విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్ లదేనని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వంట గది, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని ఆయన సూచించారు. నిత్యం విద్యార్థులతో మమేకమై



వారి బాగోగులు చూడాలని అన్నారు. వీరి వెంట ఏ.ఎస్.ఓ రవీందర్, వార్డెన్ లు తిరుమల, కిషోర్, శ్రీనివాస్ లు ఉన్నారు.

# పేదలను అక్రమ కేసుల్లో ఇరికిస్తున్న ఫారెస్ట్ శాఖ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన సిపిఎం నాయకులు




మంచిర్యాల, జులై 03,(భారత శక్తి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అండతో మంచిర్యాల జిల్లాలో ఫారెస్ట్ శాఖ అధికారులు దుర్మాగంగా వ్యవరిస్తున్నారు.

ఆదివాసీల,పేదలపై అక్రమ కేసులు పెట్టి హింసకు గురి చేస్తున్నారు. జన్నారం మండలంలోని తపాల పూర్ లో ఆదివాసీలు దైవంగా పూజిస్తున్న భీమన్న దేవుడి గుడిని కూడ ఫారెస్ట్ శాఖ అధికారులు ధ్వంసం చెయ్యడం సిగ్గు చేటు,ఈ దుర్మార్గాన్ని అడ్డుకొని నిలదీసిన ఆత్రం రాజుపైన తన ఇద్దరి కుమారులైన ఆత్రం రవి కుమార్,ఆత్రం సుధాకర్ లపైన ఫారెస్ట్ శాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి లక్షెట్ పెట్ రేంజిలో అర్ధ రాత్రి వరకు బందించడం,మనిషికంగ వేదించడం సిగ్గు చేటు.జిల్లాలో ఫారెస్ట్ శాఖ అంటేనే మాఫియా శాఖగా అర్ధం వచ్చే విధంగా వ్యవరిస్టున్నరు.మందమర్రి మండలంలో గుట్టలను త్రవ్వక పోతు ప్రకృతిని ధ్వంసం చేస్తున్న బడ బాబులను పట్టుకునే దమ్ము ఫారెస్ట్ శాఖ అధికారులు లేదు. వీళ్ళ పెత్తనం,దౌర్జన్యాలు మాత్రం ఆదివాసీల,పేదలపై చూపిస్తున్నారు.

ఆదివాసీల ఆచారాలను,సంప్రదాయాలను,వారి మనుగడను,దైవాలను విధ్వంసం చేస్తున్న ఫారెస్ట్ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తున్నది.

ఈ కార్యక్రమంలో సంకె రవి సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి,జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్,దూలం శ్రీనివాస్, కే..ప్రేమ్ కుమార్,

నాయకులు మిడివెల్లి రాజు,అరిగేల మహేష్, డూర్కే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు బ్యాగులు పంపిణీ చేసిన బిజెపి నాయకులు.

మందమర్రి, జులై 03,(భారత శక్తి): మందమర్రి మండలం అందుగుల పేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఈరోజు బిజెపి రాష్ట్ర యువ నాయకులు దారా రవి సాగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు



పెన్నులు బ్యాగులు నోటుబుక్కులు జిల్లా అధ్యక్షులు నగనూరు వెంకటేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే కాకుండా విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి భారతీయ జనతా పార్టీ తరఫున కృషి చేయడం జరుగుతుందని, అందులో భాగంగానే బిజెపి నాయకులు రవి సాగర్ రావు పాఠశాలలో విద్యార్థులకు అవసరమైనటువంటి బ్యాగులు, పెన్నులు నోటుబుక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మునుముందు ఏమైనా సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు అందుగుల శ్రీనివాస్ మండలాధ్యక్షుడు జనార్ధన్, ఇన్చార్జ్ సంజీవరావు, కన్వీనర్ అక్కల రమేష్, పట్టణ అధ్యక్షుడు నరేష్ సంతు రామ్ నాయక్, జనార్దన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలుచేస్తాం:మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 03:అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు, గురువారం రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో పర్యటించి ఎస్సీ కాలని నందు సి.ఆర్.ఆర్.(ఎస్.సి.పి.) నిధులు 50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ తొలి విడతలో గుడిసెల్లో ఉన్న నిరుపేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని, ఇంకా ఎవరైనా గుడిసెలలో ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు రాని పక్షంలో ప్రతిపాదనలు అందించాలని వెంటనే మంజూరు చేస్తామని, దశల వారీగా మిగిలిన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు.గ్రామంలో గుడిసెలో ఉంటున్న వారి ఫోటోలు తీసుకొని రావాలని మంత్రి తెలిపారు. గ్రామంలో నిరుపేదలైన అర్హులకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ



చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, వేపకుంట్ల గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరానికి ధీటుగా మండల హెడ్ క్వార్టర్ అభివృద్ధి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**- పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి 1500 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు**

**-కూసుమంచి మండలంలో 5.5 కోట్లతో జూనియర్ కళాశాల నిర్మాణం**



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 03:నగరాలకు ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రివర్యులు, కూసుమంచి మండలంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి గురువారం పర్యటించి పలు రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు.ధర్మతండా గ్రామంలో 36 లక్షలతో కూసుమంచి ఆర్ అండ్ బి రోడ్డు నుండి ధర్మతండా వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనులకు, లోక్యాతండా గ్రామంలో ఒక కోటి 26 లక్షలతో లోక్యాతండా నుండి ధర్మతండా వరకు, ఒక కోటి 16 లక్షలతో లోక్యాతండా నుండి అగ్రహారం వరకు చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులకు, కోక్యాతండా గ్రామంలో 2 కోట్ల 90 లక్షలతో కోక్యాతండా నుండి వీర్యాతండా వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గన్యాతండా గ్రామంలో 3 కోట్ల 30 లక్షలతో గన్యా తండా నుండి మోటాపురం వీరన్న స్వామి టెంపుల్ వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కూసుమంచి గ్రామంలో 6 కోట్ల 50 లక్షలతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి పనులకు, ఖమ్మం - కోదాడ, కూసుమంచి, నేలకొండపల్లి పట్టణ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి రోడ్డులో ఏర్పాటు చేయు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.కోక్యా తండాలో నిర్మాణంలో ఉన్న బాణోత్ సురేష్, భూమిక ల ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ప్రభుత్వం నుండి ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు, నిర్మాణం పూర్తి అయిన వాటికి దశల వారిగా ప్రతి సోమవారం విడతలుగా నేరుగా లబ్దిదారుని ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కూసుమంచి, నేలకొండపల్లి మండల హెడ్ క్వార్టర్ లలో 6 కోట్ల 50 లక్షల రూపాయలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్స్, జంక్షన్ అభివృద్ధి పనులు కొద్ది నెలల్లో పూర్తి చేస్తామని, ఖమ్మం నగరానికి ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను తయారు చేస్తామని అన్నారు.కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి అంతర్గత రోడ్లు నిర్మించామని, త్రాగునీటి సరఫరా సమస్యలు పరిష్కరించామని, 50 లక్షల రూపాయలతో షాదీ ఖానా మంజూరు చేసుకున్నామని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో మంజూరు చేశామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు.గత 18 నెలల కాలంలో ధర్మతండా గ్రామంలో 22 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్లు పూర్తి చేశామని, 20 లక్షల రూపాయలతో గిరిజన శాఖ ద్వారా పలు అభివృద్ధి పనులు, లోక్యతండా గ్రామంలో 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు, 12 లక్షలతో అంగన్ వాడి కేంద్రాల అభివృద్ధి, 4 లక్షల రూపాయలతో త్రాగు నీటి సరఫరా పనులు, కొక్యా తండా లో 14 లక్షలు ఖర్చుపెట్టి సిమెంట్ రోడ్లు, 12.35 లక్షలతో అంగన్వాడీ భవనం, 10 లక్షలు ఖర్చు పెట్టి మంచినీటి సమస్య తీర్చుకున్నామని అన్నారు. పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత 18 నెలల కాలంలో సుమారు 1400 నుంచి 1500 కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేసుకున్నామని తెలిపారు. ప్రజల దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడినందున ఇంత అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు.గత పాలకులు అమలు చేసిన సంక్షేమం కొనసాగిస్తూ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ హాస్టల్స్ లలో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జిలు 200 శాతం పెంచామని, రైతులకు 21 వేల కోట్ల రూపాయలతో 2 లక్షల రుణ మాఫీ చేశామని అన్నారు.గత ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల రూపాయలు అందిస్తే, ప్రజా ప్రభుత్వం రైతులకు అందించే సహాయం 12 వేలకు పెంచి, 9 రోజుల వ్యవధిలో దాదాపు 9 వేల కోట్ల రూపాయ లను రైతు భరోసా నిధులు జమ చేసామని అన్నారు. ప్రతి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తుందని అన్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాలలో మరో 3 విడతల్లో అర్హులైన పేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకు గ్యాస్ సిలండర్, రైతు రుణమాఫీ, రైతు భరోసా అందిస్తున్నదని అన్నారు. అర్హులైన పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తుందన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, శంఖుస్థాపన చేసిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఇఇ మిషన్ భగీరథ వాణిశ్రీ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, విద్యుత్ శాఖ ఏడిఇ లోక్యా నాయక్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులను పరామర్శించిన ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూలై 03 :సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన పెనువిషాద సంఘటనా స్థలాన్ని బుధవారం ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సందర్శించారు. పటాన్ చెరువులోని ధ్రువ మదీనాగూడ ప్రణం ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. గాయపడిన క్షతగాత్రులను హాస్పిటల్ వెళ్లి పరామర్శించారు. సంఘటన జరిగిన వివరాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్, చైర్మన్ ఎంఏ ఫహీం, పటాన్చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తుల సేవలకు ఆటంకం కల్గిస్తే చర్యలు తప్పవు : టిటిడి

తిరుపతి జిల్లా ప్రతి నిధి, జూలై 03(భారత శక్తి): శ్రీవారి భక్తులకు సేవలు అందించే కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులను బహిష్కరించి నిరసనలకు దిగితే చర్యలు తప్పవని టిటిడి పేర్కొంది. కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన కోరికలను సదరు శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని కోరింది. న్యాయమైన కోర్కెలను తీర్చడానికి యాజమాన్యం సదా సంసిద్ధంగా ఉందని పేర్కొంది. పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితర శాఖలలో సంబంధిత కాంట్రాక్ట్ ఉద్యోగులు విశేషంగా సేవలు అందిస్తున్నారని, భక్తులకు ఇబ్బందులకు గురిచేసే చర్యలు తీసుకోవద్దని కోరింది. భక్తుల సేవలకు ఉద్యోగులు ఆటంకం కల్గించే చర్యలను నిషేధించే ముఖ్యమైన సేవల నిర్వహణ చట్టం ( ఎస్మా) టిటిడిలో అమలులో ఉందని, సదరు నిబంధనలను ఉద్యోగులు గుర్తు చేసుకోవాలని టిటిడి పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఆధ్యాత్మిక సంస్థలో విధులను బహిష్కరించడం సరికాదని సూచించింది. నిబంధనలను ఉల్లంఘించి సమ్మెబాట పడితే ఎస్మా చట్టాన్ని అమలు చేస్తామన్నారు. ఎస్.ఎల్.ఎస్.ఎం.పీ.సీ సంస్థతోపాటు కాంట్రాక్ట్, పలు సొసైటీలలో ఉద్యోగులు పనిచేస్తున్నారని, సదరు ఉద్యోగులు విధులను బహిష్కరిస్తే ఎస్మా చట్టం ప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గతంలో టిటిడిలో విధులను బహిష్కరణ చేసినా మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకోవడం జరిగింది. ఈసారి విధుల నుండి తొలగించాక విధులను బహిష్కరించిన వారిని ఎలాంటి పరిస్థితుల్లో తిరిగి చేర్చుకోరని టిటిడి తెలిపింది. టిటిడిలో భక్తులకు సేవలు అందించే ఉద్యోగులు ధర్నాలు చేయడం, నిరసన నోటీసులు ఇవ్వడం, ఊరేగింపులు చేయడం చట్టప్రకారం నిషేధం. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా, ఉద్యోగుల విధులకు టిటిడితో సంబంధం లేని బయట వ్యక్తులు ఆటంకం కల్గిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలకు వెనుకాడమని హెచ్చరించింది.


రోగుల వైద్య సేవలను బహిష్కరిస్తే చర్యలు తప్పవు- స్విమ్స్ డైరెక్టర్ శ్రీ ఆర్వీ కుమార్

స్విమ్స్ లో విధులు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస కార్పోరేషన్ లోని కాంట్రాక్ట్ ఉద్యోగులు గత కొంత కాలంగా పలు రకాల కోరికలను కోరుతూ విధులను బహిష్కరించేందుకు సిద్ధపడుతున్నారని , టిటిడి యాజమాన్యం చాలా సామరస్యంగా పరిష్కరించాలని ఉందన్నారు. సదరు ఉద్యోగులు సంబంధిత శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు.స్విమ్స్ లో ఎస్మా చట్టం అమలులో ఉన్నందున సమ్మె నోటీస్ ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. వైద్య సేవలకు ఆటంకం కల్గిస్తే విధుల నుండి తొలగించే నిబంధన ఉందని, తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. విధులను బహిష్కరించి సమ్మెకు దిగితే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. స్విమ్స్ తో సంబంధం లేని బయట వ్యక్తుల ప్రమేయంతో నిరసనలకు దిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విధులను బహిష్కరించినందుకుగాను, ఒకసారి ఉద్యోగం తొలగించాక, సదరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోరనే విషయాన్ని గమనించాలని స్విమ్స్ డైరెక్టర్ ఉద్యోగులను కోరారు.

# ఘనంగా ప్రభుత్వ విప్ ఆది తనయుడు కార్తీక్ జన్మదిన వేడుకలు.

**ఆది కార్తీక్ జన్మదిన సందర్భంగా నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ.**







వేములవాడ, జూలై 03 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తనయుడు ఆది కార్తీక్ జన్మదిన వేడుకలు వేములవాడ పట్టణంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నేత, ఆర్యవైశ్య అన్నపూర్ణ సత్రం వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ పవన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఆది కార్తీక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న ఆలయం సమీపంలోని శివుని విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

అనంతరం బీసీ సెల్ అధ్యక్షులు నాగుల రాము ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ముందు కేక్ కటింగ్ నిర్వహించారు, తదనాంతరం అర్బన్ మండలంలోని మారుపాక గ్రామంలో ఉన్న మూడు అంగన్వాడి సెంటర్ లో ఉన్నా సుమారు 50 మంది చిన్నారులకు వేములవాడ కాంగ్రెస్ యువ నాయకుడు మైలారం రాము ఆధ్వర్యంలో చిన్నారులకు పలకలు, బలపాలు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రెండీ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, నాయకులు ఇప్ప పూల అజయ్, ముప్పిడి శ్రీధర్, మహమ్మద్ అక్రమ్, రోమాల ప్రవీణ్, వాళి పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

# ఘరానా దొంగల అరెస్ట్..

**- దేవాలయాల్లోనూ, ఇతర చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ కరచ శివానంద, ఎస్.కె. హాం షరీఫ్, అక్కపల్లి క్రాంతి కుమార్..**

**- దోగిలించిన సొత్తు స్వాధీనం..**

**- కేసు దర్యాప్తు చేస్తున్న రాచకొండ, ఇబ్రహీంపట్నం పోలీసులు..**

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి,జులై 03:రాచకొండ కమిషనర్ జీ. సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు, అందిన సమాచారం మేరకు సీసీఎస్ ఎల్.బీ. నగర్, ఇబ్రహీంపట్నం పోలీసులు కరడుగట్టిన ముగ్గురు దొంగలను మంగళపల్లి చౌరస్తా వద్ద 2వతేదీ నాడు ఉదయం 8-30 గంటలకు అదుపులోకి తీసుకుని వారిపై క్రైమ్ నెంబర్ 317/2025 యూ/ఎస్ 303 (3), 305 బీ. ఎన్ . ఎస్ ఆఫ్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్, మహేశ్వరం జోన్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కేసు నమోదు చేశారు.. నిందితుల వివరాలు :ఏ 1. కరచ శివానంద తండ్రి కీశే నగేష్, 52 సంవత్సరాలు.. వృత్తి లేబర్.. ఇతను కర్నూల్ కి చెందిన వాడు.. ప్రస్తుతం వనస్థలిపురంలో నివాసం ఉంటున్నాడు.. ఏ 2.





ఎస్.కె. హం షరీఫ్ తండ్రి జమాల్, వయసు 38 సంవత్సరాలు.. ఇతను ప్రకాశం జిల్లాకు చెందిన వాడు ప్రస్తుత నివాసం ఎల్.బీ. నగర్.. ఎ 3. అక్కపల్లి క్రాంతి కుమార్ తండ్రి బాలయ్య, వయసు 31 సంవత్సరాలు, వృత్తి స్క్రాప్ బిజినెస్. నివాసం ఉప్పల్.. స్వాధీనం చేసుకున్న సొత్తు :పంచలోహ రాముడి విగ్రహం, పంచలోహ లక్ష్మణ విగ్రహం, పంచలోహ సీతాదేవి విగ్రహం, పంచలోక హనుమాన్ విగ్రహం, అలాగే పంచలోహాలతో కూడిన పెద్దిరాజు, పెద్దమ్మ, అయ్యప్ప స్వామి, విగ్రహాలు అలాగే వెండి అయ్యప్ప స్వామి విగ్రహం, అల్యూమినియం సాయి బాబా విగ్రహం.. పంచలోహ శ్రీరామ విగ్రహం, పంచలోహ లక్ష్మణ విగ్రహం అలాగే పంచలోహ సీతమ్మ విగ్రహం.. వీటితోబాటు గుడి గంటలు 3, దీపపు స్తంభాలు 3, గుడి గంటలు 3, స్టీల్ హుండీ బాక్స్ నాణేలతో.. స్టీల్ హుండీ బాక్స్ ఖాళీది.. ఇక మొబైల్ ఫోన్స్, బంగారపు పుస్తెల తాడు, రోల్డ్ గోల్డ్ చైన్స్, సీబీ షైన్ బైక్, ఫిజిక్స్ రిస్ట్ వాచ్, ఎలెక్ట్రానిక్ వెయింగ్ మిషన్, ఇరాన్ క్రో బార్లు, రించి ప్లానర్ టూల్స్, ఫాల్స్ మోటార్ సైకిల్ తాళాలు..నిందితులు బ్రతుకు తెరువుకోసం హైదరాబాద్ సిటీ కి వచ్చి ఇక్కడ కిరాయికి నివాసం ఉంటూ విలాసాలకు అలవాటు పది దొంగతనాలు చేయడం మొదలు పెట్టారు.. ఇంతకు మునుపే వీరి మీద పలు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.. నిందితులను పట్టుకున్నందుకు సుధీర్ బాబు ఐపీఎస్ మిగిలిన పోలీసు అధికారులను అభినందించారు.. ఇన్సపెక్టర్స్ వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, సబ్ ఇన్సపెక్టర్స్ అశోక్, అనిల్, రవి కుమార్, ఏ.ఎస్.ఐ. విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్స్ తస్లీమా, బాలకృష్ణ, కానిస్టేబుల్స్ రమేష్, రాజ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, రాజు, ఈశ్వర్, జవహర్లాల్, శేఖర్ వీరు రాచకొండ స్టాఫ్ కాగా, ఇబ్రహీం పట్నం స్టేషన్ నుంచి ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ చందర్ సింగ్, కానిస్టేబుల్స్ కోటేశ్వర్ రావు, చంద్ర శేఖర్, బీ. రాజు, నగేష్ లు ఈ ఆపరేషన్ లో పాల్గొన్నారు..

# సాహెూ.. కెప్టెన్ గిల్ సాబ్.. ఏమా ఆటతీరు




ఇప్పటికే అర్థమై ఉంటుంది కదా.. ఇంతటి ఉపోద్ఘాతం ఎవరి గురించో.. అతడే భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌తో టీమ్‌ఇండియా సారథిగా ఫుల్‌టైమ్ బాధ్యతలు చేపట్టిన గిల్ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కెప్టెన్‌గా ముందుండి నడిపించాలనే ప్రాథమిక సూత్రాన్ని భలేగా ఔపోశన పట్టాడు. అందుకు తగినట్టుగానే తొలి టెస్టులో సెంచరీ.. ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతోన్న రెండో మ్యాచ్‌లోనూ 'ఓర్పు'తో కూడిన శతకంతో ఆకట్టుకున్నాడు. ఎందుకు ఇక్కడ 'ఓర్పు' అనే పదం వాడటానికి కారణముంది. ప్రత్యర్థి బౌలర్ల నుంచి ఎదురైన సవాల్‌ను ఏకాగ్రత కోల్పోకుండా అతడు చేసిన సెంచరీని చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. మనం పైన అనుకొన్నట్లుగా 96.5 శాతం కంట్రోల్‌గా ఉండి చేసిన శతకమిది. ఒక్కో బంతిని ఆచితూచి ఆడుతూనే.. చెత్త బంతులను సైతం కొడుతూ సెంచరీ సాధించాడు. అప్పటి వరకూ కామ్‌గా పరుగులు రాబట్టిన అతడు సింహనాదంతో సంబరాలు చేసుకున్న తీరూ అభిమానులను ఆకట్టుకుంది.

ఆ మాట గుర్తుందిగా..

తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో గిల్ 147 పరుగులు చేశాడు. కానీ, అతడు ఔటైన తర్వాత భారత బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. అప్పటి వరకూ 500o స్కోరుపై కన్నేసిన టీమ్‌ఇండియా 471 పరుగులకే ఆలౌటైంది. ఆ మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ.. 'అనవసరమైన షాట్ ఆడి వికెట్ సమర్పించడం బాధేసింది. ఆ షాట్ ఆడకుండా ఉండాల్సింది' అని అన్నాడు. ఇప్పుడు రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనూ గిల్‌కు కఠిన పరీక్షే ఎదురైంది. ఎడ్జ్‌బాస్టన్ తొలి రోజు బౌలర్లకు సహకరించింది. కొన్ని ఓవర్లు మినహా బంతిని ఆడటం చాలా కష్టంగా మారింది. ఒక వైపు యశస్వి జైస్వాల్ (87) కాస్త దూకుడుగా ఆడుతున్నా.. గిల్‌ను టార్గెట్ చేస్తూ ఇంగ్లిష్ బౌలర్లు ఎటాకింగ్ బౌలింగ్ చేశారు. వాటిని కాచుకున్న గిల్ 199 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకోవడం గమనార్హం. యశస్వి జైస్వాల్ అంపైర్స్ కాల్ నిర్ణయాలతో ఓ రెండు అవకాశాలు వచ్చాయి. కానీ, గిల్ ఏమాత్రం ప్రత్యర్థి బౌలర్లకు ఛాన్స్ ఇవ్వలేదు. ఇప్పటికే ఐదు వికెట్లను కోల్పోయిన భారత్‌ను ఆదుకోవాలంటే ఈ సెంచరీని 'డబుల్'గా మార్చాల్సిందే.

సారథిగా మరింత బాధ్యతాయుతం

టెస్టు సిరీస్‌కు ముందు సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాను కెప్టెన్‌గా నియమిస్తారని అంతా భావించారు. కానీ, గంభీర్-టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ మాత్రం బుమ్రాపై అదనపు ఒత్తిడి లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకోలేదు. ఇక టెస్టుల్లో సీనియర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లలో ఒకరిని వరిస్తుందనుకున్నారు. అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేయడంతో సంభ్రమాశ్చర్యానికి గురైన పరిస్థితి. ఎందుకంటే గత ఆస్ట్రేలియా పర్యటనలో ఘోరంగా విఫలమయ్యాడు. వన్‌డౌన్‌లో పరుగులు చేసేందుకు ఇబ్బందిపడ్డాడు. అలాంటి ప్లేయర్‌కు సారథ్యం వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ, గిల్ కెప్టెన్‌గా బాధ్యతాయుతంగా ఆడటం ఈ రెండు టెస్టుల్లో చూశాం. వికెట్లకు దూరంగా వెళ్లే బంతులను శిక్షించాలనే ఉత్సాహాన్ని అదుపులో పెట్టుకొని సాధికారికంగా ఇన్నింగ్స్ కొనసాగిస్తూ భారత్‌ను మెరుగైన స్థితిలో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, స్టోక్స్, బషీర్ నుంచి ఎదురైన కఠిన సవాల్‌కు తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. కెప్టెన్సీ చేపట్టకముందు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో తెగ ఇబ్బంది పడేవాడు. ఇప్పుడు బాధ్యతతో ఆడుతూ పరుగులు రాబడుతున్నాడు.

తొలి భారత బ్యాటర్: ఇంగ్లాండ్‌లో వరుసగా రెండు టెస్టుల్లోనూ తొలి రోజు మొదటి ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన తొలి భారత బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. ఈ సిరీస్‌కు ముందువరకు ఎప్పుడూ అతడు తొలి రోజు/తొలి ఇన్నింగ్స్‌లో శతకం చేయకపోవడం గమనార్హం.

చివరిగా..: కెప్టెన్ లేదా జట్టులోని ఒకరిద్దరు బాగా ఆడినా గెలవకపోవడానికి చాలా కారణాలు ఉంటాయి. టీమ్‌లోని అందరూ కలసికట్టుగా ఆడితేనే విజయం వరిస్తుంది. బ్యాటర్‌గా గిల్ ఇప్పుడు సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సారథిగానూ జట్టును విజయతీరాలకు చేరిస్తే అతడి 'కెప్టెన్సీ' భవిష్యత్తుకు పదేళ్లపాటు ఢోకా ఉండదనేది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.




# తుది జట్టు ఎంపికలో మాకెలాంటి సందేహం లేదు: గిల్‌కు యశస్వి మద్దతు

ఇంగ్లాండ్‌తో ( రెండో టెస్టుకు ఎంపిక చేసిన భారత తుది జట్టుపై మాజీల నుంచి విమర్శలు వచ్చాయి. సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం, స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను కాదని వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడం, సాయి సుదర్శన్‌ను పక్కన పెట్టడం.. ఇందులో కీలక అంశాలు. టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ తీసుకుంటున్న నిర్ణయాలు అయోమయానికి గురిచేసేలా ఉన్నాయనేది వారి వాదన. అయితే, ఈ విషయంలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు యశస్వి జైస్వాల్ మద్దతుగా నిలిచాడు. తుది జట్టు ఎంపికలో తమకు ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేదని స్పష్టంచేశాడు. కెప్టెన్‌గా ఉంటూ గిల్ అద్భుతమైన ఆటతీరును ప్రదర్శిస్తున్నాడని యశస్వి తెలిపాడు.

"గిల్‌తో కలిసి బ్యాటింగ్ చేయడం బాగుంది. ఇంగ్లాండ్‌పై వరుసగా రెండో శతకం బాదాడు. జట్టు కోసం ఏం చేయాలి? ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై స్పష్టతతో ఉంటాడు. అతడిలో కనిపిస్తోన్న ఆత్మవిశ్వాసమే దానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఉత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు మేమెప్పుడూ ప్రయత్నిస్తాం. తుది జట్టు విషయంలో ఎలాంటి అయోమయానికి గురయ్యే పరిస్థితే లేదు. ఆ విషయంలో ఎలాంటి సందేహం లేదు. ఎడ్జ్‌బాస్టన్‌లోనూ నా బ్యాటింగ్‌ను ఆస్వాదించా. ఒక్కో స్పెల్, ఒక్కో సెషన్‌ను బేరీజు వేసుకుంటూ ఆడేందుకు ప్రయత్నిస్తా. ఎక్కడైతే పరుగులు రాబట్టే అవకాశం ఉందని నాకు అనిపిస్తే ఆ ఛాన్స్‌ను అస్సలు వదులుకోను. కొత్త బంతితో ప్రత్యర్థి బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. ఆ సమయంలో ఎటాకింగ్ చేయడం చాలా కష్టం. ఎప్పుడైతే స్వింగ్ ఆగిందో అప్పుడు షాట్లు కొట్టేందుకు వెళ్లా" అని జైస్వాల్ ( వెల్లడించాడు.

చేజారినందుకు బాధగానే ఉంది.. కానీ

"మూడంకెల స్కోరు చేయలేకపోయినందుకు బాధగానే ఉంది. ఆటను ఆస్వాదించాలని కోరుకుంటా. అంతేకానీ, మైలురాళ్ల గురించి పెద్దగా పట్టించుకోను. పొరపాట్ల నుంచి నేర్చుకుంటూ ఆటను ఎంజాయ్ చేస్తా. ఇంగ్లాండ్ బౌలర్లు ఫుల్‌షాట్లు కొట్టేందుకు నన్ను ఎక్కువగా ఊరిస్తారు. వాటిని ఎలా ఆడాలనేది నాకంటూ ఓ ప్రణాళిక ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఆ సమయంలో ఏది మంచిదో దానిని అనుసరిస్తా. తొలి రోజు మేం మంచి స్కోరే చేయగలిగాం. రెండో రోజు కూడా ఇంకొన్ని పరుగులు చేయగలిగితే పట్టు సాధించేందుకు మాకే ఎక్కువ అవకాశం" అని జైస్వాల్ వెల్లడించాడు.

రెండో టెస్టులో యశస్వి 87 పరుగులు చేశాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధిక పరుగులు చేసిన (87) ఓపెనర్‌గా మాత్రం యశస్వి నిలవడం గమనార్హం. అయితే, మరో పది పరుగులు కొట్టి ఉంటే.. అత్యంత వేగంగా 2000 పరుగుల మార్క్‌ను అందుకొన్న భారత బ్యాటర్‌గా నిలిచేవాడు. యశస్వి 39 ఇన్నింగ్స్‌ల్లో 1990 పరుగులు చేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 10 రన్స్ చేసినా చాలు.. రాహుల్ ద్రవిడ్ (40 ఇన్నింగ్స్‌లు), వీరేంద్ర సెహ్వాగ్ (40)తో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతాడు.

FONT SIZE

# దాంతో పోల్చొద్దు.. రూ. 4 లక్షలు చాలా తక్కువ: షమీ భార్య హసీన్



: విడిగా ఉంటోన్న భార్య, కుమార్తె సంరక్షణ కోసం నెలకు రూ.4 లక్షలను భరణం కింద చెల్లించాలని భారత పేసర్ మహ్మద్ షమీకి కోల్‌కతా హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో రూ. 1.5 లక్షలు భార్య హసీన్ జహాన్ కోసం, రూ.2.5 లక్షలు కుమార్తె కోసం వెచ్చించేందుకు చెల్లించాలని పేర్కొంది. ఈ అంశంపై షమీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. కోర్టు తీర్పుపై హసీన్ సంతోషం వ్యక్తంచేశారు. దాదాపు ఏడేళ్ల నుంచి చేస్తోన్న పోరాటానికి న్యాయం జరిగిందని తెలిపారు. అయితే, షమీ స్థాయిని బట్టి ఈ భరణం చాలా తక్కువని.. మేం రూ. 10 లక్షల వరకు కోరినట్లు వ్యాఖ్యానించారు.

"సుదీర్ఘంగా మేం చేసిన పోరాటానికి ఇప్పుడు విజయం దక్కింది. ఇప్పుడు నా కుమార్తెకు మంచి విద్యను అందించగలను. ఆమె లైఫ్ సాఫీగా ముందుకు తీసుకెళ్లగలను. అయితే, షమీ స్థాయి, అతడి జీవన విధానం, సంపాదన చూస్తే ఈ భరణం చాలా తక్కువే. అందుకే దాంతో అస్సలు పోల్చకూడదు. ఏడేళ్ల కిందటే మేం అతడి నుంచి నెలకు రూ. 10 లక్షల వరకు ఇప్పించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశాం. అప్పటినుంచి అతడి ఆదాయం, ఖర్చులు కూడా పెరిగాయి. షమీ ఎలా తన జీవితాన్ని గడుపుతున్నారో.. నేనూ, నా కుమార్తె కూడా అదే స్థాయిని కొనసాగించే హక్కు ఉంది" అని జహాన్ వెల్లడించారు.

పెరిగే అవకాశం ఉంది: జహాన్ లాయర్

"హసీన్ జహాన్, ఆమె కుమార్తెకు ఇవి అద్భుతమైన క్షణాలు. 2018 నుంచి ఆమె చాలా ఇబ్బందులు పడింది. ఇప్పుడు కోర్టు తీసుకున్న నిర్ణయంతో న్యాయం జరిగింది. జహాన్ ఖర్చుల కోసం రూ. 1.5 లక్షలు, కుమార్తె కోసం రూ. 2.5 లక్షల చొప్పున నెలకు చెల్లించాలి. అలాగే కుమార్తెకు ఇంకేమైనా అవసరమైతే షమీ అందించాలి. మధ్యంతర ఉత్తర్వుల్లోని ప్రధాన దరఖాస్తును ట్రయల్ కోర్టు ఆరు నెలల్లో పరిష్కరించాలని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ క్రమంలో భరణంపై విచారణ ముగిసేనాటికి ఇప్పుడున్న రూ.4 లక్షలను రూ.6 లక్షల వరకూ పెంచే అవకాశం లేకపోలేదు. హసీన్ తన భరణ దరఖాస్తులో రూ. 10 లక్షల వరకు క్లెయిమ్ చేశారు" అని జహాన్ న్యాయవాది ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు.

# గాఫ్ ఔట్

ప్రపంచ నంబర్‌వన్ సబలెంక వింబుల్డన్‌లో శుభారంభం చేసింది. ఫైనల్లో ఆమెపై గెలిచి ఫ్రెంచ్ ఓపెన్‌ను చేజిక్కించుకున్న రెండో సీడ్ కొకో గాఫ్‌కు మాత్రం తొలి రౌండ్లో షాక్ తగిలింది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అల్కరాస్, ఏడుసార్లు ఛాంపియన్ జకోవిచ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు.లండన్: టాప్ సీడ్ సబలెంక (బెలారస్) వింబుల్డన్‌లో రెండో రౌండ్లోకి ప్రవేశించింది. కానీ ఆమెకు గట్టి ప్రతిఘటన తప్పలేదు. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సబలెంక 7-6 (7-1), 6-4తో బౌజ్కోవా (చెక్)పై కష్టపడి గెలిచింది. సబలెంక తొలి సెట్‌ను కోల్పోవడానికి రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. సెట్ కోసం సర్వ్ చేస్తూ బౌజ్కోవా 30-15తో నిలవగా.. సబలెంక పుంజుకుంది. బ్రేక్‌తో స్కోరును సమం చేసిన సబలెంక.. సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకెళ్లింది.




# కుర్రాళ్లూ.. అదరగొట్టారు: గిల్ - యశస్విపై సచిన్ ప్రశంసలు

: ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో కఠినమైన ఎడ్జ్‌బాస్టన్ పిచ్‌పై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుతంగా ఆడారు. యశస్వి కాస్తలో సెంచరీని చేజార్చుకోగా.. గిల్ మాత్రం వరుసగా రెండో శతకం సాధించాడు. ఈక్రమంలో వీరిద్దరిపైనా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న మైదానంలో పట్టుదల ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన గిల్‌ను యువరాజ్ సింగ్ అభినందించాడు.

"యశస్వి జైస్వాల్ తొలి బంతి నుంచే తన విధానం ఏంటో చెప్పాడు. పాజిటివ్, ఫియర్‌లెస్, స్మార్ట్ అగ్రెసివ్‌తో ఆడాడు. కొద్దిలో సెంచరీ మిస్ అయినా అతడి ఇన్నింగ్స్ మాత్రం సూపర్. ఇక కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూల్‌గా ఉంటూ ఒత్తిడిలోనూ ఏకాగ్రత కోల్పోకుండా అద్భుతమైన డిఫెన్స్‌తో శతకం బాదాడు. కుర్రాళ్లూ.. క్లాసిక్ గేమ్‌తో అదరగొట్టారు" అని సచిన్ పోస్టు చేశాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో సెంచరీలు చేసిన భారత బ్యాటర్ల జాబితాలోకి గిల్ చేరాడు. ఇంతకుముందు సచిన్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా శతకాలు చేశారు. విరాట్ (147) అత్యధిక పరుగులు చేసిన టీమ్‌ఇండియా బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించే అవకాశం గిల్ ఎదుట ఉంది.

బాధ్యతతో ఆడితే..: యువీ

"బాధ్యత అనగానే కొందరు ఉవ్వెత్తున లేస్తారు. తమ పూర్తిస్థాయి నైపుణ్యాలను ప్రదర్శిస్తారు. అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎలా వస్తాయో గిల్‌ను చూస్తే తెలిసిపోతుంది. కెప్టెన్‌గా వరుసగా రెండు సెంచరీలు చేసిన అరుదైన సారథుల జాబితాలో చేరాడు. కామ్‌గా ఉంటూ.. ఎలాంటి తొందరపాటుకు గురికాకుండా పరుగుల దాహం తీర్చుకుంటున్న గిల్‌ను ఇలా చూడటం బాగుంది" అని యువరాజ్ సింగ్ ప్రశంసించాడు.

# దీపికా పదుకొణెకు అరుదైన గౌరవం..

## తొలి భారతీయ నటిగా రికార్డు

భాషతో సంబంధం లేకుండా అలరిస్తుంటారు నటి దీపికా పదుకొణె ( . తాజాగా ఆమెకు అంతర్జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఎంపికయ్యారు ( ఈమేరకు హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. మోషన్ పిక్చర్స్ విభాగంలో ఆమె ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. ఈ గౌరవం దక్కించుకున్న తొలి భారతీయ నటి దీపిక కావడం విశేషం. హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తాజాగా వెల్లడించిన జాబితాలో డెమి మూర్, రాచెల్ మెక్ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ వంటి హాలీవుడ్ తారలతో పాటు దీపిక పేరు కూడా ఉండడంతో అభిమానులు ఆనందిస్తున్నారు. హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్‌స్టార్ 2026కు 35 మంది ప్రతిభావంతులను ఎంపిక చేసినట్లు ఛాంబర్ తెలిపింది. వినోదరంగంలో గణనీయమైన కృషి చేసినందుకు గాను వీరిని ఎంపిక చేసినట్లు వెల్లడించింది.



నటనతోనే కాకుండా తన స్పీచ్‌లతోనూ దీపికా పదుకొణె ఆకట్టుకుంటుంటారు. 2018లో టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్' (ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు) జాబితాలోనూ ఆమె చోటు దక్కించుకున్నారు. అలాగే 2022లో ఫుట్‌బాల్ ప్రపంచకప్‌ను ఆవిష్కరించి ప్రపంచాన్ని ఆకర్షించారు. 2023లో జరిగిన ఆస్కార్ ప్రదానోత్సవంలో దీపిక 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని నాటునాటుని ఆడియన్స్‌కు పరిచయం చేశారు. 'డు యూ నో నాటు?' తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రం నుంచి 'నాటు నాటు ( ఇదే..' అంటూ ఈ పాటను పరిచయం చేయడంతో వేదిక మొత్తం చప్పట్లతో మారుమోగింది.

2006లో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన దీపిక 2017లో 'త్రిబుల్ ఎక్స్: ది రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' తో హాలీవుడ్ తెరపై మెరిశారు. ప్రస్తుతం అల్లు అర్జున్.. దర్శకుడు అట్లీ కలయికలో రానున్న బహుభాషా చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శక్తిమంతమైన యోధురాలిగా యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. దీని తర్వాత 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్‌లోనూ నటించనున్నారు.




# బాలీవుడ్‌కు ఏమైంది.. ఓ వైపు ఫ్లాప్‌లు.. మరో వైపు భారీ బడ్జెట్లు

బాలీవుడ్‌కు ఏమైంది?.. ఒక వైపు వరుస ఫ్లాప్‌లు, మరో వైపు అంతకంతకు పెరుగుతున్న సినిమా నిర్మాణ వ్యయాలు. ఇవి చాలవన్నట్లు స్టార్ హీరోలు కూడా ఆశించిన స్థాయిలో అభిమానులను థియేటర్ల బాట పట్టించలేకపోతున్నారు. కారణమేదైనా బాలీవుడ్ సరైన హిట్‌ల కోసం కొన్నాళ్లుగా ఎదురు చూస్తోంది. ఒకట్రెండు మినహా ఈ ఏడాది ప్రథమార్ధంలోనూ అదే పరిస్థితి.

'ఛావా' మాత్రమే!

2025లో చూస్తుండగానే ఆరు నెలలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ బాలీవుడ్‌లో 'ఛావా' మాత్రమే బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. సుమారు ?130 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ హిస్టారికల్ మూవీ ?770 కోట్లకుపైగా వసూలు చేసింది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో విక్కీ కౌశల్, రష్మిక మందన అదరగొట్టారు. కానీ, దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'స్కై ఫోర్స్', 'కేసరి: చాప్టర్ 2' ప్రేక్షకులపై ప్రభావం చూపలేకపోయాయి. ఈ రెండింటిలోనూ అక్షయ్ కుమార్ హీరో. అమీర్ ఖాన్ నటించిన 'సితారే జమీన్ పర్' జూన్ 20న విడుదలై, విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. అతి త్వరలోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరనుంది.

స్టార్లు.. మెరవలేదు!


సన్నీ దేవోల్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'జాట్', రాజ్‌కుమార్ రావ్ నటించిన రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'భూల్ చుక్ మాఫ్', అజయ్ దేవ్‌గణ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'రైడ్ 2', జాన్ అబ్రహం పొలిటికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'ది డిప్లొమాట్' తదితర చిత్రాలు ఫర్వాలేదనిపించాయి. ఈ సంవత్సరంలోనూ కొందరు అగ్ర నటులు విజయాన్ని అందుకోలేకపోయారు. స్వీయ దర్శకత్వంలో కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ', సల్మాన్ ఖాన్ 'సికందర్' బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టాయి. సోనూ సూద్ 'ఫతేహ్', షాహిద్ కపూర్ 'దేవా' ఆశించిన స్థాయిలో అలరించలేకపోయాయి. ఓటీటీల్లోనూ బాలీవుడ్ పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. 'ది మెహతా బాయ్స్', 'మిసెస్', 'లాగౌట్', 'కోస్టావో' మంచి వ్యూస్ సొంతం చేసుకున్నాయి. కానీ 'నాదానియన్', సైఫ్ అలీఖాన్ 'జ్యువెల్ థీఫ్' ఆడియన్స్‌ను ఆకట్టుకోలేదు.

రీ'మేకులు'.. సీక్వెల్స్

రీమేక్స్‌లోనూ సత్తా చాటుకోలేకపోయిన బాలీవుడ్ హిట్ మూవీ సీక్వెల్స్‌పైనే ఆధారపడుతోంది. 'రైడ్ 2', 'కేసరి 2', 'ఛోరీ 2', 'హౌస్‌ఫుల్ 5' వంటి సినిమాలు ఆ కోవకు చెందినవే. అయితే ఇందులోనూ అంతంతమాత్రం ఫలితాలే వస్తున్నాయి. ఏది ఏమైనా ఒకప్పటితో పోలిస్తే సక్సెస్ గ్రాఫ్ పడిపోతున్నా.. బాలీవుడ్ మేకర్స్ బడ్జెట్ పెంచుకుంటూనే పోతున్నారు. రెమ్యూనరేషన్లూ అదే స్థాయిలో పెరుగుతున్నాయని టాక్. దీంతో, ఆయా సినిమాలు బాక్సాఫీసు వద్ద రూ.వందల కోట్లు కలెక్ట్ చేసినా ప్రయోజనం ఉండట్లేదు. ఇతర పరిశ్రమల్లా హీరోల మీదే దృష్టి పెట్టకుండా, కథ, కాస్ట్ కటింగ్ వైపు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# సాహో.. కెప్టెన్ గిల్ సాబ్.. ఏమా ఆటతీరు

ఇప్పటికే అర్థమై ఉంటుంది కదా.. ఇంతటి ఉపోద్ఘాతం ఎవరి గురించో.. అతడే భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌తో టీమ్‌ఇండియా సారథిగా ఫుల్‌టైమ్ బాధ్యతలు చేపట్టిన గిల్ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కెప్టెన్‌గా ముందుండి నడిపించాలనే ప్రాథమిక సూత్రాన్ని భలేగా ఔపోశన పట్టాడు. అందుకు తగినట్టుగానే తొలి టెస్టులో సెంచరీ.. ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతోన్న రెండో మ్యాచ్‌లోనూ 'ఓర్పు'తో కూడిన శతకంతో ఆకట్టుకున్నాడు. ఎందుకు ఇక్కడ 'ఓర్పు' అనే పదం వాడటానికి కారణముంది. ప్రత్యర్థి బౌలర్ల నుంచి ఎదురైన సవాల్‌ను ఏకాగ్రత కోల్పోకుండా అతడు చేసిన సెంచరీని చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. మనం పైన అనుకొన్నట్లుగా 96.5 శాతం కంట్రోల్‌గా ఉండి చేసిన శతకమిది. ఒక్కో బంతిని ఆచితూచి ఆడుతూనే.. చెత్త బంతులను సైతం కొడుతూ సెంచరీ సాధించాడు. అప్పటి వరకూ కామ్‌గా పరుగులు రాబట్టిన అతడు సింహనాదంతో సంబరాలు చేసుకున్న తీరూ అభిమానులను ఆకట్టుకుంది.



ఆ మాట గుర్తుందిగా..

తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో గిల్ 147 పరుగులు చేశాడు. కానీ, అతడు ఔటైన తర్వాత భారత బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. అప్పటి వరకూ 500ం స్కోరుపై కన్నేసిన టీమ్‌ఇండియా 471 పరుగులకే ఆలౌటైంది. ఆ మ్యాచ్ అనంతరం గిల్ మాట్లాడుతూ.. 'అనవసరమైన షాట్ ఆడి వికెట్ సమర్పించడం బాధేసింది. ఆ షాట్ ఆడకుండా ఉండాల్సింది' అని అన్నాడు. ఇప్పుడు రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనూ గిల్‌కు కఠిన పరీక్షే ఎదురైంది. ఎడ్జ్‌బాస్టన్ తొలి రోజు బౌలర్లకు సహకరించింది. కొన్ని ఓవర్లు మినహా బంతిని ఆడటం చాలా కష్టంగా మారింది. ఒక వైపు యశస్వి జైస్వాల్ (87) కాస్త దూకుడుగా ఆడుతున్నా.. గిల్‌ను టార్గెట్ చేస్తూ ఇంగ్లిష్ బౌలర్లు ఎటాకింగ్ బౌలింగ్ చేశారు. వాటిని కాచుకున్న గిల్ 199 బంతుల్లో సెంచరీ మార్క్‌ను అందుకోవడం గమనార్హం. యశస్వి జైస్వాల్ అంపైర్స్ కాల్ నిర్ణయాలతో ఓ రెండు అవకాశాలు వచ్చాయి. కానీ, గిల్ ఏమాత్రం ప్రత్యర్థి బౌలర్లకు ఛాన్స్ ఇవ్వలేదు. ఇప్పటికే ఐదు వికెట్లను కోల్పోయిన భారత్‌ను ఆదుకోవాలంటే ఈ సెంచరీని 'డబుల్'గా మార్చాల్సిందే.

సారథిగా మరింత బాధ్యతాయుతం


టెస్టు సిరీస్‌కు ముందు సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాను కెప్టెన్‌గా నియమిస్తారని అంతా భావించారు. కానీ, గంభీర్-టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ మాత్రం బుమ్రాపై అదనపు ఒత్తిడి లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకోలేదు. ఇక టెస్టుల్లో సీనియర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లలో ఒకరిని వరిస్తుందనుకున్నారు. అనూహ్యంగా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేయడంతో సంభ్రమాశ్చర్యానికి గురైన పరిస్థితి. ఎందుకంటే గత ఆస్ట్రేలియా పర్యటనలో ఘోరంగా విఫలమయ్యాడు. వన్‌డౌన్‌లో పరుగులు చేసేందుకు ఇబ్బందిపడ్డాడు. అలాంటి ప్లేయర్‌కు సారథ్యం వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ, గిల్ కెప్టెన్‌గా బాధ్యతాయుతంగా ఆడటం ఈ రెండు టెస్టుల్లో చూశాం. వికెట్లకు దూరంగా వెళ్లే బంతులను శిక్షించాలనే ఉత్సాహాన్ని అదుపులో పెట్టుకొని సాధికారికంగా ఇన్నింగ్స్ కొనసాగిస్తూ భారత్‌ను మెరుగైన స్థితిలో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, స్టోక్స్, బషీర్ నుంచి ఎదురైన కఠిన సవాల్‌కు తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. కెప్టెన్సీ చేపట్టకముందు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో తెగ ఇబ్బంది పడేవాడు. ఇప్పుడు బాధ్యతతో ఆడుతూ పరుగులు రాబడుతున్నాడు.

తొలి భారత బ్యాటర్: ఇంగ్లాండ్‌లో వరుసగా రెండు టెస్టుల్లోనూ తొలి రోజు మొదటి ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన తొలి భారత బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. ఈ సిరీస్‌కు ముందువరకు ఎప్పుడూ అతడు తొలి రోజు/తొలి ఇన్నింగ్స్‌లో శతకం చేయకపోవడం గమనార్హం.

చివరిగా..: కెప్టెన్ లేదా జట్టులోని ఒకరిద్దరు బాగా ఆడినా గెలవకపోవడానికి చాలా కారణాలు ఉంటాయి. టీమ్‌లోని అందరూ కలసికట్టుగా ఆడితేనే విజయం వరిస్తుంది. బ్యాటర్‌గా గిల్ ఇప్పుడు సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సారథిగానూ జట్టును విజయతీరాలకు చేరిస్తే అతడి 'కెప్టెన్సీ' భవిష్యత్తుకు పదేళ్లపాటు ఢోకా ఉండదనేది క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం.

# భారీ సెట్లో కొత్త సినిమా సన్నాహాలు

కథానాయకుడు విజయ్ దేవరకొండ ఇప్పటికే 'కింగ్డమ్'ను )పూర్తి చేశారు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈలోగానే ఆయన మరో చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. విజయ్ ప్రస్తుతం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈనెల రెండో వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. దీనికోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తోంది చిత్ర బృందం. అందులోనే సినిమా సింహభాగం షూట్ చేసుకోనున్నట్లు తెలిసింది. ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రం. 1854 - 1878 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతంలో జరిగే కథగా ఉంటుంది. దీంట్లో విజయ్ శక్తిమంతమైన యోధుడిగా మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనువిందు చేయనున్నారు. ఆయనకు జోడీగా రష్మిక నటించే అవకాశముంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.



# నాయికలకు అదే నిజమైన యుద్ధం

చిత్రపరిశ్రమలో నటీమణులు విజయాన్ని సాధించడం సులభమే.. కానీ దాన్ని నిలబెట్టుకోవడమే నిజమైన యుద్ధమని అంటోంది అందాల తార రష్మిక . ఓవైపు అగ్రతారల సరసన అదరగొడుతూనే.. మహిళా ప్రాధాన్య కథలతో మెప్పిస్తున్న కథానాయికీమె. ఇటీవలే 'మైసా' అనే మరో లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న రష్మిక తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొని తన సినీ ప్రయాణం, ఎంచుకునే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.

''ఈ కాలంలో అందరూ సినిమాల్లోకి రావాలని.. మంచి స్థాయిలో ఉండాలని ఆశపడుతున్నారు కానీ అప్పట్లో ముఖ్యంగా దక్షిణ భారత కుటుంబాలలో చిత్రపరిశ్రమలోకి రావడం తప్పుగా భావించేవారు. ఎందుకంటే వారికి సినీరంగంపై అవగాహన ఉండేది కాదు. నా కెరీర్ ప్రారంభంలో నా కుటుంబం కూడా అంగీకరించలేదు. నాన్న నన్ను మా వ్యాపారంలో చేరాలని అడిగారు. నిజం చెప్పాలంటే నటనను వృత్తిగా ఎంచుకోవాలని నా ప్రణాళికలో లేదు కానీ.. ఆందోళనలు, సందేహాలన్నీ పక్కకు నెట్టి సినీరంగంలోకి అడుగుపెట్టాను. మా కుటుంబంలోనే ఈ వృత్తిని ఎంచుకున్న మొదటి వ్యక్తిని నేను".

నా వ్యక్తిగత నిర్ణయమిది

"వ్యక్తిగతంగా ధూమపానాన్ని ఏ మాత్రం ప్రోత్సహించను. పాత్ర కోసం లేకపోతే.. మరేదైనా కావచ్చు దానికి సంబంధించిన పాత్రను నేను అంగీకరించను. ఇష్టపడను. ఒకవేళ పాత్రకు అనుగుణంగా అలాంటి సన్నివేశాల్లో నటించాల్సిన పరిస్థితే వస్తే.. ఆ సినిమాను వదులుకోవడానికి కూడా వెనకాడను. తెరపై ఎప్పటికీ అలాంటి పాత్రలో కనిపించను. ఎందుకంటే ధూమపానం అనేది నాకు నచ్చని



అంశాల్లో ఒకటి. ఎవరి ఇష్టాలు వారివి కానీ.. ఇది నా వ్యక్తిగత నిర్ణయం మాత్రమే".

# మెడ నొప్పి తగ్గేదెలా?




సలహా: కిడ్నీజబ్బు గలవారు నొప్పి మందులు వేసుకోవటం తగదు. ఒకవేళ కిడ్నీ జబ్బు లేకపోయినా కూడా నొప్పి మందులు పరిష్కారం కాదు. ఇవి నొప్పిని తెలియనివ్వకుండా చేస్తాయే తప్ప సమస్యను పోగొట్టవు. తాత్కాలికంగానే ఉపశమనం కలుగుతుంది. మందు ప్రభావం తగ్గగానే తిరిగి నొప్పి మొదలవుతుంది. నొప్పి పుడుతోందంటేనే ఏదో అస్తవ్యస్తంగా ఉందని అర్థం. మీరు తల కదిలించినప్పుడు నొప్పి వస్తోందని అంటున్నారు. ఆ కదలికలు సరిగా సాగేలా చేయగలిగితే నొప్పి పోతుంది. అయితే నొప్పికి మూలం కండరాలా? కీళ్లా? అనేది తెలుసుకోవాలి.

కండరాలు పట్టేయటం వల్ల నొప్పి వస్తుంటే వాటిని వదులు చేయటం ద్వారా తగ్గుతుంది. ఇందుకు వేడి కాపు, ఐస్ అద్దటం మేలు చేస్తాయి. పట్టేసిన కండరం మీద చేత్తో కాస్త అదిమి పట్టి, సున్నితంగా మర్దన చేయటమూ (సాఫ్ట్ టిష్యూ మొబిలైజేషన్) మేలు చేస్తుంది. ఒకవేళ దీన్ని ఇంట్లో చేసుకోవటం వీలు కాకపోతే ఫిజియోథెరపిస్టును సంప్రదించొచ్చు. దీంతో 60-70% వరకూ నొప్పి తగ్గుతుంది.

సాధారణంగా కీలులో ఏదైనా సమస్య ఉన్నప్పుడు కండరం పట్టేస్తుంటుంది. అందువల్ల మర్దనతో నొప్పి తగ్గకపోతే కీలులోనే సమస్య ఉందని అనుకోవాలి. ఫిజియోథెరపీతో కీలును సరిచేస్తే కండరం మళ్లీ పట్టేయకుండా చూసుకోవచ్చు. నొప్పిని పూర్తిగా తగ్గించుకోవచ్చు. అలాగే మెడనొప్పి మళ్లీ మళ్లీ రాకుండా చూసుకోవటమూ ముఖ్యమే. ప్రత్యేకమైన వ్యాయామాలతో భంగిమ సరిగా, కండరాలు బలంగా ఉండేలా చూసుకోవాలి. కంప్యూటర్, సెల్‌ఫోన్ చూస్తున్నప్పుడు నిటారుగా కూర్చోవటం, నిద్రిస్తున్నప్పుడు మెడకు తగినంత దన్ను ఇచ్చే దిండ్లు వాడుకోవటం వంటి జాగ్రత్తలూ తీసుకోవాలి. ఫిజియోథెరపిస్ట్ అందుబాటులో ఉంటే ఎలక్ట్రోథెరపీ తీసుకోవచ్చు. ఇది నొప్పి తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకసారి నొప్పి తగ్గిన తర్వాత కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలి.

# గుడ్లు పచ్చిగా తినొచ్చా? ఉడికిస్తేనే మంచిదా?



గుడ్లు మంచి పోషక గనులు! ఒక గుడ్డులో 6-7 గ్రాముల ప్రొటీన్, 5 గ్రాముల కొవ్వు, విటమిన్ ఎ, విటమిన్ డి, బి విటమిన్లతో పాటు కంటికి మేలు చేసే కొలీన్, ల్యూటీన్, జియాగ్జాంతీన్ వంటి పోషకాలూ ఉంటాయి. గుడ్డులోని కొవ్వు ప్రధానంగా పచ్చసొనలో ఉంటుంది. అందుకే కొందరు తెల్లసొన మాత్రమే తింటుంటారు. అయితే గుడ్లలోని కొవ్వు చాలావరకూ అన్‌సాచ్యురేటెడ్ రకాలకు చెందిందే. ఇలాంటి రకం కొవ్వులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని భావిస్తారు.

కొందరికి గుడ్లు పడకపోవచ్చు. వీటిని తింటే అలర్జీ రావొచ్చు. సుమారు 2% మంది పిల్లల్లో గుడ్డు అలర్జీ కనిపిస్తుంటుంది. కానీ వీరిలో సగం మంది ఐదేళ్లు వచ్చేసరికి గుడ్డును తట్టుకునే సామర్థ్యం సంతరించుకుంటారు. పదహారేళ్లు వచ్చేసరికి 70% మంది తట్టుకుంటారు. గుడ్లలోని ఓవల్బుమిన్, ఓవోట్రాన్స్‌ఫెరిన్, లైసోజోమ్ వంటి ప్రొటీన్లు పడకపోవటం వల్ల అలర్జీ తలెత్తుతుంటుంది. అప్పుడు దద్దు, వాపు, దగ్గు, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. కొందరు పిల్లల్లో గుడ్లను తిన్న 48 గంటల తర్వాత విరేచనాలు, వాంతి, కడుపు నొప్పి వంటివి వస్తుంటాయి. ఇవి గుడ్డును తట్టుకోలేకపోవటం వల్ల వచ్చే ఇబ్బందులే గానీ అలర్జీ కాదు. పిల్లల్లో రోగనిరోధకశక్తి పరిపక్వమయ్యాక.. అంటే దాదాపు ఏడాది వయసులో గుడ్డును తినటం అలవాటు చేస్తే అలర్జీ తలెత్తకుండా చేయొచ్చు.

గుడ్లను ఉడికించి తింటే తేలికగా జీర్ణమవుతాయి. కొందరు పచ్చి గుడ్లను తింటే బలమని భావిస్తుంటారు. ఒకవేళ వాటిల్లో సాల్మోనెల్లా బ్యాక్టీరియా ఉన్నట్టయితే ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తుంది. దీంతో తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు, తీవ్ర జ్వరం రావొచ్చు. అందువల్ల గుడ్లను ఉడికించి, అట్టుగా వేసుకొని తినటమే శ్రేయస్కరం.

# గుండెకు ఎందుకీ ప్రమాదం?



ప్రస్తుతం గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయి. అదీ చిన్న వయసులో. శారీరకంగా ఫిట్‌గా ఉండి అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు లేకపోయినా హఠాత్తుగా గుండె ఆగిపోయి చనిపోతుండటం విషాదకరం. దీనికి రకరకాల కారణాలు దోహదం చేయొచ్చు.

అన్నింటికన్నా ప్రధానమైంది గుండెలయ తప్పటం. మన గుండె కొట్టుకోవటానికి ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ తోడ్పడుతుంది. ఇది అస్తవ్యస్తమైతే గుండె కొట్టుకునే తీరు దెబ్బతింటుంది (అరిత్మియా). ఇందులో గుండె చాలా వేగంగా లేదూ నెమ్మదిగా కొట్టుకోవచ్చు. కొన్నిసార్లు పూర్తిగా ఆగిపోవచ్చు. గుండెలయ సమస్యల్లో ముఖ్యమైనవి వెంట్రిక్యులర్ టెకీకార్డియా, వెంట్రిక్యులర్ ఫిబ్రిలేషన్. హఠాత్తుగా గుండె ఆగిపోవటానికి 99% వరకూ కారణం ఇవే. వెంట్రిక్యులార్ ఫిబ్రిలేషన్‌లో గుండె కొట్టుకోవటమనేదే ఉండదు. విద్యుత్ వ్యవస్థలో షార్ట్ సర్క్యూట్ తలెత్తినట్టుగా గుండె ఆగిపోతుంది. అదే టెకీ కార్డియాలో గుండె చాలా వేగంగా కొట్టుకుంటుంది. ఇది హఠాన్మరణానికి దారితీయదు గానీ క్రమంగా వెంట్రిక్యులర్ ఫిబ్రిలేషన్‌కు కారణమవుతుంది.

కొందరికి గుండె రక్తనాళాల్లో పూడికలూ కారణం కావొచ్చు. గుండెపోటుతో చనిపోతున్నవారిలో 50% మరణాలకు కారణమిదే. ఇలాంటివారు సాధారణంగా ఛాతీ నొప్పి, అసౌకర్యం వంటి లక్షణాలు మొదలైన గంటలోపు కుప్పకూలుతుంటారు.

జన్యువుల్లో తేడాల వల్ల కొందరిలో కణస్థాయిలో సోడియం, పొటాషియం మార్గాల్లో లోపాలు ఉంటాయి. దీంతో గుండె విద్యుత్ వ్యవస్థ సరిగా పనిచేయక కుప్పకూలుతుంది.

గుండె విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమయ్యే వారికి కొన్ని మందులు.. ముఖ్యంగా యాంటీహిస్టమిన్లు, అజిత్రోమైసిన్ వంటివి ప్రమాదకరంగా పరిణమించొచ్చు. ఇవి వెంట్రిక్యులార్ ఫిబ్రిలేషన్‌ను ప్రేరేపిస్తాయి.

ఇతర భాగాల్లో ఏర్పడే రక్తం గడ్డలు గుండె రక్తనాళాలకు చేరుకోవటంతోనూ (పల్మనరీ ఎంబాలిజమ్) హఠాత్తుగా గుండె ఆగిపోవచ్చు. ఉదాహరణకు- కాలి రక్తనాళాల్లోని రక్తం గడ్డలు కొన్నిసార్లు అక్కడ్నుంచి గుండె రక్తనాళాలకు చేరుకోవచ్చు.

రక్తంలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాల మోతాదులు పడిపోవటమూ కారణం కావొచ్చు.

పొగ తాగటం, గుట్కా నమలటం.. కొకైన్ వంటి మాదక ద్రవ్యాల వాడకంతోనూ హఠాత్తుగా గుండె ఆగిపోయే ప్రమాదముంది.

కొందరికి తీవ్రమైన వ్యాయామం, శారీరక శ్రమ, ఆటలతోనూ గుండె విద్యుత్ వ్యవస్థ విఫలం కావచ్చు. కాకపోతే వీరిలో చాలామందికి అప్పటికే వంశపారంపర్యంగా గుండె కండరం మందం కావటం వంటి గుండె సమస్యలు ఉంటాయి. వీరు తీవ్రమైన శ్రమ చేసినప్పుడు అడ్రినలిన్ హార్మోన్ విడుదలై, విద్యుత్ వ్యవస్థ మీద విపరీత ప్రభావం పడుతుంది.

# పుప్పి పళ్లతో నోటి దుర్వాసన



నోటి దుర్వాసనకు పుప్పి పళ్లూ కారణం కావొచ్చు. దంతాలు క్షీణించినప్పుడు పళ్లకు రంధ్రాలు పడతాయి. ఇవి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి అనువైన వాతావరణం కల్పిస్తాయి. ఈ బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే సల్ఫర్ రసాయనాలు దుర్వాసనకు దారితీస్తాయి. అందువల్ల నోటి దుర్వాసన కొడుతున్న లక్షణాలు కనిపిస్తే దంత వైద్యుడిని సంప్రదించటం మంచిది. రంధ్రాలను పూడ్చితే వాసనా తగ్గుతుంది. అప్పటికీ నయం కాకపోతే ముక్కు చుట్టుపక్కల గాలిగదుల ఇన్‌ఫెక్షన్, గొంతులోకి జీర్ణరసాలు ఎగదన్నుకు రావటం, పళ్ల మీద గార ఏర్పడటం, పొగ తాగే అలవాటు వంటివి కారణమవుతున్నాయేమో చూసుకోవాలి. ఆయా సమస్యలకు చికిత్స తీసుకోవటం, గార తొలగించుకోవటం ద్వారా దుర్వాసన తగ్గించుకోవచ్చు.



# కాళ్లకు సిర సలుపు

శరీరంలోని ఇతర భాగాల కన్నా కాళ్ల మీద అక్కడక్కడా చర్మం రంగు ముదురుగా, నల్లగా అవుతోందా? గంట కన్నా ఎక్కువసేపు నిల్చోవటానికి ఇబ్బంది పడుతున్నారా? నడుస్తున్నప్పుడు కాళ్లు ఉబ్బుతున్నాయా? కొంచెం దూరం నడవగానే కాళ్లలో ఒత్తిడి లేదా అలసిపోయినట్టుగా అనిపిస్తోందా? అయితే జాగ్రత్త పడాల్సిందే. దీర్ఘకాలంగా కాలి సిరలు దెబ్బతినటం, సరిగా పనిచేయకపోవటం (క్రానిక్ వీనస్ ఇన్‌సఫిషియెన్సీ- సీవీఐ) వల్ల ఇలాంటి ఇబ్బందులే పొడసూపుతాయి. కాళ్లు, పాదాల మీద గుండ్రంగా లేదా మచ్చలు మచ్చలుగా నల్లగా అవుతుంటే చాలామంది చర్మ సమస్యనుకుంటారు. ఇలా సిర జబ్బును నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఒంట్లో అన్ని అవయవాల మాదిరిగానే కాళ్లు, పాదాలకూ ఆక్సిజన్ అవసరం. ఇది ధమనుల ద్వారా ప్రసరించే 'మంచి' రక్తం ద్వారానే అందుతుంది. దీనిలోని ఆక్సిజన్‌ను కండరాలు వినియోగించుకున్న తర్వాత మిగిలిన 'చెడు' రక్తం సిరల ద్వారా గుండెకు, అక్కడి నుంచి ఊపిరితిత్తులకు చేరుతుంది. సాధారణంగా మనం శ్వాస ద్వారా పీల్చుకున్న ఆక్సిజన్‌ను ఊపిరితిత్తులు రక్తంలోకి చేరవేస్తాయి. అదే సమయంలో రక్తంలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, బయటకు వెళ్లగొడతాయి. ఆక్సిజన్‌తో నిండిన మంచి రక్తం ఊపిరితిత్తుల నుంచి గుండెకు చేరుకుంటుంది. దీన్ని గుండె పంప్ చేసి శరీరంలోని అన్ని భాగాలకు అందేలా చేస్తుంది. ఇదో నిరంతర ప్రక్రియ. అంటే ఒకరకంగా సిరలు డ్రైనేజీ వ్యవస్థ మాదిరిగా పనిచేస్తాయన్నమాట. ఏ కారణంతోనైనా కాలి సిరల పనితీరు దెబ్బతింటే ఈ డ్రైనేజీ వ్యవస్థ కుప్పకూలుతుంది. ఫలితంగా చెడు రక్తం పైకి వెళ్లకుండా కాళ్ల కింది భాగంలోనే పోగుపడుతూ వస్తుంది. ఇదే సిర జబ్బు (సీవీఐ)కు దారితీస్తుంది. నిజానికిది అంత ప్రమాదకరమైంది, హానికరమైంది కాదు. కానీ నొప్పితో తీవ్ర ఇబ్బంది కలిగిస్తుంది. రోజువారీ పనులకూ ఆటంకం కలిగిస్తుంది. కొందరికి తీవ్రంగానూ పరిణమించొచ్చు. మొదట్లో కాళ్లు ఉబ్బుతాయి. క్రమంగా చర్మం రంగు మారి, నల్లటి మచ్చలు ఏర్పడతాయి. సమయానికి చికిత్స తీసుకోకపోతే పైపైన మచ్చలు చర్మం లోపలికీ చేరుకుంటాయి. వాటి సైజు పెద్దగా అవుతుంది. చివరికి పుండ్లూ పడతాయి. కొన్నిసార్లు వీటికి చికిత్స చేయటమూ కష్టమవుతుంది.

కారణాలేంటి?

దీర్ఘకాలంగా లోపలి సిరల్లో రక్తం గడ్డల మూలంగా చర్మం నల్లబడటం

సీవీఐ కారణంగా చర్మం మీద నల్లటి మచ్చలు ఏర్పడటం

చర్మం నలుపును నిర్లక్ష్యం చేయటం వల్ల పుండ్లు పడటం

కాలి సిరల్లో కవాటాలుంటాయి. రక్తం పైకి వెళ్లగానే మూసుకోవటం వీటి ప్రత్యేకత. ఇలా రక్తం కిందికి జారకుండా చూస్తాయి. ఇవి సరిగా పనిచేయకపోవటమే సిర జబ్బుకు మూలం. కవాటాలు దెబ్బతింటే సరిగా మూసుకోవు. దీంతో గురుత్వాకర్షణ ప్రభావంతో రక్తం పైకి వెళ్లటం కష్టమవుతుంది. కిందికి జారి అక్కడే పోగుపడుతుంది. సిర జబ్బుకు రకరకాల అంశాలు కారణమవుతుంటాయి. అన్నింటికన్నా ముఖ్యమైంది కాలి లోపలి సిరల్లో రక్తం గడ్డలు ఏర్పడటం (డీవీటీ). ఇది గలవారికి సీవీఐ ముప్పు ఎక్కువ. కొన్నిసార్లు డీవీటీ తగ్గినా రక్తం గడ్డలు పూర్తిగా కరగకపోవచ్చు. ఒకవేళ కరిగినా కవాటాలను దెబ్బతీయొచ్చు. దీంతో చెడు రక్తం పైకి వెళ్లే ప్రక్రియ అస్తవ్యస్తమవుతుంది. డీవీటీ గల కొందరిలో రక్తం గడ్డలు సిరల్లో శాశ్వతంగానూ ఉండిపోవచ్చు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని చర్మం రంగు మారుతుంది.

నడకను, వ్యాయామాన్ని చులకనగా చూడటమూ కారణమే. పిక్కను రెండో గుండెగా అభివర్ణిస్తుంటారు. పిక్కలోని కండరాలూ పంప్ మాదిరిగా పనిచేస్తాయి మరి. ఇవి సంకోచిస్తూ సిరల్లోని రక్తాన్ని పైకి నెడతాయి. నడక, వ్యాయామం చేయకపోతే కండరాల పంపింగ్ సామర్థ్యం కుంటుపడుతుంది. దీంతో చెడు రక్తం అక్కడే పోగుపడుతుంది.

కొందరిలో కవాటాలు వెడల్పు కావటంతోనూ అవి సరిగా మూసుకోకపోవచ్చు.

కొందరికి పుట్టుకతోనే కాలి సిరలు సరిగా ఏర్పడకపోవచ్చు. లోపలి సిరలు అసలే ఉండకపోవచ్చు కూడా. ఇలాంటివారికి చిన్న వయసులోనే సిర జబ్బు ముంచుకొస్తుంది.

లక్షణాలు ఇవీ..

కాళ్లు బరువుగా, నొప్పిగా లేదా అలసినట్టు అనిపించటం.

రాత్రిపూట పిక్కలు పట్టేయటం.

నిల్చున్నప్పుడు నొప్పి తీవ్రం కావటం, పాదాలు పైకి పెట్టినప్పుడు హాయిగా అనిపించటం.

కాళ్లలో దురద పెట్టినట్టు, మండినట్లు, సూదులు పొడుస్తున్నట్టు అనిపించటం.

కాళ్ల కింది భాగం, మడమలు ఉబ్బటం. ముఖ్యంగా కొద్దిసేపు నిల్చున్న తర్వాత, సాయంత్రం వేళ ఉబ్బటం.

కాళ్లు లేదా పాదం మీది చర్మం దురద పెట్టటం లేదా పొలుసులు కట్టటం.

చర్మం కళ తప్పటం, రంగు మారటం. నల్లటి మచ్చలు ఏర్పడటం.

పుండ్లు పడటం, పుండ్లు త్వరగా మానకపోవటం. సిరలు ఉబ్బి, మెలికలు తిరిగినట్టు కనిపించటం (వెరికోజ్ వీన్స్).

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy